శ్రీ గురూజీ

జీవన యజ్ఞం

రచన :

శ్రీ ప్ర. గ. సహస్రబుద్ధే

ప్రచురణ :

సాహిత్య నికేతన్

3-4-852 బర్కత్‌పుర, హైదరాబాద్ - 500 027

ప్రథమ ముద్రణ :
క్రోధన వసంతం : ఏప్రిల్ 1985

ప్రతులకు :
సాహిత్య నికేతన్
3-4-852 బరకత్‌పుర
హైదరాబాద్ - 500 027

సాహిత్య నికేతన్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002

వెల : నాలుగు రూపాయలు

ముద్రణ :
పాండురంగా ప్రింటింగ్ వర్క్సు
విజయవాడ - 520 002

ప్రస్తావన

రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ద్వితీయ సరసంఘ చాలక్ పరమపూజనీయ శ్రీ మాధవ సదాశివ గోల్వల్కర్ గురూజీ జీవిత చరిత్ర ఇది.

నేడు రాష్ట్రీయ స్వయంసేవక సంఘం పని దేశమంతటా విస్తరించి ఉంది. సంఘం పేరు ప్రతిష్ఠలు ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నాయి. ఇదంతా ప్రధానంగా శ్రీ గురూజీ నాయకత్వం సాధించినదే. శ్రీ గురూజీ జీవితం త్యాగమయం. తపోమయం. ఆయన మేధావి. ఆత్మజ్ఞాని. వ్యవహార దక్షుడు. మౌలికంగా ఆలోచించే సిద్ధాంత వేత్త మహా వక్త. కఠోరమైన ఆదర్శవాదానికి సముజ్వల ప్రతిబింబం ఆయన జీవితం. అయినా ఆయన పలుకు, పనితీరు మార్దవానికీ, నమ్రతకూ ప్రతిరూపాలు. ఆధునిక యుగంలో అసాధారణ ప్రజ్ఞాశాలి అయిన మహాపురుషుడు ఆయన.

ఆ మహా దేశసేవకుని జీవిత చరిత్రను బాలకులు, కిశోరులు, నవ యువకులు చదవాలని, ఆ జీవితంలోని మహత్తర ఘట్టాలను మననం చేసుకోవాలని, ఆ ఒరవడిలో తమ జీవితాలను వికసింప జేసుకోవాలని, సద్గుణాలతో సంపన్నం చేసుకోవాలని, తమ జీవన పుష్పాలను భరతమాత చరణాల ముందు అర్పించాలనే ఆకాంక్ష వారిలో మొగ్గ తొడగాలని - ఈ ఆలోచనతో శ్రీ ప్ర. గ. సహస్రబుద్ధే ఈ పుస్తకాన్ని హిందీలో రచించారు. శ్రీ కందర్ప రామచంద్ర రావు దానిని తేటతెలుగులోనికి అనువదించారు.

హిందీ పుస్తకాన్ని ప్రచురించిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ప్రకాశన్ విభాగ్, నాగపూరు వారికీ, పుస్తక రచయితకూ, అనువాదకునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

—ప్రకాశకులు

విషయ సూచిక

		పుట
1.	పవిత్ర మూర్తి	1
2.	నేనో పశువుల కాపరిని	4
3.	వంశ పరిచయం	8
4.	ఆదర్శ ఉపాధ్యాయుడు	11
5.	సవాయీ మాధవరావు	13
6.	తల్లి దిద్దిన సంస్కారం	15
7.	వ్రజ నిశ్చయం	17
8.	బహుముఖ ప్రతిభ	20
9.	నా లక్ష్యం ఏమిటి ?	23
10.	సంఘంతో పరిచయం	27
11.	గురూజీ	31
12.	ఇల్లు వదిలి...	33
13.	సారగాఛీ	37
14.	సద్గురువు సేవలో	40
15.	డాక్టర్‌జీ సాహచర్యంలో	42
16.	కలసిన మనసులు	46
17.	దేశ పర్యటన	52
18.	అభినవ అభిమన్యులు	55
19.	రక్తరంజిత స్వరాజ్యం	58
20.	"దైవమే నాకు రక్ష"	61
21.	నిగ్రహానికి పిలుపు	63
22.	మ్రోగింది రణభేరి	66
23.	సత్యాగ్రహ సమరం	68
24.	సన్మాన పర్వం	71
25.	సారథి, సచివుడు	75
26.	అద్భుతం ఆ స్మరణ శక్తి	81
27.	బహుముఖ పాండితీ ప్రతిభ	84
28.	సమయ పాలన	85
29.	భగవంతునిదే భారం	87
30.	నలభై వేల లేఖలు	89
31.	నీలి నీడ	90
32.	విజయ సందేశం	93
33.	మహాభి నిష్క్రమణం	96
34.	స్మారకం వద్దు	98

1. పవిత్ర మూర్తి

"ఆద్య సరసంఘచాలక్‌జీ ఆదేశం ప్రకారం శ్రీ మాధవరావ్‌జీ గోల్వల్కర్ నేడు రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సరసంఘచాలక్ పదవిని స్వీకరించినట్లు నేను ప్రకటిస్తున్నాను. డాక్టర్‌జీవలెనే వారిప్పుడు మనకు వందనీయులు. క్రొత్తగా నియమితులైన సరసంఘచాలక్‌జీకి నేను నా తొలి ప్రణామ్ సమర్పిస్తున్నాను."

ఆ విధంగా ప్రకటన చేసిన తర్వాత నాగపూర్ ప్రాంత సంఘచాలక్ మాననీయ శ్రీ బాబాసాహబ్ పాధ్యేజీ శ్రీ గురూజీకి ప్రణామ్ చేశారు. తమ స్థానానికి వెళ్ళి కూర్చున్నారు. ఆ తర్వాత శ్రీ అబాజీ హెడగెవార్ లేచి నిలబడ్డారు. ఆయన డాక్టర్‌జీ పినతండ్రి. వయోవృద్ధులు ఆయన ఇలా అన్నారు: "మన డాక్టర్‌జీ చనిపోలేదు. మనకు చిరపరిచితులైన మాధవరావ్ గోల్వల్కర్‌జీయే నేటినుంచి మనం డాక్టర్‌జీ. వారి ఆదేశాలను డాక్టర్‌జీ ఆదేశాలుగానే భావించి మనం శ్రద్ధగా పాటించాలి."

ఆ ప్రసంగాలు రేశింబాగ్ సంఘస్థాన్‌లో జరుగుతున్నాయి. 1940 జూలై 3న అక్కడ పెద్ద ఉత్సవం ఏర్పాటుచేశారు. వేలాది స్వయంసేవకులూ, నాగపూర్ పౌరులూ అపూర్వమైన ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు

వర్షాకాలం అప్పటికే ప్రారంభమైంది. ఆ రోజుకూడా వాన కురిసింది. నల్లటి మబ్బులు ఆకాశాన్ని దట్టంగా ఆవరించి ఉన్నాయి. మధ్య మధ్య వాన పడుతున్నదికూడా. అయినా ఆ వాతావరణాన్ని ఏ మాత్రం లెక్కచేయకుండా, గణవేషం ధరించిన వేలాది స్వయంసేవకులు తమకు చిరపరిచితమైన రేశిమ్‌బాగ్ సంఘస్థాన్‌కు వచ్చి చేరారు. ఇతరనగరాలనుంచీ, ప్రాంతాలనుంచీ కూడా స్వయంసేవకులు ఈ కార్యక్రమంకోసం ప్రత్యేకంగా వచ్చారు.

రా. స్వ. సంఘ ఆద్య సరసంఘచాలక్ డాక్టర్ హెడగెవార్‌జీ 1940 జూన్ 21న స్వర్గస్థులైనారు. నేడు 13వ రోజు. ప్రియతముడు, పరమపూజ్యుడు అయిన తమ నాయకునికి శ్రద్ధాంజలి సమర్పించడానికీ, ఆ సందర్భంగా నూతన సరసంఘచాలక్‌కు కార్యభారం అప్పగించడానికీ ఏర్పాటుచేసిన అతిముఖ్యమైన కార్యక్రమం అది. సంఘంలోని ప్రముఖ అధికారులు దాదాపు అందరూ అక్కడ హాజరై ఉన్నారు. ప్రాంతాల వారీగా, నగరాలవారీగా బారులు తీర్చి ఉన్నారు స్వయంసేవకులు. నాగపూర్ నగర స్వయంసేవకులు శాఖలవారీగా నిలబడి ఉన్నారు. ఎదురుగా వేదిక నిరాడంబరంగా, అందంగా ఉన్నది. వేదికమీద ప్రాంత సంఘచాలక్ శ్రీ బాబాసాహబ్ పాధ్యే, వార్ధా జిల్లా సంఘచాలక్ శ్రీ అప్పాజీ జోషి, శ్రీ ఆబాజీ హెడగెవార్, శ్రీ మాధవ సదాశివ గోల్‌వల్‌కర్, ఇతర ప్రముఖులు కూర్చొని ఉన్నారు. కుడివైపున ఎత్తైన ధ్వజస్తంభంపై పరమ పవిత్ర భగవాధ్వజం గగనవీధిలో రెపరెప లాడుతున్నది. ఎదురుగా డాక్టర్‌జీ కర్మ భూమి, చితా భూమి ఉన్నది. ఆ దృశ్యం చూసేసరికే భావుకులైన స్వయం సేవకుల మనస్సులలో గత స్మృతులు ఎన్నెన్నో మెదలుతున్నాయి.

స్వయంసేవకులు కాని పలువురు పురప్రముఖులుకూడా ఆ ఉత్స వంలో పాల్గొంటున్నారు. వారిలో కొందరికి సంఘంపట్ల ఆదరభావం

ఉన్నది. మరికొందరు కేవలం కుతూహలంకొద్దీ అక్కడికి వచ్చినవారు. కారుమబ్బులు కారణంగా వాతావరణాన్ని కొంత నీరవత ఆవరించి ఉన్నది. పలువురి మనసులనుకూడా అనుమాన మేఘాలు ఆవరించి ఉన్నాయి. ఇపుడిక సంఘం ఏమవుతుంది? సంఘ నిర్మాత, సంఘానికి సూత్రధారుడూ, సర్వస్వమూ అయిన డాక్టర్‌జీ వెళ్ళిపోయారు. ఆయన తర్వాత ఇప్పుడీ సంఘం నడుస్తుందా? స్వయంసేవకులంతా డాక్టర్‌జీ జీవించి ఉన్నప్పుడు పనిచేసినట్లుగా ఒకే మనసుతో పనిచేయగలరా?...ఇలాంటిరకరకాల ప్రశ్నలు పలువురి మనస్సులలో మెదలుతున్నాయి. అయితే, వారు తమ కన్నుముందు చూస్తున్న దృశ్యం ఆ అనుమానాలు అన్నింటినీ పటాపంచలు చేస్తున్నది. ఎంత పెద్దకార్యక్రమం ఇది! ఎంత భవ్యమైన కార్యక్రమం! అయినా ఎంతటి అనుశాసనం! ఎంతటి ప్రశాంతత! అన్ని ప్రశ్నలకూ సమాధానం అక్కడ సహజంగా లభిస్తున్నది. చూడు స్వయంసేవకుల నడక చూడు. ఎలా ఛాతీ విరుచుకు నడుస్తున్నారో చూడు. వారు వేస్తున్న ప్రతి అడుగులో దృఢత్వం ఉన్నది ఆత్మవిశ్వాసమూ ఉన్నది పుష్కలంగా. ఆ కార్యక్రమంచెపుతున్నది-సంఘంలో వ్యక్తిపూజ కాక ధ్యేయనిష్ఠ నేర్పుతారని. బంధుప్రేమ, ప్రతిఫలం కోరని త్యాగం, సేవాభావం, నిరంతరం శ్రమించే లక్షణం, తపశ్చర్య -ఈ గుణగణాలు ఆధారంగా సంఘకార్యం ఇంతవరకు నడుస్తూ వచ్చింది. ఇకముందు కూడా ఈ గుణగణాలు ఆధారంగానే శరవేగంతో పురోగమిస్తూ ఉంటుంది. ఈ నమ్మకం ఆ వాతావరణంలో గుండె గుండెపై హత్తుకుంటున్నది.

ఆ విధంగా పాధ్యేజీ కొత్త సరసంఘచాలక్‌గారి పేరు ప్రకటించి, ఆయనకు ప్రణామ్ చేసేసరికి-నలుగడలా ఆనంద తరంగాలు వ్యాపించాయి. ఇంతలో కొత్త సరసంఘచాలక్‌గారు ప్రసంగించడానికై మైక్ వద్దకు వచ్చారు. నల్లగా పొడుగ్గా ఉన్న శిరోజాలు ఆయన భుజాలమీద కదలాడు

తున్నాయి. ఆ చిన్న గడ్డం ఆయన ముఖానికి కొత్త శోభ ఇస్తున్నది. ఆయన ముఖం స్ఫూర్తిప్రదంగా భాసిస్తున్నది. ఆ ముఖం తేజస్సు ఉట్టిపడు తున్నది హిమాలయాలనుంచి అప్పుడే వచ్చిన యువ తాపసి అక్కడ నిలచి నట్లు అనిపించింది. ఆయన విగ్రహం చూడగానే స్వయంసేవకుల మనసులు వికసించాయి ఒడళ్ళు పులకరించాయి. ఎంతో శ్రద్ధగా అంతా ఆయన ప్రసం గాన్ని వినసాగారు.

2. నేనో పశువుల కాపరిని

సరసంఘచాలక్‌గా శ్రీ గురూజీ చేసిన తొలి ప్రసంగం అది. ఆ ప్రసంగం సూటిగా తేటగా ఉంది. అందులో ఆకర్షణ ఉంది. అద్భుతమైన ప్రభావం ఉంది. ప్రసంగ సారాంశం ఇలా ఉంది:

"మీ ఎదుట ఏదైనా మాట్లాడ గలుగుతానా లేదా అని నాకిప్పుడు అనిపిస్తోంది ఎందుకంటే, నా మనస్సు దుఃఖంతో నిండి ఉంది. ఈ దుఃఖ సమయంలోనే నా మీద ఒక గొప్ప బాధ్యత వచ్చిపడింది డాక్టర్‌జీ ఇక లేరు అనే ఊహనే మనం భరించలేము. కానీ, మన పని కేవలం కోమల భావను లపై ఆధారపడినది కాదు. ఆలోచనలపై, సిద్ధాంతాలపై ఆధారపడినది. వాస్తవికతను పూర్తిగా గుర్తించి నడచే పని మనది.

"మన డాక్టర్‌జీ మహాద్రష్ట. త్యాగమూర్తి నిరంతరం శ్రమించిన వ్యక్తి. ఆయన తన జీవితంద్వారా మనముందు ఒక మహత్తరమైన ఆదర్శాన్ని నిలిపి ఉంచారు. తల్లి చూపే వాత్సల్యం, తండ్రి చూపే సామర్థ్యం, ఉపా ధ్యాయుడు చూపే నైపుణ్యం – ఈ మూడూ మనకు ఆయనలో లభించేవి. ఆయన నా ఆరాధ్యదైవం ఆయనను పూజించడం నాకు జీవితంలో

అన్నిటికన్నా ఆనందాన్ని ఇచ్చిన అంశం. ఆయనను పూజించడంలో ఎవరికీ ఎన్నడూ వ్యక్తిపూజ దోషం అంటదు: ఎందుకంటే, ఆయనకు అసలు వ్యక్తిగత జీవితం అన్నది లేనేలేదు. ఆయన జీవితమంతా మహోన్నతమైన సిద్ధాంతాలతో నిండి ఉంది. ఆయన జీవనం త్యాగమయం, సేవామయం, సమర్పితం.

ఆయనను పూజించేటప్పుడు మనం "శివో భూత్వా శివం యజేత్" అనే సూక్తిని పాటించాలి. శివునిగా రూపొంది శివుణ్ణి పూజించు - అని అర్థం ఆ సూక్తికి. కనుక - మనం డాక్టర్‌జీని పూజించాలంటే ఆయనలా తయారు కావాలి. స్వదేశాన్ని గురించి ఆయన ఆలోచన ఎంత తీవ్రంగా ఉండేదో. దేశ అభ్యున్నతికోసం ఆయన ఆత్మ ఎంతగా తపించిపోయేదో. ఆయన చేపట్టిన ఆ వ్రతాన్ని మనం కూడా పాటించాలి.

"తన బలిదానంతో ఆకాశం అంతటినీ తేజస్సుతో నింపడం గొప్ప విషయమే. అందులో సందేహం లేదు. అలాంటి వ్యక్తులను అమరవీరులని పిలుస్తారు.

అయితే, ఎప్పుడూ జ్వలిస్తూ భస్మం అవుతూ ఉండడం, మంచి గంధపు చెక్కలా జ్వలిస్తూ, తన జీవితాన్ని ముగించడం అంతకన్న పెద్ద విషయం. దాని గొప్పతనం వేరు. ఎల్లప్పుడూ నిలచే గొప్పతనం అది. ఎంతో అవసరమైన గొప్పతనం అది. డాక్టర్‌జీ మనకు ఈ పాఠం నేర్పారు. సంఘం పని ప్రారంభమైనప్పుడు ఇలా ఆలోచించే వ్యక్తి డాక్టర్‌జీ ఒక్కరే. నేడు మనం వేలాది స్వయంసేవకులం ఆ భావనలో మునిగి తేలుతున్నాం. ఆ పనిని తనుమన ధన పూర్వకంగా చేస్తామని ప్రతిజ్ఞ చేశాం. మనవంటి ఎన్నెన్నో హృదయాలను వెలిగించడం అనే అసామాన్యమైన కార్యాన్ని డాక్టర్‌జీ చేసి చూపారు.

"డాక్టర్‌జీకి అసామాన్యమైన సామర్థ్యం ఉన్నది. నా వంటి అతి సామాన్యమైన వ్యక్తిపైన ఇంతటి పెద్ద కార్య భారాన్ని మోపడం అందుకో ఉదాహరణ. ఇది చూచినప్పుడు నాకు శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడు ఒకరు గుర్తు వస్తారు. అందరూ అతనిని మొద్దబ్బాయి అనుకునేవారు. ఆరునెలలు కష్టపడినా అతనికి అక్షరాలు అయినా రాలేదంటారు. అయితే, అతడు శ్రీ రామకృష్ణుని పూజా ద్రవ్యాలన్నీ ఎంతో శ్రద్ధగా సమకూర్చేవాడు. పూజకోసం బోలెడు పువ్వులు కోసితెచ్చేవాడు. శ్రీ రామకృష్ణ దేవుడు తన ఇహలోక లీల చాలించే సమయంలో అతని తలపై చేయి ఉంచి అతనిని ఆశీర్వదించారు. కొద్ది రోజులలోనే ఆ శిష్యుడు పండితుడు అయినాడు. ఉపనిషత్తులకు చక్కని భాష్యం చెప్పసాగారు. మహాపురుషులు తమ స్పర్శద్వారా, ఆశీస్సుద్వారా ఏ వ్యక్తికి అయినా గొప్ప సామర్థ్యాన్ని ప్రసాదించగలరు.

"మరో ప్రాచీన కథ కూడా నాకు గుర్తు వస్తోంది. అవంతి నగరం సమీపాన సమ్రాట్ విక్రమాదిత్యుని సింహాసనం భూమిలో కూరుకుపోయింది. అక్కడ ఒక మట్టి దిబ్బ ఏర్పడింది. అక్కడ పశువుల కాపరులు ఆవులను తోలుతూ ఉంటారు. వారిలో హెచ్చుమంది చిన్నవాళ్లు వారిమధ్య ఎప్పుడైనా తగాదా వస్తే, ఒక పిల్లవాడు తక్కున ఆ దిబ్బమీద వెళ్ళి కూర్చుంటాడు. అక్షరాలా న్యాయం చెపుతాడు. విక్రమాదిత్యుడు చేసిన పుణ్యం ఫలితంగా ఆ పశువుల కాపరికి అలౌకికమైన శక్తి అబ్బేది ఈ సరసంఘచాలక్ పదవి కూడా విక్రమాదిత్యుని సింహాసనమే. నేను ఒక పశువుల కాపరిని మాత్రమే. డాక్టర్‌జీ నాకు సరైన ప్రేరణ ఇస్తారు. నా చేత ఏది సముచితమో అదే చేయిస్తారు. ఆ విషయంలో మీరు నిశ్చింతగా ఉండవచ్చు.

"నిష్ఠతో, నిశ్చయంతో సంఘకార్యాన్ని పెంచడం మన బాధ్యత. మన సంఘం తాకితే ముడుచుకుపోయే సోకుడు ముడుగు కాదు. ప్రపంచం అంతటా వివిధ సిద్ధాంతాలూ, వాదాలూ మిడిసిపడుతూ ఉండవచ్చు. ఆ ఘర్షణలో మన పనినశించిపోదు ఇది కష్టాల మంటలలో మాడిపోదు. ఎవరు అణచినా అణగదు. ఇది అభేద్యమైన దుర్గం. దీనిని ముట్టడించే వ్యక్తి తన తల పగలగొట్టుకుంటాడు డాక్టర్‌జీ చూపిన బాటలో మనం ముందుకు సాగిపోదాం. ఇందులో మనకు రెండు ప్రయోజనాలు కలుగుతాయి. మన వ్యక్తిగత జీవితం సఫలం అవుతుంది. రాష్ట్ర కళ్యాణం జరుగుతుంది. మన సంఘకార్యం ద్వారానే హిందూ రాష్ట్రం వైభవం పొందుతుంది. మన హృదయాలలోని ధ్యేయమనే జ్యోతి అఖండంగా వెలుగుతూ నిలచి ఉన్నప్పుడే ఇదంతా సాధ్యపడుతుంది. అంతే కాదు. మనం ఆ జ్యోతిని మరింతగా వెలుగులీనేలా చేయాలి. మనం ఎలాంటి వికారాలకూ లోనుకాకూడదు. ఎలాంటి వ్యామోహాలకూ గురి కాకూడదు. మనం ఎప్పుడూ అడుగు ముందుకే వేయాలి. మన స్వయం సేవకులూ, మిత్రులూ అందరి సహకారంతో ఈ పనిని సక్రమంగా నిర్వహించ గలననే నమ్మకం నాకు ఉన్నది."

శ్రీ గురూజీ చేసిన ఆ ప్రసంగం వింటూ శ్రోతలు మంత్రముగ్ధులు అయినారు. వారి హృదయాలలో అమృతం కురిసింది. వారి మనసులలోని దుఃఖం పటాపంచలు అయింది అనుమానాలన్నీ అంతమైనాయి. చీకట్లు తొలగి వెలుగు రేకలు విచ్చుకున్నాయి.

కార్యక్రమం పూర్తయింది. స్వయంసేవకులూ, పుర ప్రముఖులూ ఇళ్లకు తిరిగి వెళుతున్నారు. వారిలో పలువురి నోట ఇలాంటి వ్యాఖ్యలు వినవచ్చాయి.

"డాక్టర్‌జీకి మనుషులను విలువ కట్టడం తెలుసు. ఆయన ఎంత విలువైన నరరత్నాన్ని ఎంచుకున్నారో చూశారా!"

"ప్రసంగం ఎంతటి ప్రభావం కలిగించిందో! ప్రతి మాటలో ఆత్మ విశ్వాసం మెరుస్తోంది. అయినా ఎంతటి నమ్రత!"

"డాక్టర్‌జీయే యువ రూపంలో ప్రత్యక్షం అయినారని నాకు అనిపించింది."

"ఆయన ఎన్నుకున్న ఒక్కొక్క మాట ఎద లోతులను ఎలా కదిలించిందో!"

"ఆయన చూపిన ఉదాహరణలు చక్కగా అతికినట్లు ఉన్నాయి. చెప్పదలచిన అంశాన్ని స్పష్టం చేసేవిగా ఉన్నాయి."

"ఆయన పేరుకు మాత్రమే గురూజీ కాదు. రాష్ట్ర గురువు, జగద్గురువు కాదగిన లక్షణం ఆయనలో ఉన్నది. అయినా - నేను కేవలం ఒక పశువుల కాపరినే అంటారు ఆయన."

ఆయన ఎవరు ? ఎక్కడి వారు ?

3. వంశ పరిచయం

బొంబాయికి దక్షిణాన సహ్యాద్రికీ, సముద్రానికీ మధ్య గల భూ భాగాన్ని కొంకణప్రాంతం అంటారు. కొంకణంలో గోల్‌వలీ అనే గ్రామం ఉన్నది. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబం ఉన్నది. వారి ఇంటి పేరు పాధ్యే. ఆ కుటుంబం విద్వత్తుకూ, సత్ ప్రవృత్తికీ పెట్టింది పేరు. ఆ కుటుంబానికి చెందిన ఒక శాఖ శ్రీక్షేత్రం పండరిపూర్ వెళ్ళి అక్కడ స్థిర పడింది. "ధర్మ సింధు" అనే గ్రంథం వ్రాసిన బాబా పాధ్యే జన్మించింది ఆశాఖలోనే. ఈ కుటుంబంలోని ఒక ఉపశాఖ పైఠణ్ వెళ్ళింది. అక్కడ

ఆ శాఖవారు గోల్‌వల్‌కర్ అని ఇంటిపేరు పెట్టుకున్నారు. వారిలో కొందరు నాగపూర్, రాయపూర్‌లలో స్థిరపడ్డారు.

గురూజీ తాతగారి పేరు బాలకృష్ణ. ఆయన ఆకస్మాత్తుగా చనిపోయారు. అందువల్ల ఆయన కుమారుడు, అంటే శ్రీ గురూజీ తండ్రిగారు, చిన్న వయసులోనే ఉద్యోగం చేయవలసి వచ్చింది. చదువు మధ్యలో ఆగిపోయింది. ఆయనకు పోస్టాఫీసులో ఉద్యోగం దొరికింది. కుటుంబాన్ని పోషించడానికి ఉద్యోగం చేయడం అవసరం అయింది. కానీ, ఆయనకు సహజంగా చదువుకోవడంలో, చదువు చెప్పడంలో అభిరుచి ఉంది. ఉత్తరాలమీద నల్లటి తపాలా ముద్ర వేయడంలోకన్న పిల్లల మనసులపై చక్కటి సంస్కారాలు ముద్రించే పనిలో ఆయనకు ఆసక్తి హెచ్చు. అందువల్ల ఆయన విద్యాశాఖలో ఉద్యోగంకోసం వెదకారు. ఆయన విద్యాశాఖ అధికారి వద్దకు వెళ్లారు. ఆ అధికారి ఇలా అన్నాడు: "చూడు బాబూ! ప్రతివాడూ పట్టణంలోనే ఉద్యోగం కావాలంటాడు. పల్లెటూరికి వెళ్ళడానికి సిద్ధపడితే నీకు వెంటనే ఉద్యోగం దొరకగలదు రాయపూర్ జిల్లాలోని సరాయపాలీ గ్రామానికి వెళ్లడానికి ఇష్టపడితే, నీకు ఇప్పటికిప్పుడే ఉత్తర్వు జారీ చేయించగలను."

సదాశివరావు ఇలా అన్నారు: "అది నేను కోరుకున్నదే అవుతుంది. పోస్టాఫీసులో తపాలా ముద్రలు వేస్తూ కూర్చొనడం నాకు ఎంతమాత్రం రుచించదు. చదువుకోవడం అన్నా, చదువు చెప్పడం అన్నా, నాకు ఎంతో ఇష్టం ప్రాచీన కాలంలో ఋషులు, మునుల ఆశ్రమాలు అరణ్యాలలోనే ఉండేవి. మీరు నన్ను గ్రామానికే కదా పంపుతున్నారు. నేను సంతోషంగా అక్కడికి వెళతాను. ఉపాధ్యాయుడుగా పని చేస్తాను."

ఇప్పుడు ఉండే ప్రయాణ సౌకర్యాలు ఆ రోజుల్లోలేవు. సరాయ పాలీ గ్రామం రైలుమార్గానికి 60 మైళ్ళ దూరంలో ఉంది. సదాశివరావు కాలినడకన

అక్కడికి వెళ్ళవలసి వచ్చింది. అయినా ఆయన ఉత్సాహంగా సరాయపాలీ చేరారు. ఉపాధ్యాయుడుగా తన బాధ్యతను నిర్వహించారు. ఆయన చదువు చెప్పేవారు. చదువుకునేవారు కూడా. క్రీ.శ. 1893 లో ఆయన మెట్రిక్ ప్యాసయినారు. 1903 లో ఇంటర్, 1910 లో బి.ఏ. ప్యాసయినారు.

ఆ రోజుల్లో చిన్నతనంలోనే పెళ్ళిళ్లు జరిగేవి. 15 సంవత్సరాల వయస్సులోనే సదాశివరావుకు పెళ్ళయింది. ఆయన భార్యపేరు లక్ష్మి. నాగపూర్‌లోని రాయకర్ కుటుంబానికి చెందిన కన్య ఆమె. లక్ష్మీదేవి గృహలక్ష్మి అయింది. ఆమె గుణలక్ష్మి కూడా. ఆమె అక్షరాలా సహధర్మచారిణి. ఒక కర్మయోగినివలె ఆమె సదాశివరావుతో కలిసి కష్టాలను ధైర్యంగా ఎదిరించింది. చక్కని పద్ధతులలో ఇంటిని తీర్చిదిద్దుకునేది. ఆపదలు ఆమెను ఎన్నడూ క్రుంగదీయలేదు.

సదాశివరావును అంతా భావుజీ అని పిలిచేవారు లక్ష్మీబాయిని తాయీ అని పిలిచేవారు. ఇద్దరి స్వభావాలూ వేరు. అయినా వారి దాంపత్య జీవితం పరస్పర పూరకంగా, పోషకంగా ఉండేది. భావుజీది జ్ఞానమార్గం. తాయీది భక్తిమార్గం, భావుజీకి అనుశాసనం ముఖ్యం. ఆయన కర్తవ్యదక్షుడు ఆయనలో కొంత కఠోరత ఉండేది. తాయీ స్నేహశీల. మృదు స్వభావం కలది. భావుజీ మితభాషి. తాయీకి మాట్లాడడం. మాటలు వినడం ఇష్టం. భావుజీకి ఒంటరితనం ఇష్టం. తాయీ అందరితో కలుపుగోలుగా ఉండేది.

1929లో భావుజీ ఉద్యోగ విరమణ చేశారు. నాగపూర్ జిల్లాలోని రామ్‌టేక్‌లో ఇల్లు కొని, అక్కడే స్థిరపడ్డారు.

1942లో ఆయన నాగపూర్ వచ్చారు. చిటారఓలీ అనే వీధిలో అద్దె ఇంటిలో ఉంటూ వచ్చారు. 1954లో భావుజీ తనువు చాలించారు. తాయీ 1962 లో స్వర్గస్థురాలు అయింది.

4. ఆదర్శ ఉపాధ్యాయుడు

సదాశివరావు దృష్టిలో పాఠశాలలో చదువు చెప్పడం వట్టి నౌకరీ కాదు. అది కేవలం డబ్బు సంపాదించే సాధనం కాదు. తన మనసుకు నచ్చిన పని అవి. చదువు చెప్పడంలో ఆనందం అనుభవించేవారు ఆయన. వారి ఇంటివద్ద విద్యార్థులు గుంపులు గుంపులుగా ఉండేవారు. సదాశివరావు అందరికీ ఉచితంగా చదువు చెప్పేవారు చదువు చెప్పడం ఆయన దృష్టిలో జ్ఞాన దాన యజ్ఞం.

విద్యార్థులంటే ఆయనకు ప్రాణం. విద్యార్థులకు ఆయనఅంటే ప్రాణం. విద్యార్థులు దేవతా స్వరూపులని భావించేవారు ఆయన. విద్యార్థులు తప్ప మరే విషయమూ ఆయన అంతగా పట్టించుకునేవారు కారు. ఆయన భయం అనేది ఎరుగరు. ముక్కుసూటిగా మాట్లాడేవారు. స్తోత్రపాఠాలు వల్లించడం ఆయనకు తెలియదు ఆయన ఎవ్వరినుంచీ అక్రమంగా ప్రయోజనం పొందరు. అందువల్ల ఎప్పుడూ ఎవరికీ ముఖస్తుతులు చేయరు.

ఆయన పై అధికారులలో ఒకరికి ఇతరుల వస్తువులను కాజేయడం అలవాటు. ఆ పెద్దమనిషి ఎప్పుడూ చెప్పులుకాని, గొడుగుకాని, అలాంటి ఇతర వస్తువులుకాని కొని ఎరుగడు. ఒకసారి ఒకరి ఇంటిలో తేనేటి విందు జరిగింది. ఆ విందుకు పిలిచిన వారిలో ఈ పెద్దమనిషి కూడా ఉన్నాడు. ఆయన విందునుంచి తిరిగివెళుతూ తళతళ మెరుస్తూన్న కొత్త చెప్పులు తొడుక్కొని బయలుదేరినాడు. పలువురు అది గమనించారు. కానీ, ఆయన పెద్ద అధికారి. ఆయనను ఎవరు మందలించగలరు ? అంతా భయపడి, చూసీ చూడనట్లు ఊరుకున్నారు. సదాశివరావు మాత్రం ఉండబట్టలేకపోయారు. ఆయన లేచారు. తక్కున ఆ అధికారి దగ్గరకు వెళ్ళి, "అయ్యా, మీ చెప్పులు

అదిగో అక్కడ ఉన్నాయి. ఇవి మీవి కావు" అన్నారు అప్పుడు ఆ అధికారి కొత్త చెప్పులు విడిచిపెట్టి, తన చెప్పులు తొడుక్కొని, "అప్పుడప్పుడు పొరపాటు జరుగుతూ ఉంటుంది "అని గొణుగుతూ వెళ్ళబోయాడు. అప్పుడు సదాశివరావు ఆయన చేతిలోనుంచి తన కొత్త గొడుగు తీసుకొని, అక్కడే ఉన్న ఆయనగారి చినిగిన పాతగొడుగును ఆయన చేతిలో పెట్టారు.

సదాశివరావు తరహాయే అంత. చదువు చెప్పడంలో ఆయనను మించిన వారు లేరు. అందువల్ల ఆయన ఎప్పుడూ ఎవరికీ వంగి సలాములు చేయరు. అయితే అందుకు ఫలితం అనుభవించవలసి వచ్చింది కూడా. ఆయనకు బదలీలమీద బదలీలు జరిగేయి దుర్గ్, రాయపూర్, చాందా, భండారా, బాలాఘాట్, నరసింహపూర్, హోశంగాబాద్ వంటి స్థలాలకు ఆయన వెళ్ళవలసివచ్చింది. కానీ ఎక్కడికి బదలీ చేసినా ఆయన అభ్యంతరం చెప్పలేదు. ఎక్కడైనాసరే, విద్యార్థులకు చదువు చెప్పవలసిందేకదా. చదువు చెప్పడం ఆయన చేసే పుణ్యకార్యం. అది ఆయన వ్రతం. ఆయన ధర్మం. తాయీ ఉపవాసాలు పూజలు, అర్చనలలో మునిగి ఉండేది. ఆమె ఆ మార్గంలో పుణ్యం సంపాదించేది. ఇద్దరూ కలసి ఎంతో ఆనందంగా గృహస్థ జీవితం గడుపుతూ ఉండేవారు

కానీ, ఈ జగత్తు ఎంతో విచిత్రమైనది. సుఖాన్ని అంటిపెట్టుకునే ఉంటుంది దుఃఖం. సంతానం విషయంలో భావుజీ, తాయీలు పుట్టెడు దుఃఖం అనుభవించవలసి వచ్చింది. వారికి తొమ్మిదిమంది పిల్లలు పుట్టారు. వారిలో ఏడుగురు చిన్నప్పుడే చనిపోయారు. మూడవవాడు అమృత్. అతను పెద్దవాడు అయ్యాడు కానీ, పదిహేను సంవత్సరాల వయస్సులోనే యముడు అతనిని ఎత్తుకుపోయాడు. మాధవ్ నాల్గవవాడు. అతను ఒక్కడే మిగిలాడు. ఆయన ఎక్కువకాలం జీవించారు. ఎంతో కీర్తి గడించారు కూడా. 'ఏకః చంద్రః తమో హన్తి న చ తారాగణాని చ' — ఒక్క

చందమామ చీకటిని తొలగిస్తాడు; నక్షత్రాలు ఎన్ని ఉన్నా ఆ పని జరగదు. ఈ సుభాషితాన్ని ఆయన సార్థకం చేశారు. "వంశ లతా వహా అమర హుయీ, దేశ హితార్థ జో నిర్వంశ భయీ" అనే సావర్కర్ సూక్తిని మాధవ్ తన జీవితంద్వారా ప్రపంచానికి బోధించారు. తండ్రిగారు పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పారు. మాధవ్ భారతదేశం అంతటా ఆబాలగోపాలానికి పాఠాలు చెప్పారు.

5. సవాయీ మాధవరావు

మాఘ బహుళ ఏకాదశిని విజయ ఏకాదశి అంటారు. శాలివాహన శకం 1827 లో ఆ విజయ ఏకాదశి పర్వదినాన మాధవ్ జన్మించాడు. ఇంగ్లీషు తారీకు ప్రకారం ఆరోజు 1906 ఫిబ్రవరి 19. నాగపూర్‌లో తన మేనమామ ఆబాజీ రాయకర్ గృహంలో అతను జన్మించాడు. పిల్లవాడు తెల్లగా ఉన్నాడు కొనతేలిన ముక్కు. తేజస్సు. నిండిన కళ్ళు. మాధవ్ క్రమంగా పెరిగి పెద్దవాడు అవుతున్నాడు. తన బాల్యక్రీడలతో అందరినీ ముగ్ధులను చేస్తున్నాడు. అతడు జన్మించడంతో రాయకర్ కుటుంబానికి దశ ఎత్తుకుంది. అది అతడు పుట్టిన వేళా విశేషమనీ, అతడు శుభ లక్షణాలు కలిగిన వాడనీ అంతా అనుకున్నారు. ఆ తర్వాతనే సదాశివరావు ఉద్యోగం స్థిరపడింది. ఆయనకు ప్రమోషన్ వచ్చింది. పిల్లవాడికి మాధవ్ అని పేరు పెట్టారు. అంతా ముద్దుగా మధు అని పిలచేవారు. సదాశివరావుమాత్రం అతడిని సవాయీ మాధవరావు అని పిలచేవారు. తన కుమారుడు ముందు ముందు గొప్పవ్యక్తి అవుతాడని ఆయన నమ్మకం.

మాధవ్ కుశాగ్రబుద్ధి. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. శిశువుగా ఉన్న దశలోనే అతడి బుద్ధి అసామాన్యమైనదని రూఢి అయింది.

బాపూజీ పూజకు కూర్చునేటప్పుడు మాధవ్ ఆయన ప్రక్కన కూర్చునే వాడు. అలా విని విని, అతడు ఎన్నో శ్లోకాలూ, స్తోత్రాలూ కంఠస్థం చేశాడు. రామరక్షా స్తోత్రం, మహిమ్నస్తోత్రం వంటి స్తోత్రాలను ఎవరూ అతడిచేత వల్లె వేయించలేదు. అతడు విని వాటిని గుర్తు పెట్టుకున్నాడు. సదాశివరావు వద్దకు విద్యార్థులు ఎప్పుడూ వస్తూనే ఉండేవారు. వారికిచెప్పే పాఠాలను మాధవ్ వినేవాడు. ఆ వెంటనే అప్పచెప్పేవాడు. అన్నయ్య అమృత్ చదువుకునేటప్పుడు మాధవ్ శ్రద్ధగా వినేవాడు. ఆ తర్వాత ఒక్కమాట పొల్లుపోకుండా ఆ విన్న పాఠాలన్నీ వినిపించేవాడు. అలా ఇంగ్లీషులో, మరాఠీలో, హిందీలో చక్కని పాఠాలు ఎన్నెన్నో అతడికి కంఠస్థం అయినాయి.

ఒకసారి అమృత్ వక్తృత్వ పోటీకి పేరు ఇచ్చాడు. ఉపాధ్యా యుడు అతనిచేత ఉపన్యాసం వ్రాయించాడు. అతడు యింటివద్ద దానిని మళ్ళీ మళ్ళీ చదువుతూ ఉండేవాడు. అది మాధవ్ చెవిలో పడుతూ ఉండేది. అలా మాధవ్‌కు కంఠస్థం అయిపోయింది. పోటీకి ముందురోజున అమృత్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది. పోటీలో పాల్గొనడం అతనికి అసాధ్యం అయింది. పాఠశాల తరఫున పోటీలో ఎవరూ పాల్గొనలేక పోతున్నందుకు ఉపాధ్యాయుడు బాధపడ్డాడు

అప్పుడు మాధవ్ ఆయనవద్దకు వెళ్ళాడు. "అమృత్ అన్నయ్యకు బదులు నన్ను పోటీకి పంపరా?" అని అడిగాడు.

"నీవు అసలు ఉపన్యాసం చదవనైనా లేదు. నీవు ఎలా మాట్లాడ గలవు? ముందు దానిని వల్లె వేయాలికాదా?" అని ఉపాధ్యాయుడు సమా ధానం చెప్పాడు.

"చూడండి. నేను ఈ విధంగా మాట్లాడతాను" అంటూ మాధవ్ ఉపాధ్యాయునికి ఉపన్యాసం మొత్తం వినిపించాడు. ఎక్కడా ఆగలేదు.

ఎక్కడా తడబడలేదు. ఒకోచోట గొంతు తగ్గించాడు. ఒకోచోట ఎంతో ఆవేశంతో మాట్లాడాడు. అలా చక్కని శైలిలో ఉపన్యాసం వినిపించాడు. ఉపాధ్యాయుని ఆనందానికి అవధులు లేకపోయాయి. ఆయన మాధవ్‌ను పోటీకి పంపాడు. పోటీలో మాధవ్ మొదటి బహుమతి గెలుచుకున్నాడు.

క్రీ.శ 1917 లో మరో సంఘటన జరిగింది వైనగంగానది ఒడ్డున బ్రహ్మాండమైన విద్యార్థి సమ్మేళనం జరిగింది. అక్కడ రకరకాల పోటీలు నిర్వహించారు వ్యక్తృత్వ పోటీలో మాధవ్ మొదటి బహుమతి గెలుచుకున్నాడు. ముగింపు ఉత్సవానికి బారిస్టర్ ములానా అధ్యక్షత వహించారు ఆయన మాధవ్ ఉపన్యాసాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మాధవ్ కలిసినపుడల్లా అతనిచేత ఒకటిరెండు పేరాలు చదివించి, విని ఆనందించేవారు.

6. తల్లి దిద్దిన సంస్కారం

సాయం సమయం. పాఠశాల వదలిపెట్టారు. మాధవ్ ఇంటికి తిరిగి వస్తున్నాడు. త్రోవలో ఆతనికి ఒక పిల్లవాడు కనపడ్డాడు. అతడు మట్టిలో కూర్చుని ఏడుస్తున్నాడు. అతని పుస్తకాలు చిందరవందరగా పడి ఉన్నాయి. అతని కాలికి దెబ్బ తగిలింది రక్తం కారుతోంది మాధవ్ అతని దగ్గరికి వెళ్ళాడు. పుస్తకాలు పోగుచేసి అతని సంచిలో సర్దాడు. కన్నీళ్ళు తుడిచాడు తనచేయి ఊతం యిచ్చి అతనిని లేవదీశాడు. తన ఇంటికి తీసుకు వెళ్ళాడు ఇంటిలో తాయీ ఉన్నది. తాయీ ఆ పిల్లవాడి గాయం కడిగి, మందువేసి కట్టుకట్టింది. మిఠాయి పెట్టింది ఆ పిల్లవాడు నవ్వుముఖంతో ఇంటికి వెళ్ళిపోయాడు.

అప్పుడు తాయీ అడిగింది "మధూ, నీ స్నేహితుడి పేరు ఏమిటి? అతనిది మీ తరగతేనా?"

"అతడు నా స్నేహితుడు కాడు. నాతరగతి వాడూ కాడు పాపం రోడ్డుమీద కూర్చుని ఏడుస్తున్నాడు. అందుకని అతనిని మన యింటికి తీసుకువచ్చాను" అని మాధవ్ సమాధానం చెప్పాడు.

"సెభాష్ మధూ నీవు చాలా మంచిపని చేశావు. కష్టాలలో, బాధలలో ఉన్నవారికి పరుగు పరుగున వెళ్ళి సాయపడటం మనిషికి కర్తవ్యం" అంటూ వెన్ను తట్టింది తాయీ.

మాధవ్ పరోపకారి గొప్ప భావుకుడు. పుస్తకాలు చదవడం అంటే అతనికి మహా సరదా. హిందీ, మరాఠీ, ఇంగ్లీషు నవలలు ఎప్పుడూ చదువుతూ ఆయా నవలలలోని పాత్రలలో లీనమైపోయేవాడు. ఒక నవలలో కష్టాలలో మునిగి ఉన్న గుణవంతుడైన ఒక బాలుని కథ ఉంది. ఆ కథ చదువుతూ చదువుతూ మాధవ్ ఏడుస్తున్నాడు. తాయీ కొంచెం కంగారు పడింది. ఉన్నట్టుండి మాధవ్‌కు ఏమయింది? దగ్గరకు వెళ్ళి, ఏమి జరిగిందని అడిగింది. మాధవ్ దయనీయమైన ఆ బాలుని కథ వినిపించాడు.

"పాపం అతను ఎలాంటి క్లిష్ట పరిస్థితిలో చిక్కున్నాడో చూడు. అతను అందులోనుంచి బయట పడతాడంటావా?" అని అడిగాడు.

"బాధపడకు. అతను తప్పకుండా బయటపడతాడు. మంచివాళ్ళను దేవుడు రక్షిస్తాడు" అని తాయీ నమ్మకంగా చెప్పింది.

అమ్మ అలా నమ్మకం కలిగించేసరికి మాధవ్ ఎంతో తృప్తిపడ్డాడు. అతని మనసు కుదుటపడింది.

తాయీ తన మాటలతో, చేతలతో మాధవుని పసి మనసు మీద చక్కని సంస్కారాలు ముద్రిస్తూ ఉండేది.

అలాగే, ఒకసారి మాధవ్ ఇంటి ఆవరణలో మేకులు కొడుతున్నాడు. అది చూసి తాయీ ఇలా అన్నది: "మాధవ్, బుద్ధిమంతులు ఈ పని ఎప్పుడూ చేయరు. ఇది మన భూమాత. భూమాత ఒంటిలో మేకులు దించి ఆమెకు బాధ కలిగించడం మంచి పని కాదు."

"భూమాత" అనేమాట మాధవ్ మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది.

7. వజ్ర నిశ్చయం

మాధవ్ పట్టుదల మహాగట్టిది. ఏదైనా ఒక విషయం మనసులో పడితే, ఇతర విషయాలన్నీ వదిలివేసి దానివెంట పడతాడు. అప్పుడు అతని వయసు పన్నెండు సంవత్సరాలు. "రామచరిత మానస" గురించీ, దాని పారాయణంలో ఉన్న మహత్తు గురించీ ఒక ఉపాధ్యాయుడు చెప్పగా మాధవ్ విన్నాడు. ఆ గ్రంథాన్ని చదవాలని నిర్ణయించుకున్నాడు. అవి సెలవు రోజులు. ఉదయం సాయంత్రం, పగలూ రాత్రీ రామాయణం చదువుతూ కూర్చున్నాడు. భోజనానికి అయినా బలవంతాన పిలిచి కూర్చోబెట్టవలసి వచ్చేది. ఐదు రోజులలో అతడు రామాయణం చదవడం పూర్తి చేశాడు. ఊరికే చదవడం కాదు. చౌపాయిలూ, దోహాలూ, ఛందాలూ ఎన్నింటినో కంఠస్థం చేశాడు. చాలా రోజులవరకూ అతని భావజగత్తు రామాయణమయం అయిపోయింది. తాయీకి, తన స్నేహితులకూ అతడు

రామాయణంలోని ఘట్టాలు వినిపిస్తూ ఉండేవాడు. తాయీ అతనిని మరింతగా ప్రోత్సహించేది. "అప్పుడు హనుమంతుడు ఏమన్నాడు ?" అంటూ పని కట్టుకుని అడిగేది. మాధవ్ గంటసేపు ఆ ఘట్టమంతా వినిపించేవాడు.

ఒకసారి మాధవ్ ఒక ఆంగ్ల కవితను మరాఠీ లోనికి పద్య రూపంలో అనువదించాడు. మాధవ్ స్నేహితులు దానిని ఉపాధ్యాయునికి చూపించారు. "ఇది నిజంగా నీవు వ్రాసిందేనా ? నమ్మలేకపోతున్నాను" అని ఉపాధ్యాయుడు మాధవ్‌ను అడిగాడు.

"అనువాదం చేసింది నేనే. కానీ, ఆ విషయం ఎలా రుజువు చేయగలను ? సాక్షులను తీసుకురావడం సాధ్యం కాదు కదా ! అయినా ఒక పని చేయవచ్చు. మీరు మరో కవిత యివ్వండి. మీ ఎదుటే అనువాదం చేయించండి." అని మాధవ్ సమాధానం చెప్పాడు.

ఇంగ్లీషు పాఠ్యపుస్తకంలోని ఒక కవితను ఉపాధ్యాయుడు మాధవ్‌కు ఇచ్చాడు. మాధవ్ అక్కడే ఆయన ఎదుట కూర్చున్నాడు. కొద్దిసేపటిలో మరాఠీలో పద్యరూపంలో దానిని అనువదించి ఇచ్చాడు. ఆ వ్రాతలో ఎక్కడా దిద్దుళ్లూ, కొట్టివేతలూ లేవు మాటమార్చే అవసరం రాలేదు. వ్రాస్తున్నప్పుడు ఎక్కడా ఆగలేదు. నట్టుపడలేదు. కొద్దిసేపు అతడు ఆ కవితో, కవితతో మమేకం అయిపోయాడు. అతడు అలా వ్రాస్తూ పోతున్నాడు. ఉపాధ్యాయుడు ప్రేమగా, ఆశ్చర్యంగా అతనిని పరిశీలిస్తున్నాడు. ఆ మరాఠీ అనువాదం పూర్తిగా చదివి ఆయన విస్తుపోయాడు. "అందంగా ఉంది" "అద్భుతంగా ఉంది" అనే మాటలు ఆయన నోటినుంచి అప్రయత్నంగా వెలువడ్డాయి. ఆయన ఆ అనువాదాన్ని తోటి ఉపాధ్యాయులకు చూపించాడు. అంతా మెచ్చుకున్నారు. ఆ ఉపాధ్యాయుడు ఆ కవితను తరగతిలోని విద్యార్థులు అందరికీ చదివి వినిపించాడు. "మాధవ్ కవిత వ్రాస్తు

న్నప్పుడు అతని తన్మయత్వం చూసితీరాలి. లేఖన-సమాధికి ఉత్తమ ఉదాహరణ అది'' అని ఆయన ప్రతి ఒక్కరికీ చెప్పాడు.

ఇంతటి ప్రశంస అందుకున్నప్పుడు ఎవరికైనా గర్వం కలుగుతుంది. కానీ, మాధవ్ పూర్వంలాగే శాంతంగా, నమ్రంగా, వినయ విధేయతలతో ఉండిపోయాడు.

మాధవ్ ఏ పని తలపెట్టినా, తన శక్తియుక్తులు అన్నింటినీ ఒడ్డి ఏకాగ్రమైన మనస్సుతో దానిని సాధించేవాడు.

మాధవ్ ప్రతి రోజూ ఉదయం నియమం ప్రకారం సూర్యనమస్కారాలు చేసేవాడు. సాయంత్రం హాకీ ఆడేవాడు. వ్యాయామశాలకు వెళ్ళేవాడు. దండీలు, బస్కీలు తీసేవాడు. "మల్‌ఖంబ్ (స్తంభంమీద చేసే కసరత్తు) వ్యాయామం చేసేవాడు. చాందాలోని ఒక ఉపాధ్యాయుడు మాధవ్‌కు వ్యాయామం పట్ల ప్రత్యేక ఆకర్షణ కలిగించాడు. ఆయన స్వయంగా మల్‌ఖంబ్‌లో ఆరితేరిన వ్యక్తి. మాధవ్‌కుకూడా "మల్‌ఖంబ్" వ్యాయామం పట్ల ఆసక్తి ఏర్పడింది.

ఒకరోజున రాత్రి బాగా పొద్దుపోయినా మాధవ్ యింటికి రాలేదు. తాయీ గాబరా పడింది. "మాధవ్ యింకా రాలేదేమిటి ? రోజూ పెందరాళే వచ్చేవాడు కదా'' అని భావుజీతో అన్నది.

"త్రోవలో ఉండి ఉంటాడు. అయినా వాడు పసి పిల్లవాడు కాడు కదా! ఏదో కుస్తీ పోటీ చూస్తూ ఉండిపోయి ఉంటాడు'' అని భావుజీ సమాధానపరచారు.

మరో అరగంట గడిచింది. మాధవ్ అప్పటికీ రాలేదు. తాయీ ఉండబట్టలేక పోయింది. "వాడు ఎప్పుడూ ఇంత ఆలస్యం చేయలేదు. మీరు కాస్త చూసి వస్తే మంచిది.'' అని భావుజీతో చెప్పింది.

ఆ ప్రకారం భావుజీ వ్యాయామ ఉపాధ్యాయుని ఇంటికి వెళ్ళారు. "ఏమండీ మా మధు ఇంకా ఇంటికి రాలేదేమిటి?" అని అడిగారు.

"ఏమిటీ? ఇంతవరకూ ఇంటికి రానేలేదా? పిల్లలంతా ఎప్పుడో వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళిపోయిన తర్వాతే నేను అక్కడి నుంచి బయలు దేరాను." అని ఆయన సమాధానం చెప్పారు.

అప్పుడు ఆయనకో ఆలోచన తట్టింది. మధు వ్యాయామశాలకు తిరిగివెళ్ళి ఉండవచ్చు. అతను పట్టిన పట్టు విడచేవాడుకాడు. ఆయన భావుజీని ఇంటికి వెళ్ళమని చెప్పారు. తాను వ్యాయామశాల వైపు వెళ్ళారు. ఆయన అనుకున్నదే జరిగింది. మాధవ్ వ్యాయామశాలలోనే ఉన్నాడు. మల్ఖంబ్ మీద ఆ రోజునే నేర్పిన కొత్త ప్రయోగం అభ్యాసం చేస్తున్నాడు. అధ్యాపకుడు అతని దగ్గరకి వెళ్ళారు. "సెభాస్ మాధవ్, ఈ రోజు నేర్పిన ప్రయోగం నీకు క్షుణ్ణంగా వచ్చింది. ఇక వెంటనే ఇంటికి వెళ్లు. బాగా ఆలస్యమయింది. భావుజీ, తాయీ నీకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు." అన్నాడు

మాధవ్ క్షణంలో మామూలు బట్టలు వేసుకొని ఇంటి దారి పట్టాడు.

8. బహుముఖ ప్రతిభ

1922లో మాధవ్ చందా హైస్కూలులో చదివాడు. ఆ స్కూలు నుంచి మెట్రిక్ పరీక్ష ప్యాసయ్యాడు. పై చదువుగురించి అతడు ఎవరితోనూ మాట్లాడలేదు. ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు.

అందువల్ల ఒకరోజున భావుజీ తాయీతో ఇలా అన్నారు: "సంగతేమిటి? మన సవాయీ మాధవరావు ఇకముందు ఏమి చేయదలచుకున్నాడు? అందుకు ఏదైనా ఏర్పాటు చేయాలి కదా ?"

తాయీ ఆ విషయం మాధవ్‌ను అడిగింది. "అమ్మా, ఈ సంవత్సరాన్ని నేను హనుమంతుని పాదాలవద్ద సమర్పించాలని అనుకుంటున్నాను. అంటే వ్యాయామం చేయాలని ఉంది. లోకమాన్య తిలక్ ఇలాగే చేశారు. శారీరిక బలం అనే పెట్టుబడి ఆ తర్వాత ఆయనకు ఎంతో ప్రయోజనం కలిగించింది. ముందు ముందు ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనడానికి వీలుగా శరీరాన్ని గట్టి పరచుకోవాలని నా ఆలోచన" అని మాధవ్ జవాబు చెప్పాడు.

4=00
ACC NO. 25474

తాయీ ఆ మాట భావుజీతో చెప్పింది. ఆయన తోడి ఉపాధ్యాయులతో చెప్పారు. ఆ తర్వాత అంతా కలిసి మాధవ్‌ను ఏదోవిధంగా ఒప్పించారు. మాధవ్‌ను డాక్టర్ చేయాలని భావుజీ ఆలోచన. వైద్యవిద్య ద్వారా సేవ, ధనసంపాదన రెండూ సమకూరుతాయని ఆయన హితవు చెప్పారు. ఆ మాట మాధవ్‌కు నచ్చింది. అందుకోసం అతడు పూనా వెళ్లాడు. ఇంటర్ సైన్స్‌లో చేరడానికి ఫర్గ్యుసన్ కాలేజీకి దరఖాస్తు పెట్టాడు కానీ, అప్పుడు అక్కడ ఓ నిబంధన అమలులో ఉంది. ఇతర ప్రాంతాల విద్యార్థులకు ప్రవేశం ఉండదు. అందువల్ల మాధవ్ నాగపూర్ తిరిగివచ్చి, హిస్లాప్ కాలేజీలో చేరాడు.

923.254
SAH

ఉదయం సాయంత్రం వ్యాయామం చేయడం. గ్రంథ పఠనం మంచి మంచి సూక్తులూ, "కొటేషన్స్" ఇలా వ్రాసుకోవడం. వాటిని కంఠస్థం చేయడం. దేవాలయాలకు వెళ్ళి పురాణాలు, ప్రవచనాలు, సంకీర్తనలు వినడం. మిగతా సమయంలో పాఠాలు చదవడం. ఇదీ మాధవ్ దినచర్య.

హిస్లాప్ కాలేజీ క్రైస్తవ మిషనరీలు నడిపే సంస్థ. అక్కడ రోజూ ఒక గంట బైబిల్ బోధనకు కేటాయిస్తారు. విద్యార్థులలో హెచ్చుమంది ఆ క్లాసులకు వెళ్లరు. వెళ్లే వాళ్లుకూడా చెప్పేది సరిగా వినరు. మాధవ్ మాత్రం శ్రద్ధగా వినేవాడు. ఇంటిదగ్గరకూడా బైబిల్ క్షుణ్ణంగా చదివే వాడు. అందులోని పెక్కు అధ్యాయాలు కంఠస్థం చేశాడు.

ఒకరోజున ప్రిన్సిపాల్ గార్డినర్ స్వయంగా బైబిల్‌లోని ఒక అధ్యాయానికి అర్థం చెపుతున్నారు. బైబిల్‌లోని ఫలానా అధ్యాయంలో ఇలా ఉంది అంటూ, ఆయన కొన్ని వాక్యాలు వినిపించారు. అప్పుడు మాధవ్ లేచి నిలబడ్డాడు. "సర్, మీరు ఉదహరించిన వాక్యాలు ఆ అధ్యాయంలో లేవనీ, మరో అధ్యాయంలో ఉన్నాయనీ నా మనవి"—అని చెప్పాడు. గార్డినర్ వెంటనే బైబిల్ ప్రతి తెప్పించి చూశారు. ఆయన ఉదారుడు. ఆయన మనసు మంచిది. గోల్‌వల్‌కర్ చెప్పింది నిజమేనని ఆయన గుర్తించారు. గోల్‌వల్‌కర్‌ను ముక్తకంఠంతో ప్రశంసించారు. ఆ రెండు సంవత్సరాలలో మాధవ్ బైబిల్‌కు సంబంధించిన అనేక గ్రంథాలు చదివాడు.

ఆ రోజుల్లోనే వేణువు వాయించే సావలారామ్‌జీతో మాధవ్‌కు గాఢ స్నేహం ఏర్పడింది. అతడు రోజూ అంధుడైన సావలారామ్ ఇంటికి వెళ్ళి వేణువు వాయించడం నేర్చుకొన్నాడు. కొద్దికాలంలోనే అతనికి వేణువు వాయించడంలో మంచి నైపుణ్యం అలవడింది. అతడు సావలారామ్‌జీకి ప్రియశిష్యుడు అయినాడు. ఆయనను సైకిలుమీద ఎక్కించుకు తీసుకొని వెళ్లేవాడు. ఆయనకు చిన్నా పెద్దా పనులు చేసిపెట్టేవాడు.

ఇన్ని పనులు చేస్తూకూడా మాధవ్ ఇంటర్ సైన్స్ పరీక్షలో చక్కటి మార్కులు తెచ్చుకున్నాడు. ఇంగ్లీషులో మెడల్ సంపాదించాడు. ఆ తర్వాత మెడికల్ కాలేజీలో సీటుకోసం లక్నో వెళ్ళాడు. సీటు దొరకలేదు. అప్పుడు కాశీ వెళ్ళి విశ్వవిద్యాలయం విజ్ఞానశాస్త్ర విభాగంలో చేరాడు.

కాశీలో ఉన్నంతకాలం మాధవ్ రోజూ గంగానదిని తప్పకుండా దర్శించేవాడు. ఒకోసారి వెళ్ళి ఘాట్‌మీద కూర్చునేవాడు. ఒకోసారి ఇసుక తిన్నెలమీద పడుకునేవాడు. ఒకోసారి పడవ షికారుకు వెళ్ళేవాడు. ఒకోసారి నదీజలాలను తదేకంగా చూస్తూ ఉండిపోయేవాడు. ఒకోసారి అక్కడే ధ్యానం చేసేవాడు. అప్పుడప్పుడు పండిత మదనమోహన మాలవ్యా వద్దకు వెళ్ళి కూర్చునేవాడు. తరచు శ్రీరామకృష్ణ ఆశ్రమానికి వెళ్ళి, అక్కడి సేవా కార్యక్రమాలలో పాల్గొనేవాడు. ఆ రోజులలో అతడి అధ్యయనం బాగా పెరిగిపోయింది. భారతీయ తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి శాస్త్రాలలో మూలగ్రంథాలు, ప్రమాణ గ్రంథాలు అనేకం అతడు అధ్యయనం చేశాడు. 1926 లో బి ఎస్‌సి ప్రథమ శ్రేణిలో ప్యాసయ్యాడు. 1928 లో జీవశాస్త్రంలో ఎమ్. ఎస్ సి ప్రథమ శ్రేణిలో ప్యాసయ్యాడు.

9. నా లక్ష్యం ఏమిటి ?

తేజస్వి, మేధావి, అధ్యయనశీలి అయిన ఆ యువకుణ్ణి అందరూ ఇప్పుడు మాధవరావు అని పిలుస్తున్నారు. ఎమ్. యస్‌సి. ప్యాసయి ఆయన ఇంటికి తిరిగి రావడంతో బాపుజీ, తాయీలు ఎంతగానో ఆనందించారు. మనం అల్లారు ముద్దుగా పెంచిన మధు విద్యాశాఖలో ఉద్యోగం చేయాలి. పెళ్ళిచేసుకోవాలి. ముసలితనంలో మనకు అండగా ఉండాలి. ఇలా అనుకుని, వారు తమ భావాలను మాధవరావుకు తెలిపారు మాధవరావు తన అభిప్రాయం వారికి ఇలా తెలిపారు. "నేను ప్రభుత్వ ఉద్యోగం చేయను. ఎన్నడూ ఆంగ్లపాలకులకు సేవ చేయలేను. నేను పై చదువు చదవాలి. జీవశాస్త్రంలో పరిశోధన చేయాలని ఉంది. డి. ఎస్‌సి. చేయాలని ఉంది."

భావుజీకి విద్య అంటే ప్రాణం. తన కుమారుడు అత్యున్నత విద్య అభ్యసించాలని ఆయన కోరిక. మరో ప్రక్క, తనకు ఒక్కగానొక్క కొడుకు. అతడు త్వరలో స్థిరపడాలి. తాయీ అభిప్రాయమూ అదే. ఆమె తన మనసులోని మాట భర్తకూ, కొడుకుకూ పదే పదే చెపుతూ ఉండేది. భావుజీ మనసులో కొద్ది సమయం సంఘర్షణ జరిగింది. చివరికి విద్యాభిమానమే గెలిచింది. ఆయన మాధవరావుకు అనుమతి ఇచ్చారు. జీవ శాస్త్రంలో ఉన్నత విద్యకు మద్రాసులో మంచి ఏర్పాట్లు ఉన్నాయి. అందువల్ల మాధవరావు మద్రాసు చేరారు.

మద్రాసు వాతావరణం, అక్కడి నీళ్లు, అక్కడి ఆహారం అంతా వేరు. అవి మాధవరావుకు పడలేదు ఆయనకు తరచు జ్వరం వచ్చేది. తండ్రిగారు ఉద్యోగ విరమణ చేశారు. అందువల్ల తగినంత డబ్బు పంపలేకపోతున్నారు. పెద్ద పెద్ద పుస్తకాలు కొనవలసి వచ్చింది. డాక్టర్లకూ మందులకూ బోలెడు డబ్బు ఖర్చయింది. ఇలా ఆరోగ్యమూ, ఆర్థిక పరిస్థితీ దెబ్బతిన్నాయి. ఇందుకుతోడు ఆయన మనసులోకూడా సంఘర్షణ ప్రారంభమైంది.

భవిష్యత్తులో నేను ఏమి చెయ్యాలి ? నా జీవన లక్ష్యం ఏమిటి ? దిగజారిపోతున్న దేశపరిస్థితిని మెరుగుపరచడానికి నేను ఏమి చెయ్యగలను ? ఏమి చేయాలి? ఆంగ్లపాలకుల అత్యాచారాలు మితిమీరిపోతున్నాయి. వారితో పోరాటం సాగించడం నా కర్తవ్యం కాదా ? విప్లవవాదుల ఉద్యమం దేశవ్యాప్తం కాగలదా ? సామాన్య ప్రజలు విప్లవోద్యమ కార్యకలాపాలలో పాల్గొనగలరా ? సత్యాగ్రహం, స్వదేశీ, బహిష్కరణలవంటి మార్గాలద్వారా మనకు స్వరాజ్యం లభిస్తుందా ? బానిసత్వ బంధాలనుంచి మన దేశాన్ని విముక్తి చేయడం ఎలా ? మన సమాజంలో కార్యశీలతనూ, సాహసాన్ని నిర్మించడం ఎలా ? భారతదేశం తన ప్రాచీన గౌరవాన్ని తిరిగి పొందడం

ఎలా? ఈ పనులు అన్నింటిలో నా బాధ్యత ఏమిటి? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు ఆయనను వేధిస్తున్నాయి

ఇలా శారీరికంగా, ఆర్థికంగా, మానసికంగా, బుద్ధిపరంగా సంఘర్షణలో తలమునకలు అవుతూ కూడా — తన కార్యకుశలత కారణంగా, పరోపకార స్వభావం కారణంగా, ఆయన తోడి విద్యార్థుల ప్రేమనూ, అధ్యాపకుల వాత్సల్యాన్నీ చూరగొన్నారు. విశ్వవిద్యాలయంలో ఏ కార్యక్రమం జరిగినా, మాధవరావ్ గోల్వల్కర్ దానికి సూత్రధారిగా ఉండేవారు. ఆయనలోని స్వార్థరాహిత్యం, పని నేరుపు అందరి మన్ననలూ అందుకున్నాయి.

మద్రాసులో ఒక పెద్ద మత్స్యాలయం ఉంది. పెద్ద తరగతి విద్యార్థులకు దాని అజమాయిషీ అప్పజెప్పారు. మత్స్యాలయాన్ని చూడటానికి వచ్చేవారు ప్రవేశ రుసుము చెల్లించాలి. ఒకరోజున నిజాం నవాబు సపరివారంగా మత్స్యాలయాన్ని చూడటానికి వచ్చారు. ఆయన అసలే పిసినారి. నేను నవాబును. ప్రవేశ రుసుము కట్టమని నన్ను ఎవరు అడుగుతారు? అని ఆయన అనుకుని ఉండవచ్చు. అంత గొప్పవ్యక్తి. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన వ్యక్తి. సుల్తాను. రుసుము ఇవ్వమని ఎవరు అడుగుతారు? ఎలా అడుగుతారు? అడిగితే ఏం ప్రమాదమో! ఉద్యోగం పోయినా పోవచ్చు-అని మత్స్యాలయం ఉద్యోగులు భావించారు. అందువల్ల ఎవ్వరూ ముందుకు రాలేదు. ఎవరికీ ఆ ధైర్యం లేకపోయింది. అప్పుడు మాధవరావ్ సరాసరి నిజాము నవాబు వద్దకు వెళ్ళారు. "అయ్యా! ఇక్కడ ప్రవేశ రుసుము కట్టవలసి ఉంటుంది. కట్టి టికెట్లు తీసుకోకుండా మీరుకాని, మీవెంట ఉన్నవారుకాని లోపలికి వెళ్ళడానికి వీలులేదు" అన్నారు.

ఆ మాట వినగానే నిజాం నవాబు తన అంతరంగిక కార్యదర్శివైపు

చూశారు. అతడు టికెట్లు కొన్నాడు. విద్యార్థులు వారికి మత్స్యాలయం చూపించారు.

వారంతా వెళ్లిపోయిన తర్వాత మత్స్యాలయం అధికారులు ఆందోళన చెందారు. "మనం వీరినుంచి రుసుము తీసుకోకపోతే మిన్ను విరిగి మీద పడేదా? సంస్థకు నష్టం వచ్చేదా?" అని ఒక అధికారి వ్యాఖ్యానించాడు.

మాధవరావు ఇలా జవాబు చెప్పారు : "ఇది లాభ నష్టాలకు సంబంధించిన విషయం కాదు. నియమ పాలనకు సంబంధించిన విషయం. అంతా సక్రమంగా నియమాన్ని పాటించాలి. పెద్దవాళ్లని పిలువబడేవాళ్లు మరింత శ్రద్ధగా నియమాన్ని పాటించాలి. సామాన్యులు ఎప్పుడూ పెద్దవాళ్లను అనుసరించి నడుచుకుంటూ ఉంటారు. మినహాయింపు అంటూ ఇవ్వవలసివస్తే- పేదవాళ్లకే ఆ సౌకర్యం కల్పించాలి."

మాధవరావు ఆరోగ్యం మరింతగా దెబ్బతిన్నది. మద్రాసులో ఉండటం అసాధ్యమైపోయింది. పరిశోధనను సగంలోనే వదులుకోవలసివచ్చింది. ఆయన నాగపూరు తిరిగివచ్చారు. చికిత్స ప్రారంభమైంది. క్రమంగా ఆయన ఆరోగ్యం మెరుగైంది. ఆ రోజుల్లో ఆయన శ్రీరామకృష్ణ ఆశ్రమానికి తరచు వెళ్లేవారు. ఆశ్రమం అధిపతి శ్రీ భాస్కరేశ్వరానందజీతో ఆధ్యాత్మిక విషయాలపై చర్చ జరిపేవారు. స్వామిజీ మాటలు వింటూ మాధవరావు తన్మయం చెందేవారు. ఆ రోజుల్లోనే వివేకానందస్వామి సాహిత్యం అంతనూ మరోమారు చదివారు.

ఇంటి ఆర్థిక పరిస్థితి ఉద్యోగం చేయమని మాధవరావును ఒత్తిడి చేస్తున్నది. ఆయన అందుకు ప్రయత్నాలు సాగించారు. అదృష్టవశాత్తు 1930లో ఆయనకు కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో లెక్చరర్ ఉద్యోగం లభించింది.

10. సంఘంతో పరిచయం

కాశీ వాతావరణం మాధవరావుకు పరిచితమే. ఆయనకు బాగా నచ్చిన వాతావరణం అది. ఇక విద్యాబోధన ఆయన స్వభావానికి అనుగుణమైనది. ఆయన అభిరుచికి పోషకమైనది. ఉదయం స్నానసంధ్యలు ముగించుకుని, ఆయన ఆ రోజు చెప్పవలసిన పాఠం తయారుచేసుకునేవారు. ఒకరోజున చెప్పవలసిన విషయం తేలికగా ఉన్నప్పటికీ, ఆయన దానిని చదివేవారు. విద్యార్థులకు ఏవిధంగా బోధించాలో ఆలోచించుకునేవారు. నోట్సు తయారు చేసేవారు వివిధ విషయాలలో ఆయన జ్ఞానసంపద అపారమైనది. ఆయన పాఠం చెప్పే తీరులో విజ్ఞానం, వినోదం కలబోసుకుని ఉండేవి. ఆయన విద్యార్థులతో కలుపుగోలుగా ఉండేవారు వ్యక్తిగత విషయాలు అడిగి తెలుసుకునేవారు. ఆయన తమ పెద్దన్నగారని విద్యార్థులకు అనిపించేది. వారు ఆయన ఇంటికి వచ్చిపోతూ ఉండేవారు. ప్రేమతో, ఆదరంతో గురూజీ అని ఆయనను పిలువసాగారు.

ఆయన సాయంత్రంపూట టెన్నిస్ ఆడేవారు ఇంటికి వచ్చి సంధ్యా వందనం చేసి, స్వల్పంగా భోజనంచేసి చదువు మొదలుపెట్టేవారు. అలా రాత్రి రెండు గంటలవరకూ చదివేవారు. ఉపనిషత్తులు, సంస్కృతంలోని మహాకావ్యాలు, పాశ్చాత్య దర్శనశాస్త్రం, సమాజశాస్త్రం, రాజనీతిశాస్త్రం వంటి విషయాలలో ప్రామాణిక గ్రంథాలు చదివేవారు. ఆయన గదిలో ఎటు చూసినా పుస్తకాలు పడి ఉండేవి. ఆయన చదువు నిర్విరామంగా కొనసాగేది. ఒక రోజున ఆయనకు తీవ్రంగా జ్వరం వచ్చింది. అయినా ఆయన చదువుతూనే ఉన్నారు.

"ఆరోగ్యం బాగుండలేదు. జ్వరం హెచ్చుగా ఉంది. అయినా ఆయన చేతిలో పుస్తకం ఉంది. ఇది వట్టి మొండిపట్టు" అని ఒక మిత్రుడు అన్నాడు.

"భాయీ, జ్వరం దాని పని అది చేస్తోంది. నేను నా పని చేస్తున్నాను. మొండిపట్టు ఆ జ్వరానిదే. నాది కాదు. ఇది నేను రోజూ చేస్తున్నదే"-అని మాధవరావ్ జవాబు చెప్పారు.

ఒక రోజున ఆయన కాలికి తేలు కుట్టింది. విషం దిగడానికై ఆయన నీళ్లు నిండిన బకెట్‌లో కాలు పెట్టారు. ప్రశాంతంగా చదువుకుంటున్నారు. "చిత్రంగా ఉందే. తేలు కుట్టింది. బాధ పెడుతోంది. అయినా చదువు సాగిపోతోంది"—అని ఒక మిత్రుడు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"భాయీ, తేలు నా కాలుమీద కుట్టింది. తలమీద కుట్టలేదు"—అని గురూజీ నవ్వుతూ జవాబు చెప్పారు

పుస్తకాలు చదవడం అంటే ఆయనకు అంత ఇష్టం. ఆయన మనసుకు ఉన్న ఏకాగ్రత అలాంటిది. పాఠం చెపుతున్నప్పుడుకూడా ఆయన అందులో పూర్తిగా లీనమైపోయేవారు. మంచి విద్వత్తు, చదువు చెప్పడంలో ఎంతో నేర్పు కలిగిన అధ్యాపకుడుగా ఆయన పేరుపొందారు. అంతకు మించి, ఆయన పరోపకారం ప్రవృత్తి ఎందరినో ఆకర్షించింది. ఎందరో పేద విద్యార్థుల పరీక్ష ఫీజు ఆయన కట్టేవారు. ఎందరికో పుస్తకాలు కొనడానికి డబ్బు ఇచ్చేవారు. జబ్బుపడిన విద్యార్థులను ఆయన స్వయంగా డాక్టరు వద్దకు తీసుకువెళ్లేవారు. స్వంత ఖర్చుతో వారికి మందు ఇప్పించేవారు.

భయ్యాజీ దాణీ. ఆయన స్నేహితుడు భయ్యాజీ హెచ్చు సమయం సంఘం పనికి, ఇతర సామాజిక కార్యకలాపాలకూ వినియోగించే

వారు. తన బి.ఏ. పుస్తకాలు ముట్టుకోలేదు. అందువల్ల పరీక్షకు వెళ్లకూడ దని నిర్ణయించుకున్నారు మాధవరావుకు ఆ సంగతి తెలిసింది. ఆయన భయ్యాజీని పిలిపించారు. "నీవు పరీక్షకు వెళ్లవలసిందే" అని నొక్కి చెప్పారు.

"నేను అసలు పుస్తకాలు ముట్టుకోనేలేదు. పరీక్షలో ఏమి వ్రాస్తాను" అని భయ్యాజీ సందేహం వ్యక్తం చేశారు.

"నేను నీచేత చదివిస్తాను. నేను తయారుచేసే నోట్సు క్షుణ్ణంగా చదువు ప్యాసైపోతావు" అని మాధవరావు ఉపాయం చెప్పారు.

భయ్యాజీ సరే అన్నారు. మాధవరావు బి.ఏ పుస్తకాలు అన్నీ చదివారు. నోట్సు తయారుచేశారు. ప్రశ్నలు, జవాబులు వ్రాశారు. భయ్యాజీ చేత ముఖ్య భాగాలన్నీ కంఠస్థం చేయించారు. భయ్యాజీ పరీక్షకు వెళ్లారు. ప్యాసయ్యారు. ఇతర విద్యార్థులలాగే ఆయనకూడా మాధవరావును గురూజీ అని పిలవసాగారు.

భయ్యాజీ కారణంగా కాశీ హిందూ విశ్వవిద్యాలయంలోని ఇతర స్వయంసేవకులు కారణంగా మాధవరావుకు సంఘంతో పరిచయం ఏర్పడింది. సంఘ సంస్థాపకులు డాక్టర్ హెడగెవార్‌జీ కాశీ వచ్చినప్పుడు కార్యకర్తలు మాధవరావును ఆయన వద్దకు తీసుకువెళ్ళారు. మాధవరావు డాక్టర్‌జీ వ్యక్తిత్వాన్ని చూశారు. ఆయనతో మాట్లాడారు. ఎంతగానో ప్రభావితులు అయినారు. నాటినుంచి అప్పుడప్పుడు సంఘశాఖకు వెళుతూ ఉండేవారు.

సంఘ ఉత్సవం చూడటానికి నాగపూరు రావలసిందిగా డాక్టర్ హెడగెవార్‌జీ ఆయనను ఆహ్వానించారు. ఆ ప్రకారం ఆయన నాగపూర్

వచ్చారు. డాక్టర్‌జీ ఆయనను తనతోపాటు భండారా తీసుకువెళ్ళారు. మాధవరావు అక్కడి సంఘశాఖ చూశారు. ఈ పర్యటనలో మాధవరావు డాక్టర్‌జీని సన్నిహితంగా చూశారు. సంఘాన్ని గురించి ఎన్నో ప్రశ్నలు వేశారు. డాక్టర్‌జీ చెప్పిన సమాధానాలు విని తృప్తి పొందారు. నాగపూర్ నుంచి కాశీ తిరిగివెళ్ళారు. ఆ తర్వాత కాశీలోని సంఘశాఖ గురించి మరింత శ్రద్ధ తీసుకోవడం మొదలుపెట్టారు.

ఆ రోజుల్లో సంఘశాఖలో ప్రాథమిక సైనిక శిక్షణ గరపేవారు. కవాతు చేస్తున్నప్పుడు స్వయంసేవకులు కర్రతో తయారైన నకిలీ తుపాకులు ఉపయోగించేవారు. స్వయంసేవకుల సంఖ్యతో పోల్చితే తుపాకులు తక్కువగా ఉన్నాయి. క్రీడలు, వ్యాయామాలకు వాడే ఇతర పరికరాలూ తక్కువగానే ఉన్నాయి. యోగచాప్‌లూ కొత్తవి తయారు చేయించవలసి ఉన్నది ఈ సంగతి మాట్లాడుకోవడం మాధవరావు విన్నారు. ఎవరితోనూ చెప్పకుండా ఆయన ఆ పరికరాలు అన్నింటినీ తయారు చేయవలసిందిగా పనివాళ్ళను పురమాయించారు. వాటికయిన ఖర్చు తాను భరించారు. ఆ పరికరాలు అన్నింటినీ సంఘ కార్యాలయంలో అమర్పించారు.

అందంగా మెరుస్తూ ఉన్న ఆ పరికరాలన్నీ ఒకేసారి రావడం చూసి స్వయంసేవకులంతా చకితులైనారు. మరి ఈ పరికరాలు అన్నింటినీ తయారు చేయించింది ఎవరు ? తయారుచేసిన పనివాళ్ళు ఎవరు ? ఆ పని పురమాయించింది ఎవరు ? ఆ ఖర్చు భరించింది ఎవరు ? చాలా రోజుల వరకు ఈ ప్రశ్నలకు జవాబులు ఎవరికీ దొరకలేదు. తాను చేసిన మంచి పని గురించి మాధవరావు నోటినుంచి ఎన్నడూ ఒక్క అక్షరమైనా వెలికి రాలేదు.

మాధవరావు స్నేహితుడు ఒకరికి రాజకీయాలను గురించి వాదించడం మహా సరదా. ఒకరోజున ఆయన ఒక వాదాన్ని ఆవేశంగా సమర్థించ

సాగాడు అప్పుడు మాధవరావు ఆయనతో ఇలా దృఢంగా చెప్పారు: "నేను చెప్పేమాట వ్రాసి ఉంచుకో. ఒకరోజున సంఘవాదం వెల్లువలా పెల్లుబుకు తుంది. సంఘం పేరు దశదిశలా మారుమ్రోగుతుంది. నేడు సామ్యవాదం, సమాజవాదం వంటి వాదాల నగారాలు మ్రోగుతున్నాయి. అయితే సంఘవాదం ముందు అవన్నీ వెలాతెలాపోయే రోజు వచ్చి తీరుతుంది."

11. గురూజీ

సంఘ స్వయంసేవకులు అధిక సంఖ్యలో మాధవరావ్‌జీ ఇంటికి వెళ్ళిరావడం మొదలుపెట్టారు. మాధవరావ్‌జీ కూడా తరచు స్వయంసేవకుల ఇళ్ళకు వెళ్లేవారు. సిద్ధాంత చర్చల పరిధి దాటి ప్రేమతో, బంధుభావనతో కూడిన సంబంధం ప్రారంభమైంది. ఏ స్వయంసేవక్‌కు ఇబ్బంది వచ్చినా, ఆయన ఎంతో ఆత్మీయతతో దానిని తొలగించేవారు. స్వయంసేవకులమధ్య కూర్చొని ఆయన నవ్వుతూ నవ్విస్తూ కబుర్లు చెప్పేవారు. ముఖ్య కార్యకర్తలను వెంట తీసుకుని కాశీ హిందూ విశ్వవిద్యాలయం నిర్మాత, అధినేత పండిత మదనమోహన్ మాలవ్యా వద్దకు వెళ్ళేవారు. మాలవ్యాజీ సంఘ కార్యాన్ని ఎంతగానో మెచ్చుకునేవారు. ఆయన విశ్వవిద్యాలయం సమీపంలో సంఘశాఖ పరికరాలు భద్రపరచుకోవడానికై ఒక చిన్న ఇల్లు కట్టించారు.

ఒకసారి విశ్వవిద్యాలయంలో పెద్ద ఉత్సవం జరిగింది. ఉత్సవం ఏర్పాట్ల బాధ్యత సంఘ స్వయంసేవకులకు అప్పగించారు. ఎవరు ఏ ద్వారం గుండా రావాలో, ఎక్కడ కూర్చోవాలో అంతా నిర్ణయమైంది ఆ ప్రకారం ఆయా స్థలాలలో స్వయంసేవకులు నిలబడ్డారు. ఎవరు ఎటు వెళ్లాలో

చెపుతున్నారు. నియమాలను ఉల్లంఘించడం కొందరికి సరదా. నియమాలూ మా కోసం కాదు. ఏ నియమాన్నీ మేము పాటించం. అని చెప్పుకోవడం గొప్ప అనుకుంటారు అలాంటి వాళ్లు. ఒక సీనియర్ అధ్యాపకుడు ఆ తరహా వ్యక్తి. స్త్రీలకోసం ఏర్పాటు చేసిన ద్వారంనుంచి లోపలికి రాబోయాడు ఆయన. స్వయంసేవకులు ఎంతో వినయంగా ఆయనను "పురుషుల ద్వారం అదండీ''అని చూపారు. ఆయన వారితో వివాదానికి దిగాడు. కోపోద్రేకంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. మొండిపట్టు పట్టాడు. "నన్ను ఆపడానికి మీరెవరు ? నేను ఈ ద్వారంనుంచే వెళతాను. మీకు చేతనైనది చేసుకోండి''– అని మొరాయించాడు. స్వయంసేవకులంతా మౌనం వహించారు. వస్తాదులా ఉండే ఓ స్వయంసేవక్ ముందుకు వచ్చాడు. ఆ పెద్దమనిషి రెక్క పుచ్చుకుని పురుషుల ద్వారం నుంచి తీసుకువెళ్ళి కూర్చోపెట్టాడు.

ఉత్సవం జయప్రదంగా ముగిసింది. అయితే, ఆ సీనియర్ అధ్యాపకుని మనసును దొలుస్తూనే ఉంది ఆ సంఘటన విశ్వవిద్యాలయ అధికారుల సమావేశంలో ఆయన దానిని చిలవలు పలవలుచేసి వర్ణించాడు. ప్రముఖ స్వయంసేవకులు కొందరిని విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించాలని కోరాడు. వెంటనే మాధవరావ్‌జీ లేచి నిలబడ్డారు. ఆయన దృఢంగా జరిగిన దంతా వివరించారు. స్వయంసేవకుల చర్యనూ, అందరూ క్రమశిక్షణను పాటించవలసిన అవసరాన్నీ గట్టిగా సమర్థించారు. సమావేశానికి ముందే ఆయన మాలవ్యాజీకి సంగతంతా నివేదించి ఉన్నారు. అందువల్ల ఆ సీనియర్ అధ్యాపకుని మాట చెల్లుబడి కాలేదు.

కాశీలో మాధవరావ్‌జీ మూడు సంవత్సరాలు ఉన్నారు. అక్కడి ఉద్యోగం పూర్తయినప్పుడు ఆయన రామ్‌టేక్‌లో కాని, నాగపూరులో కాని న్యాయవాద వృత్తి చేపట్టాలని భావుజీ, తాయీ అభిప్రాయం వ్యక్తంచేశారు.

అందువల్ల మాధవరావ్‌జీ మరో ఉద్యోగంకోసం పెద్దగా ప్రయత్నించలేదు. నాగపూరు వచ్చి, లా కాలేజీలో చేరారు.

కాశీలో ఉండగా, ఆయన స్వయంసేవక్ అయినారు. సంఘ కార్యకర్తలు పలువురితో ఆయనకు మైత్రి ఏర్పడింది. అంతా ఆదరంగా, అభిమానంగా ఆయనను గురూజీ అని పిలువసాగారు. గురూజీ అనే మాట ఆయనకు మారు పేరు అయింది. చివరికి డాక్టర్‌జీ కూడా ఆయనను గురూజీ అని పిలవసాగారు. "గురూజీ, నేడు స్వయంసేవకులను ఉద్దేశించి మీరే మాట్లాడాలి"—అని డాక్టర్‌జీ ఒకరోజున ఆయనతో అన్నారు. "డాక్టర్‌జీ, మీరుకూడా నన్ను గురూజీ అని పిలుస్తారా?" — అని ఆయన ఆశ్చర్యంతో అడిగారు.

"ఎందుకు పిలవకూడదు? మీరు ఏదో ఒక తరగతికి, పాఠశాలకూ మాత్రమే గురువుగారు కారుకదా. మీరు అందరికీ గురూజీయే"—అని డాక్టర్‌జీ వెంటనే నవ్వుతూ సమాధానం చెప్పారు.

12. ఇల్లు వదిలి . . .

శ్రీ గురూజీ దినచర్య ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. లా కాలేజీలో చదువు రెండు గంటలపాటు మాత్రమే. వేణువు వాయించే సావలారామ్‌జీ ఇంటిలో ఆయన ఎన్నో గంటలు గడిపేవారు. అక్కడ ఆయన వేణుగానం వినేవారు. స్వయంగా వీణ, వేణువు, సితార్‌వంటి వాద్యాలు వాయించేవారు. ఒకోసారి అక్కడ మిత్రబృందం అంతా చేరేవారు. ఇక జోరుగా వాదోపవాదాలు సాగిపోయేవి. గురూజీముందు ఎవరూ నిలువలేక

పోయేవారు. ఆయన చెప్పే మాట హేతుబద్ధంగా ఉండేది. ఆ మాటకు ఆధారం ఉండేది. ఆయన రోజూ ధంతోలీలో ఉన్న శ్రీరామకృష్ణ ఆశ్రమానికి వెళ్లేవారు. స్వామి శ్రీ భాస్కరేశ్వరానందజీకి ఆయనపట్ల ఉన్న అనురాగం ఇంతా అంతా కాదు. గురూజీ మేనమామ శ్రీ రాయ్‌కర్‌జీ ట్యుటోరియల్ కాలేజీ నిర్వహించేవారు. గురూజీ ఆ కాలేజీలో రెండు మూడు గంటలు చదువు చెప్పేవారు. కాలేజీవారు నెలనెలా ఇచ్చే జీతంతో నాగపూర్‌లో ఆయనకయ్యే ఖర్చు వెళ్లిపోయేది.

గురూజీ నాగపూరు వచ్చిన తర్వాత డాక్టర్‌జీ ఆయన వద్దకు రాసాగారు. ఆయనకూడా డాక్టర్‌జీ ఇంటికి వెళుతూ ఉండేవారు. అప్పుడు కేంద్ర శాఖ తులసీబాగ్‌లో జరిగేది. గురూజీని ఆ శాఖ కార్యవాహగా నియమించారు. లా కాలేజీకి దసరా-దీపావళి సెలవులు ఇచ్చారు అప్పుడే డాక్టర్‌జీకి బొంబాయినుంచి ఒక ఉత్తరం వచ్చింది. బొంబాయిశాఖ అస్తవ్యస్తంగా ఉన్నదని ఆ లేఖలో వ్రాశారు. సమర్థుడైన కార్యకర్తను అక్కడకు పంపాలి. అప్పుడే శాఖ బాగుపడుతుందని వ్రాశారు. డాక్టర్‌జీ గురూజీకి ఆ ఉత్తరం ఇచ్చి చదవమన్నారు. ఆయా విషయాలపై ఎవరి అభిప్రాయం ఎలా ఉంటుందో తెలుసుకొనడానికి డాక్టర్‌జీ అనుసరించే ప్రత్యేక పద్ధతి అది. మాటలలో చెప్పకుండా వ్యక్తులకు పని చేయాలనే ప్రేరణ ఇవ్వడానికి ఆయన అవలంబించే విధానం అది.

పరస్పర వైమనస్యాలు కారణంగా, వ్యక్తిగత అహంకారం కారణంగా అక్కడి పని నిర్లక్ష్యానికి గురి అవుతున్నదని ఆ ఉత్తరంవల్ల స్పష్టమవుతున్నది. ఆ ఉత్తరం చదివి గురూజీ ఇలా అన్నారు: "మీరు వెళ్లమంటే నేను అక్కడికి వెళ్లి, శాఖను సరిచేయడానికి ప్రయత్నిస్తాను. కాలేజీకి ఇప్పుడు సెలవులు కూడా."

గురూజీ నోట ఆ మాట విని డాక్టర్‌జీ ఎంతగానో ఆనందించారు. ఆయన వెంటనే గురూజీని బొంబాయి పంపారు. అక్కడకువెళ్లి ఆయన రాత్రింబవళ్ళు శ్రమించారు. స్వయంసేవకులు అందరినీ కలుసుకున్నారు. వారి మధ్య ఉన్న కలతలు తొలగించారు. నీరస భావనను తరిమివేశారు. అక్కడి శాఖలు చక్కబడ్డాయి. ఆవిధంగా అప్పగించిన పని సక్రమంగా సాధించి, గురూజీ నాగపూరు తిరిగివచ్చారు.

గురూజీకి ఒక స్నేహితుడు ఉండేవారు. ఆయన పేరు వామనరావ్ వాడేగాంవ్‌కర్. వామనరావు చిన్నతనంలోనే అంధుడైపోయారు. అయితే ఆయన గుణం దొడ్డది శ్రమించే లక్షణం గొప్పది. ఆయన స్వయంగా అంధ విద్యాలయం నడిపేవారు. అలాంటివారికి సాయపడడం గురూజీ జీవ లక్షణం. ఆయన అంధ విద్యాలయంకోసం విరాళాలు సేకరించేవారు. వామనరావును సైకిల్‌మీద ఎక్కించుకొని తీసుకువెళ్లేవారు. ప్రతిరోజూ ఆయనకు ఏదో ఒక గ్రంథం చదివి వినిపించేవారు. విద్యారణ్య స్వామి రచించిన పంచదశి గ్రంథం అతి క్లిష్టమైనది. ఎంతో ప్రసిద్ధి పొందినది. గురూజీ ఆ గ్రంథాన్ని వామనరావుకు చదివి వినిపించారు. దానికి అర్థం చెప్పారు. ఆ గ్రంథంపై వ్రాసిఉన్న వ్యాఖ్యాన గ్రంథాలు అనేకం వినిపించారు.

ఇన్ని పనులు చేస్తూకూడా, గురూజీ చదువు గురించి పూర్తి శ్రద్ధ తీసుకునేవారు చదువుకోసం రోజూ కొద్ది సమయం కేటాయించేవారు. ఏ పుస్తకం అయినా ఒక్కసారి చదివితే చాలు. అది ఆయనకు శాశ్వతంగా గుర్తు ఉండేది. ఏది చదివినా అందులో పూర్తిగా లీనమైపోయేవారు.

ఒకరోజున ఆయన రామ్‌టేక్ వెళ్లాలని బయలుదేరారు. బస్సు ఎక్కారు. చేతిలో న్యాయశాస్త్ర గ్రంథం ఉంది. పుస్తకం తెరచి చదవడం మొదలుపెట్టారు. బస్సు చాలా చోట్ల ఆగింది. జనం ఎక్కుతున్నారు. దిగు

తున్నారు. బస్సు రామ్‌టేక్ చేరింది. అయినా ఆయన చదువులో మునిగి పోయి ఉన్నారు. బస్సు మళ్ళీ నాగపూరు బయలుదేరుతోంది. ప్రయాణికులు బస్సు ఎక్కుతున్నారు. అప్పుడు కండక్టర్ అడిగాడు—"మీరు ఎక్కడికి వెళ్లాలి" అని. గురూజీ పైకి చూశారు ఇటూ అటూ చూశారు. అరే, రామ్‌టేక్ వచ్చేసిందే! ఆయన పుస్తకం మూసి బస్సు దిగారు.

1934లో విదర్భలోని అకోలా నగరంలో సంఘ శిక్షావర్గ జరిగింది. గురూజీని వర్గకు సర్వాధికారిగా నియమించారు. వర్గలో పాల్గొన్న స్వయంసేవకులలో ప్రతి ఒక్కరి గురించీ గురూజీ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జబ్బుపడిన స్వయంసేవకులకు స్వయంగా సేవచేశారు.

1935 లో గురూజీ న్యాయవాద పరీక్ష ప్యాసయ్యారు. న్యాయవాద వృత్తి ప్రారంభించారు. ఇంటి గోడకు బోర్డు తగిలించారు కోర్టుకు వెళ్లసాగారు. కేసులు వాదించసాగారు. అక్కడ ఆయన బుద్ధికుశలత అందరికీ కొట్టవచ్చినట్లు కనిపించింది. మధ్యమధ్యలో తల్లిదండ్రులు పలుమారులు పెళ్ళి ప్రస్తావన తేవడం సహజమే. గురూజీ దాన్ని దాటవేసేవారు. అయితే, ఒత్తిడి పెరిగేసరికి ఆయన భావుజీతో ఇలా స్పష్టంగా చెప్పారు. "పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం నాకు ఏమాత్రం లేదు. వైవాహిక సుఖాన్ని నేను కోరడం లేదు. నా దృష్టిలో అసలు అది సుఖమే కాదు"

ప్రేమమయి అయిన తల్లికి ఈ విషయంలో ఎంతో కోరిక ఉంది. ఎంతో ఆశ ఉంది. ఎన్నో కలలు ఉన్నాయి. అయినా గురూజీ ఆమెకు నచ్చజెప్పారు. ఆమెను ఒప్పించారు. వంశం కొనసాగాలనే వాంఛ సున్నితమైనది. దాన్ని గురించి కూడా గురూజీ తల్లిగారికి ఇలా బోధపరచారు: "సమాజానికి మంచి జరిగే మాట ఉంటే, దేశ కళ్యాణం జరిగేమాట ఉంటే—మన వంశవృక్షం వంటివి ఎన్ని ఆహుతి అయినా మనం బాధపడకూడదు.

యుగం పిలుపు ఇది అ పిలుపును అందుకోవడం నా కర్తవ్యంగా నేను భావిస్తున్నాను. వంశం నశించిపోతున్నదన్న విచారం నాకు ఏ కోశనా లేదు.''

గురూజీ మనస్సు ఆ దిశలో పరుగులు తీస్తోంది. మరో ప్రక్క బాహ్యజీవితం యథా ప్రకారం సాగిపోతోంది. న్యాయవాది మాధవ సదాశివ గోల్‌వల్‌కర్ రోజూ కోర్టుకు వెళుతున్నారు. సావలారామ్‌జీ ఇంటిలో కూర్చుని గానంలోవాద్యాలలో లీనమై, ఆ ఆనందంలో మునిగితేలుతున్నారు. వాడేగాంవ్‌కర్‌జీతో తిరుగుతూ సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నారు. డాక్టర్ హెడగెవార్‌జీ వద్దకు వెళ్లి ఆయనతో జాతీయ సమస్యలను గురించి ఆలోచన చేస్తున్నారు.

ఉన్నట్టుండి 1936 అక్టోబరు నెల మూడవవారంలో ఒక అద్భుత సంఘటన జరిగింది. దీపావళికి ఇంకా పద్దెనిమిది రోజులు ఉంది. మాధవ రావ్ మిత్రులలో ఎవరి నోట విన్నా అదే మాట. "మాధవరావ్ ఇల్లు వదలి ఎక్కడికో వెళ్లిపోయారు." "ఎవ్వరికీ ఏమీ చెప్పలేదు." "పాపం ఒక్కగా నొక్క కొడుకు" "భావుజీని ఓదార్చడం ఎవరి తరం?" "తాయీని ఊరడించ డం ఎవరి తరం?" అందరి మనసులలో ఆందోళన, విచారం, ఆదర భావం కలబోసుకొని వెల్లువలా పెల్లుబుకుతున్నాయి. ఆ వార్త విని భావుజీ, తాయీ దుఃఖంలో మునిగిపోయారు. డాక్టర్ హెడగెవార్‌జీ ముఖంలో ఆవేదన కానవచ్చింది.

13. సారగాఛీ

కలకత్తాకు ఉత్తరాన 130 మైళ్ళ దూరంలో ముర్షిదాబాద్ జిల్లాలో సారగాఛీ అనే గ్రామం ఉంది. సారగాఛీ అంటే దట్టమైన చెట్ల వరుసలు అని

అర్థం. ఆ గ్రామం అలాంటిదే. వన సంపద పుష్కలంగా ఉంది. ధన సంపద మాత్రం పూజ్యం. అక్కడి ప్రజలు నిరుపేదలు. దీనంగా, హీనంగా బ్రతుకులు వెళ్లదీస్తున్నారు.

1896లో ఒక యువ సన్యాసి అక్కడికి వచ్చాడు. అతని పేరు అఖండానంద. అతడు శ్రీరామకృష్ణ పరమహంస శిష్యుడు. స్వామి వివేకానందకు గురుభాయి. గంగానది ఒడ్డున యాత్ర చేస్తూ గంగోత్రి చేరాలని అతని ఆలోచన అక్కడే ఏదైనా అందమైన గుహ చూసుకుని, హిమాలయాలలో ఉండిపోవాలని అతని ఉద్దేశం. అక్కడ ధ్యాన ధారణలతో, జప తపాలతో జీవితం గడపాలని అతని సంకల్పం. ఆ ఆశయంతో కలకత్తా నుంచి బయలుదేరాడు. త్రోవలో సారగాఛీ తగిలింది.

ఆ గ్రామంలో ఎక్కడా మంచినీళ్ళు లేవు. గ్రామప్రజలు ఎంతో దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. నానా యాతనా పడుతున్నారు. పదేళ్ల పిల్ల నీళ్లు నిండిన కుండ తలమీద పెట్టుకొని ఇంటికి వెళతోంది. కాలికి దెబ్బ తగిలి పడిపోయింది. స్వామీజీ పరుగున వెళ్లి ఆ పిల్లను లేవనెత్తాడు. పిల్లకు గాయం తగలలేదు కాని, కుండమాత్రం పగిలిపోయింది. "మా నాన్న నన్ను కొడతాడు. చితకకొడతాడు"—అంటూ ఆ పిల్ల భోరు భోరున ఏడుస్తోంది. స్వామీజీ ఆ పిల్లకు కొత్తకుండ ఇప్పించాడు. ఆ పిల్ల ఏడుపు మానింది. మళ్లీ నీళ్లు తేవడానికి వెళ్లిపోయింది.

ఈ వార్త గ్రామం అంతటా వ్యాపించింది. మన గ్రామానికి ఎవరో దయామయుడు వచ్చాడట. పదండి. ఆ మహాపురుషుని దర్శనం చేసుకుందాం. అంటూ గ్రామప్రజలు అఖండానందజీ పాదాలవద్దకు వచ్చి కూర్చున్నారు. స్వామీజీ ఎంతో ప్రేమగా అందరినీ పరిచయం చేసుకున్నారు. వారు తమ కష్టగాథలు వినిపించారు. తమ బాధలు వెళ్లబోసుకున్నారు

అంతా విని, కరుణామూర్తి అయిన స్వామి అఖండానందజీ గుండె చెరువై పోయింది. దరిద్ర నారాయణుడు ఆయనకు అక్కడ సాక్షాత్కరించాడు. గ్రామ ప్రజల కష్టాలు గట్టెక్కించడానికి ఆయన పథకాలు తయారుచేశారు. గ్రామప్రజలు ఆయన మాట వింటున్నారు. ఆ ప్రకారం నడుచుకుంటు న్నారు. అక్కడ అందమైన ఆశ్రమం నిర్మాణమైంది.

రోజూ పడుకోబోయేటప్పుడు అఖండానందజీకి గంగోత్రి, హిమాలయాలూ గుర్తు వచ్చేవి. ఈ కాస్తపనీ పూర్తయిన తర్వాత ఇక్కడనుంచి వెళ్ళిపోతాను—అని ఆయన తన మనసుకు సమాధానం చెప్పుకునేవారు. తెల్లవారేది. పేదరికంలో, అజ్ఞానంలో, కష్టాల కడలిలో మునిగిఉన్న ఆ గ్రామ ప్రజలను చూసేసరికి రాత్రి చేసిన ఆలోచనలన్నీ ఎగిరిపోయేవి. గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనులలో ఆయన లీనమైపోయేవారు. అలా నెలలు గడిచాయి. సంవత్సరాలు గడిచాయి. ఇదేనా గంగోత్రి. ఇదే నా హిమాలయం. ఈ సోదరుల సేవయే నా ధ్యానం. ఇదే నా తపశ్చర్య. ఇక ఇక్కడే ఉంటాను వీరికి సేవ చేస్తాను. ఇలా నిర్ణయించుకున్నారు అఖండానందజీ.

ఆయన తన నిర్ణయాన్ని తెలుపుతూ స్వామి వివేకానందకు ఉత్తరం వ్రాశారు. స్వామి వివేకానంద ఎంతగానో ఆనందించారు. సారగాఛీ ఆశ్రమానికి మంచి కార్యకర్తలు ఇద్దరిని పంపారు. తగినంత ధనం కూడా పంపారు. అఖండానందజీకి ఇలా ఉత్తరం వ్రాశారు:

"నీవు చేస్తున్న పని వివరాలు అందుతున్న కొలదీ నా మనస్సు ఆనందంతో మరింతగా నిండిపోతున్నది. ఇలాంటి పనులద్వారా ప్రపంచాన్ని జయించవచ్చు. ఇలాంటి పనులలో కులభేదానికికాని, మత భేదానికి కాని తావు లేదు. మీరు ధన్యులు. నేను నీకు కోటి ధన్యవాదాలు చెపుతున్నాను. నిండు మనస్సుతో నీకు ఆశీస్సులు ఇస్తున్నాను."

అఖండానందజీ ప్రజలకు సేవచేస్తూ తన జీవితమంతా అక్కడే గడిపారు. మంచి గంధం తాను నుసి అయిపోతుంది. ఇతరులకు శాంతి ఇస్తుంది. తాను మండుతూ ఇతరులకు సువాసనలు విరజిమ్ముతుంది ఆ మంచి గంధం లాంటిది ఆయన జీవితం. ఆయన పాదాలవద్ద కూర్చొని మోక్షమార్గ పాఠాలు నేర్చుకునేందుకై మాధవరావ్ నాగపూరు వదలి సారగాఛీ చేరారు. నాగపూరు నుంచి తెచ్చినపరిచయ పత్రాన్ని ఇచ్చి, ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశారు.

14. సద్గురువు సేవలో

అఖండానందజీ మాధవరావ్‌ను చేయి పుచ్చుకు లేవదీశారు. తనవద్ద కూర్చోబెట్టుకున్నారు. మాధవరావును ఎన్నో ప్రశ్నలు అడిగారు ఆయన వ్యక్తిగత విషయాలను, కుటుంబ విషయాలను తెలుసుకున్నారు. "గోల్‌వల్‌కర్, ఇప్పుడు వచ్చావు నీవు. చాలా ఆలస్యంగా వచ్చావు. నేను బాగా ముసలివాణ్ణి అయిపోయాను. నాకు జబ్బుగా ఉందికూడా. బాగా అలసిపోయాను. నేను నీకు ఎలా దారిచూపగలను?"-అన్నారు.

"స్వామీజీ, మీకు సేవ చేయడానికి నాకు అనుమతి ఇవ్వండి చాలు. మీకు సేవచేస్తూ ఉంటే నాకు అంతా లభిస్తుంది. తగు సమయం చూసి మీరు నన్ను అనుగ్రహించాలి. అప్పుడు నేను కృతార్థుడను అవుతాను"- అని మాధవరావ్ జవాబు చెప్పారు.

"సరే నీవు ఇక్కడ ఉండు. ఆ తర్వాత ఠాకుర్ (రామకృష్ణ పరమహంస) ఎలా ప్రేరణ ఇస్తే అలా జరుగుతుంది."-అని స్వామీజీ సంభాషణ ముగించారు.

స్వామీజీ నోటివెంట ఆ మాట విని మాధవరావ్ పరమానందం పొందారు. ఆయన ఆ క్షణం నుంచే స్వామీజీ సేవలో నిమగ్నమైనారు. ఆయన స్వామీజీకి పూజా సామాగ్రి అమర్చేవారు. భోజనం తయారు చేసే వారు. ఆశ్రమాన్ని చీపురుతో ఊడ్చేవారు. గిన్నెలు తోమేవారు. కట్టెలు కొట్టి తెచ్చి వాటిని చీల్చేవారు. ఇలాంటి పనులన్నీ భక్తిశ్రద్ధలతో చేసేవారు. పగలయినా అర్ధరాత్రి అయినా, గురుదేవులు పిలవగానే మాధవరావ్ చేతులు జోడించి ఆయన ఎదుట నిలచేవారు. స్వామీజీ మాధవరావ్‌ను ఎన్నో విధాల పరీక్షించారు. మాధవరావ్ ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనారు. స్వామీజీ ప్రసన్నులు అయినారు. మకర సంక్రాంతి పర్వదినాన 1937 జనవరి 13న అయన మాధవరావ్‌కు గురుమంత్రం ఉపదేశించారు. ఆ తర్వాత శిష్యుణ్ణి మనసారా ఆశీర్వదిస్తూ ఇలా ఆదేశించారు: "గోవల్కర్. నీ పని హిమాలయాలకు వెళ్లడం కాదు. గుహలో కూర్చోవడంకాదు. ప్రజలమధ్యకు వెళ్లే పని నీది. అందుకోసం ఒక మహాకార్యం నీకోసం ఎదురుతెన్నులు చూస్తోంది. నా ఆశీస్సు నీకు ఎప్పుడూ ఉంటుంది. నీవు ఎక్కడ అడుగు పెట్టినా, విజయం నిన్ను వెన్నాడుతుంది. నాయనా గోల్వల్కర్, ఈ గడ్డం, ఈ జడలు నీ ముఖానికి ఎంతో శోభ ఇస్తున్నాయి. ఎన్నడూ వీటిని తొలగించవద్దు."

కొద్ది రోజుల తర్వాత అఖండానందజీకి తీవ్రంగా జబ్బు చేసింది. మాధవరావ్ స్వామీజీకి ఎల్లవేళలా శుశ్రూష చేశారు. కలకత్తానుంచి డాక్టర్లు వచ్చేవారు. మందులు వ్రాసి వెళ్లేవారు. అయినా జబ్బు నయం కాలేదు. గ్రామంలో ఉంచితే లాభంలేదని స్వామీజీని కలకత్తా తీసుకువెళ్లారు. స్వామీజీ ఆదేశం ప్రకారం మాధవరావ్ ఆయనతోపాటు కలకత్తా వెళ్లారు. గురుదేవుని పరిచర్యలో మాధవరావు రాత్రింబవళ్ళు శ్రమించారు. మాధవ

రావ్ దీక్షాదక్షతలు కారణంగా -స్వామీజీకి వైద్యంలో, పరిచర్యలో లోపం అనేది జరగలేదు.

తనకు చివరి రోజు దగ్గరపడిందని స్వామీజీ తెలుసుకున్నారు. ఆయన మాధవరావ్‌ను దగ్గరకు రమ్మన్నారు. కూర్చోబెట్టుకున్నారు. ఆయన తలపై చేయి ఉంచి ఉపదేశం ఇచ్చారు. 1930 ఫిబ్రవరి 7 న స్వామీజీ తమ ఇహలోక లీల చాలించారు.

మాధవరావ్ దుఃఖానికి అవధులు లేవు. ఆయన దక్షిణేశ్వర్ వెళ్ళారు. బేలూర్ మఠానికి వెళ్ళారు. కామార్‌పుకుర్, జయరామ్‌బాటీ కూడ వెళ్ళారు. శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశారదామాత, స్వామి వివేకానందుల నివాసం వల్ల పునీతమైన స్థలాలను దర్శించారు. ఆయన సుమారు నెలా పదిహేను రోజులు కలకత్తాలో ఉన్నారు. 1937 మార్చి చివరివారంలో నాగపూర్ తిరిగివచ్చారు.

15 డాక్టర్‌జీ సాహచర్యంలో

శ్రీ గురూజీ నాగపూర్ వచ్చారు. స్నేహితులూ, బంధువులూ ఎంతో ఆనందించారు. ఆయన రామ్‌టేక్ వెళ్ళారు. భావుజీ పాదాలకు నమస్కరించారు. భావుజీ కళ్ళలో కన్నీళ్ళు తిరిగాయి. తాయీ ఆయనను చిన్న పిల్లవాడిలా దగ్గర కూర్చోబెట్టుకుని, ఆయన ముఖం నిమిరింది. ఆయన కొన్ని రోజులపాటు రామ్‌టేక్‌లో ఉన్నారు. రోజూ రామాలయానికి వెళ్ళేవారు. ఒంటరిగా పై మెట్టుమీద కూర్చొని ధ్యానంలో మునిగిపోయేవారు. ఒకోసారి మధురమైన వేణునాదంతో వాతావరణాన్ని నింపేవారు.

కొద్దిరోజుల తర్వాత ఆయన నాగపూరు వచ్చారు. అయితే న్యాయవాద వృత్తిలో ఆయనకు ఇప్పుడు ఆసక్తి లేదు. ఆయన తిరిగి వచ్చారనే మాట విని డాక్టర్‌జీకి అపారమైన ఆనందం కలిగింది. ఇప్పుడు ఆయన పని కట్టుకుని గురూజీతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారు. గురూజీ ఒక వార్తాపత్రిక సంపాదకమండలి సభ్యుడు అయినారు. "షికాగో మహాసభలో స్వామి వివేకానంద ఉపన్యాసం" అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన మరాఠీ లోకి అనువదించారు. ఏ పని అయినా ఆయన ఎంతో ఉత్సాహంగా, ఎంతో వేగంగా చేసేవారు. ఆంగ్లభాష ఆయనకు మంచినీళ్ళ ప్రాయం.

క్రాంతివీర్ బాబారావ్ సావర్కార్‌జీ "రాష్ట్ర మీమాంస" అనే మరాఠీ గ్రంథం రచించారు. ఆ గ్రంథాన్ని ఆంగ్లభాషలోకి అనువాదం చేయించి ప్రచురించాలని నాగపూరులోని న్యాయవాది విశ్వనాథరావ్ కేల్కార్ సంకల్పించారు. ఆయన తన అభిప్రాయం భయ్యాజీ దాణీకి తెలియజేశారు.

"శ్రీ మాధవరావ్ గోల్‌వల్‌కర్ ఈ పని చక్కగా చేయగలరు. నేను ఆయనను అడిగి చూస్తాను." అని భయ్యాజీ ఆయనతో చెప్పారు.

అనువాదం చేయడానికి గురూజీ ఒప్పుకున్నారు. ఆయన కేల్కార్‌జీ ఇంటి నుంచి ఆ పుస్తకం, తెల్లకాగితాలు తెచ్చుకున్నారు. మరునాడే ఆయన అక్కడికి తిరిగివెళ్ళారు. ఆయన చేతిలో ఆ పుస్తకమూ కాగితాలూ ఉన్నాయి. ఆయన అలా రావటంచూసి "నాకిప్పుడు తీరిక లేదండి...అనువాదం చేయడం చాలాకష్టమండి"వంటి మాటలు వినవలసివస్తుందని కేల్కార్‌జీ అనుకున్నారు. కానీ, పూర్తి అనువాదం చేతిలో పెట్టేసరికి, ఆయన ఆశ్చర్యానికి అవధి లేకపోయింది. ఆయన అనువాదం అక్కడక్కడ చదివి చూశారు. ఆంగ్ల పదాల ఎన్నిక, వాక్యరచన, విషయాన్ని ప్రతిపాదించిన శైలి, భావాలను

వ్యక్తంచేసిన తీరు మొదలైన అన్ని విషయాలలో అనువాదం అత్యుత్తమంగా ఉంది మాధవరావ్‌ను ముక్తకంఠంతో ప్రశంసిస్తూ ఆయన భయ్యాజీ దాణీతో "మీ స్నేహితుడు ఒక నరరత్నం" అన్నారు.

కొద్దిరోజుల తర్వాత శ్రీ గురూజీ ఆ విషయంపై "వుయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" అనే స్వతంత్ర గ్రంథాన్ని ఆంగ్లంలో రచించారు.

ఈ కాలంలో డాక్టర్‌జీ గురూజీ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. గురూజీ గుణాలను, కర్తృత్వాన్నీ ఆయన సూక్ష్మంగా పరీక్షిస్తున్నారు. డాక్టర్‌జీ ఆదేశాలను గురూజీ అక్షరాలా పాటించేవారు. ఆయిన రోజూ శాఖకు వెళ్ళేవారు. స్వయంసేవకుల సమావేశాలు తీసుకునేవారు. బౌద్ధికవర్గలో ప్రసంగించేవారు.

ఒక సమావేశంలో యాభై మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. సంఘపద్ధతి ప్రకారం ప్రతిఒక్కరూ తమను పరిచయం చేసుకున్నారు. పేరు, శాఖలో బాధ్యత, వృత్తి మొదలైన వివరాలు చెప్పారు. "గురూజీ, వీరంతా మన ప్రముఖ కార్యకర్తలు. వీరి పరిచయం గుర్తుంచుకోండి" అని డాక్టర్‌జీ అన్నారు. "వీరిని నేను మరచిపోలేను" అని గురూజీ సమాధానం చెప్పారు. ఒక్కొక్కరి పూర్తి పరిచయం తాను వినిపించసాగారు. ఎక్కడా పొరపాటు రాలేదు పద్ధతి ప్రకారం పొల్లుపోకుండా అంతా వినిపించారు. అద్భుతమైన ఆ స్మరణశక్తి చూసి అంతా చకితులైనారు డాక్టర్‌జీ ఎంతో ఆనందించారు. ఎందుకంటే, ఆయన మరో సంగతికూడా గుర్తించారు. అది వట్టి స్మరణశక్తి ప్రదర్శనకాదు. అందులో ఆత్మీయత ఉంది. అందులో ఏకాత్మత ఉంది. ఆ నమ్మకం కుదరడంతో డాక్టర్‌జీకి అపారమైన ఆనందం కలిగింది. ఆయన గురూజీకి మరింత

ముఖ్యమైన పనులు అప్పగించ సాగారు. ఆయన ఒకోసారి గురూజీని హిందీలో మాట్లాడమనేవారు. ఒకోసారి ఇంగ్లీషులో మాట్లాడమనేవారు. గంగా ప్రవాహంలాంటి ఆయన వక్తృత్వం ప్రభావం శ్రోతల ముఖాలపై కానవచ్చేసరికి, డాక్టర్‌జీ సంతోషంతో పులకించిపోయేవారు.

గురూజీ వక్తృత్వ చాతుర్యాన్ని కాని, వ్యవహార కౌశల్యాన్నికాని ఎవరైనా ప్రశంసిస్తూ ఉంటే, డాక్టర్‌జీ ఆ మాటలు శ్రద్ధగా వినేవారు. సంతోషించేవారు. ఆ తర్వాత రకరకాల ప్రశ్నలు వేసేవారు. గురూజీ గురించి మీ అభిప్రాయం ఏమిటి అని తన పాత సహచరులను అడిగేవారు.

రెండవ వైపునుంచికూడా ఈ ప్రక్రియ సాగుతున్నది. గురూజీకూడా డాక్టర్‌జీని పరీక్షిస్తున్నారు. దూరపుకొండలు నునుపు అనేసామెత ఎందరో నాయకులకు వర్తిస్తుంది. అయితే డాక్టర్‌జీ జీవితం అందుకు పూర్తిగా విరుద్ధం. దూరంనుంచి ఆయన మామూలు మనిషిలా కనిపిస్తారు. సూక్ష్మంగా పరిశీలించిన మీదట గురూజీకి ఒక సంగతి అర్థమయింది. డాక్టర్‌జీ మామూలు దుస్తులలో ఉన్న అఖండానందజీయే. అలాంటి ధీరగంభీర ప్రవృత్తి, అలాంటి శాంత స్వభావం డాక్టర్‌జీకి ఉంది. అలాంటి కర్మ యోగమే డాక్టర్‌జీలో ఉంది. కీర్తిపట్ల అదే వైముఖ్యం". మానవకళ్యాణం ద్వారా ఈశ్వరసేవ చేయాలనే అదే వ్రతం. ధ్యేయాన్ని గురించి నిరంతరం అదే చింతన తనువుతో, మాటతో, మనసుతో, మంచి గంధంలా అనుదినం, అనుక్షణం ఆయుర్దాయాన్ని కరిగిస్తూ ఉండటం, వెలిగిస్తూ ఉండటం దుస్తులుమాత్రం సన్యాసి ధరించే దుస్తులు కావు. ఇతర విషయాలు అన్నిటిలో డాక్టర్‌జీ సర్వసంగ పరిత్యాగియే.

గురూజీ ఆధునిక విద్య అభ్యసించిన వ్యక్తి. ఉన్నత విద్య అభ్యసించిన వ్యక్తి. విజ్ఞాన శాస్త్రంలో, న్యాయశాస్త్రంలో పట్టం పుచ్చుకున్న

విద్యాధికుడు. ప్రాచ్య పాశ్చాత్య తత్వశాస్త్రాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన వేత్త అందువల్ల అన్వేషణ ఆయన స్వభావం. ఏ విషయాన్ని అయినా క్షణాలమీద గ్రహించే ప్రతిభ ఆయన సొత్తు. ఆయన వివిధ విషయాలపై డాక్టర్‌జీని ఎన్నో ప్రశ్నలు అడిగారు. డాక్టర్‌జీ శాంతంగా, స్పష్టంగా ప్రశ్నలు అన్నింటికీ సమాధానాలు చెప్పారు. సంఘ స్వరూపాన్ని బోధపరిచారు. ఆయన డాక్టర్‌జీని అన్నికోణాలనుంచీ చూశారు. పరీక్షించారు. డాక్టర్‌జీ భావాలు స్పష్టమైనవి. ఆయన శీలం నిష్కళంకమైనది. ఆయన త్యాగం జాజ్వల్యమానమైనది. గురూజీ ఆయనకు అనుచరుడు అయినారు. పరమభక్తుడు అయినారు.

16. కలసిన మనసులు

1938 మే, జూన్ నెలలలో నాగపూరులో సంఘ శిక్షావర్గ జరిగింది. వర్గకు సర్వాధికారి గురూజీ. ఆయన వర్గకు వచ్చిన స్వయంసేవకులు అందరినీ వ్యక్తిగతంగా పరిచయం చేసుకున్నారు. వర్గలో ప్రతి స్వయంసేవక్‌కూ సౌకర్యంగా ఉన్నదో లేదో ఆయన స్వయంగా తెలుసుకునేవారు. శారీరిక కార్యక్రమాలు, భోజన వ్యవస్థ, వైద్య విభాగం, పారిశుద్ధ్య విభాగంవంటి వివిధ విభాగాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు వివరంగా పరీక్షించేవారు. ఎవరైనా కార్యకర్త పొరపాటు చేస్తే, అశ్రద్ధ చేస్తే అతడికి ఆ పని ఎలా చేయాలో వివరించేవారు. అర్ధరాత్రి వంటశాలకు తప్పకుండా వెళ్లేవారు. మిగిలిన అన్నంమీద మూత సరిగా ఉందో లేదో చూసివచ్చేవారు. అలాగే, అంతా సరిగా నిద్రపోతున్నారో లేదో, రక్షకులు పహరా ఇచ్చే పని సక్రమంగా చేస్తున్నారో లేదో రోజూ పరిశీలించి వచ్చేవారు.

వర్గ పూర్తయిన తర్వాత గురూజి డాక్టర్జీతోపాటు పూనా వెళ్ళారు. అక్కడ "భగవా ఝండా" అనే మరాఠీ చలనచిత్రానికి డాక్టర్‌జీ ప్రారంభోత్సవం చేశారు. ఆ ఉత్సవంలో గురూజీ పాల్గొన్నారు.

కొద్ది నెలలుగా డాక్టర్‌జీకి తరచుగా జబ్బు చేస్తోంది. ఆయన తన జబ్బు గురించి, దానివల్ల కలిగే బాధగురించి ఎప్పుడూ ఎవరికీ చెప్పేవారు కారు. జ్వరం వచ్చినా విరామం లేకుండా శ్రమించేవారు. కొద్దిరోజులు దేవలాలీలో విశ్రాంతి తీసుకోవలసిందిగా ఈసారి ప్రముఖ కార్యకర్తలు పలువురు డాక్టర్‌జీని ఒత్తిడి చేశారు. గురూజీ వారిమాట బలపరచారు. డాక్టర్‌జీ అందుకు ఒప్పుకున్నారు.

దేవలాలీ మహారాష్ట్రంలో నాసిక్ సమీపాన ఉంది. అక్కడి నీరు, అక్కడి శీతోష్ణ పరిస్థితి ఆరోగ్యానికి మంచిది. గురూజీని వెంట తీసుకుని డాక్టర్‌జీ అక్కడికి వెళ్ళారు. స్వయంసేవకులు అక్కడ చక్కని ఏర్పాట్లు చేశారు. కానీ, కొద్దిరోజుల తర్వాత డాక్టర్‌జీకి తీవ్రంగా జబ్బుచేసింది. వైద్యంకోసం ఆయనను నాసిక్ తీసుకువెళ్ళారు. శిక్షణపొంది అనుభవం గడించిన నర్సులా, అణకువ శ్రద్ధ కలిగిన శిష్యునిలా-గురూజీ డాక్టర్జీకి రేబవళ్ళు సేవ చేశారు. వేళకు మందు ఇవ్వడం, పథ్య భోజనం తినిపించడం, వీపుకు నూనె మర్దనా చేయడం, ముఖం కడిగించడం, బట్టలు మార్చడం, బట్టలు ఉతకడం వంటి పనుల ఏర్పాటు గురూజీ స్వయంగా చూసుకునేవారు. గురూజీ సేవా భావాన్ని, శ్రద్ధనూ చూసి డాక్టర్‌జీ ఎంతగానో ఆనందించారు. డాక్టర్‌జీ మనోనిగ్రహం, అచంచలమైన ఆయన ధ్యేయనిష్ఠ చూసి గురూజీ ప్రభావితులు అయినారు. డాక్టర్‌జీని నిద్రలోకూడా సంఘకార్యం గురించిన ఆలోచనే వెన్నాడేది. అంతటి జబ్బులోకూడా ఆయనకు హితమే కళ్ళఎదుట మెదిలేది. క్రమక్రమంగా గురూజీ తన జీవితాన్ని మహాపురుషుని చేతుల్లో పెట్టారు. డాక్టర్జీకూడా మనసులో నిశ్చయం

కున్నారు. నా ఆత్మను, నా ప్రాణాన్ని, ప్రాణప్రదమైన నా సంఘ కార్యాన్ని ఈ తేజో మూర్తికి అప్పగించాలి-అని.

రెండు నెలలు గడిచాయి. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డాక్టర్‌జీ నాగపూరు తిరిగివచ్చారు. అప్పుడు ఆయన ఒకసారి కృష్ణరావ్ మొహరీల్‌తో ఇలా అన్నారు: "కృష్ణా, నాసిక్‌లో నేను జబ్బుపడి ఉన్న సమయం వృధా అయిందని అనుకోకు. ఎంతమాత్రం వృధా కాలేదు. గురూజీ రూపంలో సంఘానికి ఎంతో గొప్ప వరం లభించింది."

1939 ఆగస్టు నెలలో నాగపూరుశాఖ శ్రీ గురుదక్షిణ-రక్షాబంధన్ ఉత్సవం జరిగింది. ఆ సందర్భంగా డాక్టర్‌జీ అతిముఖ్యమైన ప్రకటన చేశారు-"మనందరికీ చిరపరిచితులు శ్రీమాధవరావ్ గోల్‌వల్‌కర్ (ఆయనను మనం గురూజీ అని పిలుస్తాం) నేటినుంచి రాష్ట్రీయ స్వయంసేవక సంఘం యొక్క అఖిలభారతీయ సరకార్యవాహగా బాధ్యత నిర్వహిస్తారు."

1939 ఫిబ్రవరినెల చివరివారంలో నాగపూరు, వార్ధాలమధ్య ఉన్న సిందీఅనే స్థలంలో డాక్టర్‌జీ అతిముఖ్యమైన సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీగురూజీ, అప్పాజీ జోషి, బాలాసాహెబ్ దేవరస్, తాత్యారావ్ తెలంగ్, విఠల్‌రావ్ పతకీ, నానాసాహెబ్ టాలాటులే, కృష్ణరావ్ మొహరీల్‌వంటి ప్రముఖ కార్యకర్తలు ఆ సమావేశంలో పాల్గొన్నారు. వారంతా ప్రతిరోజూ ఎనిమిది గంటలపాటు కలసి కూర్చొనేవారు సంఘ కార్యానికి సంబంధించిన అన్ని విషయాలను కూలంకషంగా చర్చించేవారు. ఆ చర్చ పదిరోజులు సాగింది. నియమావళి, సంఘస్థాన్ ఆజ్ఞలు, కార్యపద్ధతి, ప్రతిజ్ఞ, ప్రార్థన మొదలైన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

ఆ సమావేశం తర్వాత డాక్టర్‌జీ గురూజీని కలకత్తా పంపారు. చైతన్యం, ప్రగతి వెల్లివిరిసే ప్రాంతంగా బెంగాల్ పేరుపొందింది. డాక్టర్‌జీ సంవత్సరాల తరబడి బెంగాల్‌లో ఉన్నారు. ఆ ప్రాంతంపట్ల ఆయనకు అభిమానం ఉంది. అయితే అక్కడ పనిచేయడం కష్టమనికూడా ఆయనకు తెలుసు. తీవ్ర భావాలు కలిగిన విప్లవవాదుల చరిత్ర, సామ్యవాద ప్రభావం, మూఢాచారాలలో గుడ్డి నమ్మకాలలో మునిగిఉన్న సామాన్యప్రజలు, బెంగాలీలకు తమ ప్రాంతంపట్ల, భాషపట్ల ఉన్న అపరిమితమైన అభిమానం, హిందూ సమాజం అంతటా ఉన్న దోషాలు-ఇవన్నీ ఉన్నప్పటికీ, అక్కడ సంఘ కార్యాన్ని నిర్మించవలసి ఉంది. ప్రతిభగల కార్యకర్తమాత్రమే ఆ పని చేయగలదు. అందువల్ల గురూజీని అక్కడకు పంపారు.

గురూజీ కలకత్తాలో నిర్విరామంగా శ్రమించారు. ఆయన రాత్రింబవళ్ళు పుర ప్రముఖులను కలుసుకునేవారు. వారికి సంఘాన్ని గురించి తెలియజెప్పేవారు. అలాగే, బాలురను, యువకులను ఆటలకోసం కలిపే పని కూడా ప్రారంభించారు. క్రమంగా ఆయన ప్రయత్నం ఫలించింది. 1939 మార్చి 22న ఉగాదినాడు కలకత్తాలో సంఘశాఖ ప్రారంభమైంది. ఆయన అక్కడినుంచి తరుణ స్వయంసేవకులను సంఘ శిక్షావర్గకోసం నాగపూరు తీసుకువచ్చారు. ఆ సంవత్సరంకూడా ఆయన వర్గకు సర్వాధికారిగా ఉన్నారు. వర్గ విజయవంతంగా ముగిసింది.

ఆ తర్వాత ఆయన డాక్టర్‌జీతోపాటు దేశం అంతటా పర్యటన సాగించారు. స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించవలసిందిగా డాక్టర్‌జీ ఆయననే కోరేవారు ఆయన మాట్లాడే పద్ధతి, విషయాన్ని ప్రతిపాదించే తీరు, ఉదాహరణలు చూపడంలో ఆయన నేర్పు-అన్నింటినీ డాక్టర్‌జీ ఎంతో శ్రద్ధగా పరిశీలించేవారు. ఆయనను సర కార్యవాహగా నియమించిన

తర్వాత డాక్టర్‌జీయే స్వయంగా ఆయన పర్యటన కార్యక్రమాన్ని తయారు చేశారు. ఆయనను ప్రతిప్రాంతంలో ఉన్న ప్రముఖ నగరాలకు పంపారు. 1940లో జరిగిన సంఘ శిక్షావర్గకు కూడా గురూజీ సర్వాధికారిగా ఉన్నారు.

పూనాలో కూడా సంఘ శిక్షావర్గ జరిగేది. డాక్టర్‌జీ ప్రతి సంవత్సరం ఆ వర్గలో 15-20 రోజులు ఉండేవారు. ఆరోగ్యం సరిగా లేకపోయినప్పటికీ, ఆయన వర్గలోని స్వయంసేవకులు అందరినీ పరిచయం చేసుకున్నారు. వారికి మార్గదర్శనం చేశారు. వర్గలో కార్యక్రమాలన్నీ క్రమబద్ధంగా జరిగాయి.

ఆ తర్వాత నాగపూరు శిక్షావర్గలో పాల్గొనడానికై డాక్టర్‌జీ 1940 మే 16న అక్కడికి వచ్చారు. అయితే ఆయన ఆరోగ్యం బాగా చెడిపోయింది. వర్గలో ఆయన కార్యక్రమం ఏదీ జరగడానికి వీలు లేకపోయింది. ఆయన వర్గలోని సయ్వంసేవకులను కూడా కలుసుకోలేక పోయారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గురూజీ ఆయన వద్దకు వెళ్లేవారు. ఆయనకు మందులు ఇచ్చే ఏర్పాటు చూసేవారు. శిక్షావర్గ కార్యక్రమాలు అన్నింటినీ ఆయనకు నివేదించేవారు. అక్కడి స్వయంసేవకులను కలుసుకోవాలనే కోరికను డాక్టర్‌జీ పదే పదే వ్యక్తం చేశారు. అయితే ఆయన జబ్బు బాగా ముదిరిపోయింది. నాలుగు అడుగులు వేయడానికి, లేచి కూర్చొడానికి కూడా ఆయనకు ఓపిక లేదు. అయినా స్వయంసేవకులను కలుసుకోవాలని ఆయన పట్టుపట్టారు. గురూజీ సహచరులతో సంప్రదించారు. వర్గ ముగింపు ఉత్సవం జరిగిన తర్వాత స్వయంసేవకులకు వీడ్కోలు చెప్పేందుకు జరిగే ప్రత్యేక కార్యక్రమానికి డాక్టర్‌జీని తీసుకువెళ్లారు. ఆ సందర్భంగా 1940 జూన్ 9వ ఉదయం ఆయన స్వయంసేవకులకు మార్గదర్శనం చేశారు. అదే ఆయన అంతిమ సందేశం అయింది.

గురూజీ, ఇతర కార్యకర్తలూ విశ్వప్రయత్నం చేశారు. నాగపూరు లోని వైద్య నిపుణులను పిలిపించారు. వారి సూచనల ప్రకారం మందులు ఇచ్చారు. అయినా డాక్టర్‌జీ ఆరోగ్యం రోజురోజుకూ మరింతగా దిగజారి పోతూ వచ్చింది. చివరికి డాక్టర్ల బృందం లంబర్ పంచర్ చేయాలని, అంటే వెన్నెముకలో సూది గ్రుచ్చి నీరు తొలగించాలని, నిర్ణయించారు. ఆ సంగతి డాక్టర్‌జీకి తెలిసింది. ఆయన గురూజీని, ఇతర ప్రముఖ కార్య కర్తలను దగ్గరకు పిలిపించారు. నా శరీరం మీద ఇప్పుడు చివరి ప్రయోగం జరుగుతోంది. ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేము'' అన్నారు. తర్వాత గురూజీని ఉద్దేశించి ఇలా అన్నారు. "ఇక ముందు సంఘకార్యం భారమంతా మీరే వహించాలి. అందుకు మీరు అంగీకరించండి. ఈ శరీరాన్ని గురించి నాకు విచారంలేదు. ఇక లంబర్ పంచర్ చేయించవచ్చు."

డాక్టర్‌జీ మనకు శాశ్వతంగా వీడ్కోలు చెపుతున్నారా ? ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్నారా ? ఆ ఆలోచనే గురూజీకి దుర్భరం అయింది. ఎలాగో తనను తాను సంబాళించుకుని, "డాక్టర్‌జీ, మీరలా ఎందు కంటారు ? మీ ఆరోగ్యం త్వరలో కుదుట పడుతుంది. అపుడు మేమంతా మునుపటివలె పని చేస్తాం'' అని చెప్పారు.

"నేను చెప్పిన మాట గుర్తుంచుకోండి. అంతవరకు చేయండి'' అని డాక్టర్‌జీ సమాధానం చెప్పారు.

లంబర్ పంచర్ జరిగింది. అయినా ఏమాత్రం ప్రయోజనం లేక పోయింది. డాక్టర్‌జీకి స్పృహ తప్పిపోయింది. మళ్ళీ తెలివి రాలేదు. 1940 జూన్ 21 శుక్రవారం ఉదయం 9 గంటల 27 నిముషాలకు డాక్టర్‌జీ ప్రాణ వాయువులు అనంత వాయువులలో లీనమైనాయి. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ నిర్మాత, ఆద్యసరసంఘచాలక్ ఇక లేరు. స్వయంసేవకుల ఆవర్ణం

స్వయంసేవకుల ప్రియతమ నాయకుడు పరలోకానికి వెళ్ళిపోయారు. స్వయంసేవకులు, కార్యకర్తలు అంతా దుఃఖ సముద్రంలో మునిగిపోయారు. శ్రీ గురూజీ అందరి కన్నీళ్ళూ తుడిచారు. అందరినీ కార్యోన్ముఖులను చేశారు.

17. దేశ పర్యటన

రేషిమ్‌బాగ్ సంఘస్థాన్ డాక్టర్‌జీకి ఎంతో ప్రియమైన కర్మభూమి. ఆ సంఘస్థాన్‌లో 1940 జూలై 3 సాయంత్రం శ్రీ గురూజీ సరసంఘచాలక్ ప్రణామ్ స్వీకరించారు. ఆ రోజున ఆయన చేసిన ప్రసంగం స్వయంసేవకులకు ఎంతో ప్రేరణ ఇచ్చింది. జూలై 21 న మాసిక శ్రాద్ధ దినం జరిపారు. ఆ రోజున చేసిన ప్రసంగంలో గురూజీ సంఘంపై వస్తున్న విమర్శలు అన్నింటికీ జవాబు చెప్పారు. చివరలో స్వయంసేవక బంధువులకు ఇలా కర్తవ్యాన్ని నిర్దేశించారు: "ఎలాంటి క్లిష్ట పరిస్థితులైనా రావచ్చు అయినా మనం అడుగు వెనుకకు వేయం. అడుగు ప్రక్కకు వేయం. మనం పట్టుదలతో సంఘకార్యంలో నిమగ్నం కావాలి. రెట్టింపు వేగంతో కార్యాన్ని పెంచాలి. విమర్శలు అన్నింటికీ సరైన సమాధానం అదే."

సరసంఘచాలక్‌గా గురూజీ పర్యటన ప్రారంభమైంది. ప్రతి ప్రాంతంలోనూ ప్రముఖ నగరాలను ఆయన దర్శించారు. అక్కడ ఉన్న శాఖలకు వెళ్ళారు. అక్కడి స్వయంసేవకులను కలుసుకున్నారు. కార్యకర్తలను కలుసుకున్నారు. "మనం మొదట స్వయంసేవకులం. జాతికి సేవచేయడమే మనకున్న హక్కు. అదే మన పని. దేశ ధర్మాలకోసం

మనం మన సర్వస్వాన్ని బలిదానం చేయాలి. ప్రతిరోజూ కణ కణంగా మనం మన జీవితాన్ని రాష్ట్ర దేవత చరణాలవద్ద సమర్పించాలి ఈ ధ్యేయనిష్ఠను మనం గ్రామ గ్రామానికి అందించాలి. ఆబాల గోపాలంలో ఈ ధ్యేయనిష్ఠను నిర్మాణం చేయాలి" - అని ఉద్బోధించారు.

సంఘంయొక్క ఈ మూల సిద్ధాంతాన్ని గురూజీ తన తొలి దేశ పర్యటనలో స్వయంసేవకులు అందరికీ తెలియజెప్పారు. ఇలా 1940 లో ప్రారంభమైన ఆయన దేశపర్యటన 33 సంవత్సరాలపాటు నిరంతరంగా సాగింది. కాలినడకన, సైకిల్‌మీద, బస్సులో, రైలుమీద, టాంగాలో కూర్చుని, విమానంలో, నావలో కూర్చుని - వివిధ వాహనాలు వాడుతూ ఆయన లక్షలాది మైళ్ళు యాత్ర జరిపారు. ఇంతగా దేశపర్యటన జరిపిన వారు అరుదు. ప్రతి ప్రాంతంలోని ప్రముఖ స్థలాలకూ ఆయన సంవత్సరానికి కనీసం రెండుసార్లు తప్పకుండా వెళ్ళేవారు. ఆయన పెద్ద నగరాలకు వెళ్లేవారు. మారుమూల పల్లెలకు వెళ్లేవారు. ఆయన పెద్దలతో పెద్ద పెద్ద విషయాలు మాట్లాడేవారు. విద్యాధికులతో వారి స్థాయిలో సిద్ధాంత చర్చ జరిపేవారు. బాలురకు కథలూ గాథలూ, వినిపించేవారు. పల్లెలలో ఉండే చదువురాని రైతులకు మామూలు మాటలతో విషయాన్ని వివరించేవారు. అందరికీ సంఘకార్యం ఎంతప్రముఖమైనదో బోధపరచేవారు.

ప్రతి స్థలంలో ప్రముఖ కార్యకర్తలను ఆయన తప్పకుండా కలుసుకునేవారు. వారితో వ్యక్తిగత సంబంధం ఏర్పరచుకునేవారు. సమావేశాలలో అందరినీ పరిచయం చేసుకునేవారు. ఆ పరిచయం గుర్తుంచుకునేవారు. ఎంతో ఆత్మీయతతో ప్రతి ఒక్కరి యోగక్షేమాలూ కనుక్కునేవారు. వ్యక్తిగతమైన ఇబ్బందులనూ, పనిచేయడంలో ఎదురయ్యే సమస్యలనూ తెలుసుకునేవారు. ఆయా చిక్కుచిడులు విప్పేవారు. సంఘం పనికి మరింతగా సమయం కేటాయించడానికై కొత్త స్వయంసేవకులకూ, పాత

స్వయంసేవకులకూ, ప్రేరణ ఇచ్చేవారు. కొత్త స్థలాలకు సమర్థులైన కార్యకర్తలను పంపి సంఘకార్య విస్తరణ జరిపించేవారు. ఆయన స్వయంగా కొత్త స్థలాలకు వెళ్లేవారు. ప్రముఖులు, పెద్దల సమావేశాలు నిర్వహించేవారు. వారికి సంఘ సిద్ధాంతాన్ని ఎరుకపరచేవారు. వారిలో యోగ్యులైన వ్యక్తులకు ప్రతిజ్ఞ ఇప్పించేవారు. సంఘకార్యం ప్రతిప్రాంతంలో. ప్రతి జిల్లాలో, గ్రామగ్రామాన పెరగాలి. అనేదే ఆయన తపన. ఆ ఆకాంక్ష ఫలించడానికై ఆయన నిరంతరం శ్రమించారు. ఆయన ఎన్నడూ అలసి పోలేదు. ఎన్నడూ ఆగిపోలేదు. శరీరానికి వచ్చే జబ్బులు ఎన్నడూ లెక్కచేయలేదు. సూర్యుని వలె ఆయన నిత్యం జ్వలిస్తూ ఉండేవారు. నిత్యం వెలుగులు విరజిమ్మేవారు. విరామం అన్నది లేకుండా అందరికీ మార్గదర్శనం చేస్తూ ఉండేవారు.

1939 లో ప్రపంచ యుద్ధపు కారుమబ్బులు క్రమ్ముకుంటున్నాయి. అపుడు భారతదేశాన్ని ఆంగ్లేయులు పాలిస్తున్నారు. దొంగను తేలు కుట్టింది. ఆంగ్లేయుల భయం అదే. వారు మరింతగా జాగ్రత్త వహించారు. కళ్ళలో వత్తులు వేసుకుని చూస్తూ ఉండేవారు. మనపైన ఏదైనా కుట్ర జరగడంలేదుకదా ? దేశమంతా ఒక్కసారి భగ్గుమనదుకదా ? అనే భయం వారి పట్టిపీడించేది. అందువల్ల వారు దేశంలో దమనకాండ సాగించారు.

ఆ దెబ్బ సంఘానికీ తగిలింది. ఆంగ్లపాలకులు సంఘ స్వయంసేవకులు పలువురిని పట్టుకుని జైళ్లలో కుక్కారు. నానా యాతనలకూ గురిచేశారు. సంఘ కార్యక్రమాలపైకూడ రకరకాల ఆంక్షలు విధించారు సంఘం తన గణవేషలో మార్పు చేయవలసి వచ్చింది. సంఘంలో సైనిక శిక్షణ ఇచ్చే వారు. దానిని పరిమితం చేయవలసి వచ్చింది.

1942 ఆగస్టు నెలలో మహాత్మా గాంధీ "క్విట్ ఇండియా" ఉద్యమాన్ని ప్రారంభించారు. దేశమంతటా ఆందోళన సాగింది. దేశభక్తి గురించి కొందరి మనసులలో విచిత్రమైన అభిప్రాయాలు ప్రవేశించాయి. పేరు పొందిన నాయకులు సైతం ఆంగ్లేయుల జిత్తులలో చిక్కుకున్నారు. అందువల్ల వారు సంఘంపై రకరకాల ఆరోపణలు చేయసాగారు. పలువురు అకారణంగా సంఘంపై వ్యతిరేకత పెంచుకున్నారు. నలువైపులా పెను తుపాను ముంచుకు వస్తున్నది. సముద్ర కెరటాలు పర్వతాలలా ఎగసి ఎగసి పడుతున్నాయి. పెద్ద పెద్ద సంస్థలు ఊగిసలాడసాగాయి. అయితే పరమేశ్వరుని కృపవల్ల సంఘానికి ఒక గొప్ప కర్ణధారి లభించారు. అంతటి భీషణ పరిస్థితిలో సైతం గురూజీ నిబ్బరంగా నిలబడ్డారు. ఎంతో నేర్పుతో సంఘ నౌకను నడిపి ముందుకు తీసుకువెళ్ళారు. ఆ నౌక ఊబిలో చిక్కుకోనూ లేదు. కొండను ఢీకొననూ లేదు.

దేశవ్యాప్తంగా విజృంభించిన ఆ రాజకీయ ఆందోళనలో సంఘ స్వయంసేవకులు పలువురు ఆవేశంగా పాల్గొన్నారు. ఆ దేశభక్తి వెల్లువకు ఒక స్థిరమైన రూపాన్ని, ఒక నిర్మాణాత్మకమైన రూపాన్ని ఇవ్వాలని గురూజీ సంకల్పించారు. దేశంకోసం ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి సంఘ ప్రచారకులుగా రావడానికి ఆయన ఎందరెందరో యువకులకు ప్రేరణ ఇచ్చారు.

18. అభినవ అభిమన్యులు

ఉన్నత విద్య అభ్యసించి డిగ్రీలు తెచ్చుకున్న నవయువకులు పలువురు సంఘ కార్యం చేయడంకోసం ఇళ్ళనుంచి బయలుదేరారు. వారు సంసార సుఖాలకు నీళ్ళు వదులుకున్నారు. స్వార్థానికి స్వస్తి చెప్పారు.

వారిని సుదూర ప్రాంతాలకు, జిల్లాలకు, గ్రామాలకు పంపారు గురూజీ. ఆయన తన పర్యటన వేగాన్ని కూడా పెంచారు. తుపానులూ, ఉప్పెనలూ వచ్చినా, కుంభపోతగా వర్షం కురుస్తున్నా, వరదలు ముంచుకు వచ్చినా, మరో వైపరీత్యం ఎదురైనా - ఆయన పర్యటన ఆగేది కాదు. తీవ్రమైన జ్వరం వచ్చినా నిర్ణీతమైన తన కార్యక్రమాన్ని మార్చనిచ్చేవారు కాదు ఆయన.

అది యుద్ధ సమయం. బెంగాల్‌లో ఆయన పర్యటన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జపానువారి దాడులవల్ల బెంగాల్ అంతటా భయంతో కూడిన వాతావరణం ఆవరించి ఉన్నది. జనం ఇళ్ళూ వాకిళ్ళూ వదలి పారిపోతున్నారు. అలాంటి పరిస్థితిలో గురూజీ పర్యటన కార్యక్రమాన్ని రద్దుచేయడం మంచిదని అక్కడి కార్యకర్తలు అనుకున్నారు. "పరిస్థితి అసాధారణంగా, అస్థిరంగా ఉంది. శ్రీ గురూజీకి ఏదైనా ప్రమాదం జరిగితే ?" అందువల్ల పర్యటన కార్యక్రమాన్ని రద్దుచేస్తే మంచిదని గురూజీకి కబురు పంపారు.

ఆ వార్త అందిన వెంటనే, "పర్యటన జరుగుతుంది. నిర్ణీత కార్యక్రమం ప్రకారం జరుగుతుంది" అని ఆయా కార్యకర్తలకు గురూజీ టెలిగ్రామ్‌లు ఇప్పించారు. ఆ తర్వాత పర్యటన ప్రారంభమైంది. అనుకున్న ప్రకారం జరిగింది. తన అభిప్రాయం కార్యకర్తలముందు ఉంచుతూ గురూజీ ఇలా ప్రసంగించారు: "ఇతరులు భయపడిన సమయంలో, గాబరా పడిన సమయంలో మనం మరింత దృఢంగా ఆపదలను ఎదురొడ్డి నిలవాలి. సంఘం నిర్భయత్వాన్ని ఉపాసిస్తోంది. నిర్భీకతను సమాజం అంతటిలో నిర్మించడం సంఘం చేపట్టిన పని. మనమే భయపడితే ప్రజలు ఎవరి అండన నిలుస్తారు ?"

ముస్లింలీగ్, ముస్లిం ప్రజలలో హెచ్చుమంది ఆంగ్లేయుల భేద నీతికి లోబడి పోయారు. ఆంగ్లేయులు వారి నాడి తెలుసుకున్నారు. ఇస్లాం పేరిట వారిని రెచ్చగొట్టవచ్చనీ, ఆ విధంగా భారతీయులను చీల్చవచ్చనీ, విశాలమైన ఈ దేశాన్ని విభజించవచ్చని వారు తెలుసుకున్నారు. వారు అందుకోసం ఎత్తులు వేశారు. జిత్తులు పన్నారు. 1947 లో దేశమంతటా ముస్లింలు మారణకాండ ప్రారంభించారు. పంజాబులో భారీయెత్తున హిందువులను ఊచకోత కోశారు. చివరికి దేశవిభజన జరిగింది. పంజాబులో, బెంగాలులో రక్తపుటేరులు పారాయి.

అప్పుడు పంజాబులో సంఘ శిక్షావర్గలు జరుగుతున్నాయి. ఫగ్వాడా శిక్షావర్గలో 1400 మంది స్వయంసేవకులు ఉన్నారు. సంగ్రూర్ శిక్షావర్గలో 2300 మంది స్వయంసేవకులు ఉన్నారు. ఉన్నట్టుండి పిడుగు పడింది. ఆంగ్లేయులు దేశ విభజన ప్రకటించారు. శిక్షావర్గలను మధ్యలోనే నిలిపి వేయవలసి వచ్చింది. స్వయంసేవకులు త్వరత్వరగా తమ తమ స్వంత ఊళ్ళకు బయలుదేరారు. కానీ, వారిలో కొందరు తమ ఇళ్ళను చేరనే లేదు. కొందరిని ముస్లింలు త్రోవలోనే చంపివేశారు. కొందరి ఇళ్ళూ, ఊళ్లూ ధ్వంసం అయినాయి. పంజాబు ప్రాంతం రణ రంగంగా మారి పోయింది. అంతటా మారణ హోమం. అంతటా అగ్నిజ్వాలల భుగభుగలు. పచ్చని పంట పొలాలు, కలకలలాడే పల్లెపట్టులు కాలి నుసి అయిపోతు న్నాయి. ధీరాలు పలికే నాయకులు కొందరు పిక్కబలం చూపారు. కొందరు అయిపు అనవాలు లేకుండా పోయారు. వారికి సమాజం సంగతి పట్టలేదు. బ్రతికి ఉంటే బలుసాకు తినవచ్చు అనుకున్నారు వారంతా.

అలాంటి పరిస్థితిలో శ్రీ గురూజీ పంజాబులో పర్యటన జరుపు తున్నారు. గ్రామ గ్రామానికీ వెళ్ళి స్వయంసేవకులను కలుసుకుంటు న్నారు. వారికి ధైర్యం చెపుతున్నారు. వారిని ఓదార్చుతున్నారు. అనాథలు

నిర్వాసులు, నిస్సహాయులు అయిన హిందూ సోదరుల శిబిరాలకు వెళుతున్నారు. ఆపదలనుంచి బయటపడటం ఎలాగో వారికి బోధిస్తున్నారు. వారిలోని వీరత్వాన్ని మేలుకొలుపుతున్నారు. అందరిలో నిర్భీకతను నింపుతున్నారు. ధీరోదాత్తమైన తన వాక్కుతో, ఓజస్సుతో నిండిన తన వాణితో ఆయన హిందూ బంధువులు అందరిలో, ముఖ్యంగా స్వయంసేవకులలో, వీర రసాన్ని జాగృతం చేస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఆనాడు పంజాబులోని బాల స్వయంసేవకులు, కిశోర్ స్వయంసేవకులు వీరాభిమన్యులై విక్రమించారు. మహత్తరమైన సేవ చేశారు.

19. రక్తరంజిత స్వారాజ్యం

స్వారాజ్యం వచ్చింది. దేశాన్ని ముక్కలుచేసి మరీ వచ్చింది. హిందువుల కష్టాలకు మేరలేదు. పాకిస్థాన్‌లో అయితే హిందువుల ఊచకోత భారీయెత్తున జరిగింది. మృత్యువు కోరలనుంచి ఎలాగో తప్పించుకుని బయటపడి భారతదేశానికి వచ్చిన వారికి అవమానాలు ఎదురైనాయి. తమ స్వదేశంలోనే, తమ మాతృభూమి ఒడిలోనే తమ హిందూ సోదరులే వారిని శరణార్థులు అని పిలువసాగారు.

భారత్‌లోని ముస్లింలు హాయిగా సుఖంగా జీవితం గడుపుతున్నారు. అయినా కొందరు ముస్లిం నాయకులు గాయాలపై కారం రుద్దుతున్నారు. "హంస కె లియాహై పాకిస్థాన్, లడ్ కె లేంగే హిందూస్థాన్'' (నవ్వుతూ నవ్వుతూ పాకిస్థాన్ తెచ్చుకున్నాం. యుద్ధం చేసి హిందుస్థాన్ గెలుచుకుంటాం) అంటూ నినాదాలు ఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు దోషం

అంతటినీ హిందూ సమాజం నెత్తిన రుద్దుతున్నారు. శాంతి, సోదరభావం అనే ఉపదేశాలను వారు హిందూ సమాజానికే నూరిపోస్తున్నారు.

శ్రీ గురూజీ స్వయంసేవకుల ముందు విశాలమైన దృక్పథాన్ని ఉంచారు. కాంగ్రెసువారు అయినా, మరోపార్టీవారు అయినా వారంతా హిందువులే. మన బంధువులే. ఇదీ ఆయన దృష్టి. మనమధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికి మనలో మనం తగాదా పడకూడదన్నది ఆయన అభిప్రాయం. గురూజీ ఇలా హితవు చెప్పేవారు. "ధర్మరాజు చెప్పిన మాట మనం దృష్టిలో పెట్టుకోవాలి. గంధర్వులు కౌరవులను బంధించి నప్పుడు భీముడు సంతోషం వ్యక్తం చేశాడు. అపుడు ధర్మరాజు భీమునితో ఇలా అన్నాడు. — చూడు. మనలో మనకు తగాదా వచ్చినప్పుడు వారు నూరుగురు, మనం ఐదుగురం. కాని, మూడవవారు ఎవరితో అయినా వివాదం వస్తే మనం నూట అయిదుగురం. వయం పంచాధికమ్ శతమ్"

ముస్లిం నాయకులు తీవ్రాతితీవ్రంగా ప్రసంగిస్తున్నారు. తమ అనుచరులను మరింతగా రెచ్చగొడుతున్నారు. కాశ్మీరు, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానం, అలీగఢ్, రామ్‌పూర్, అస్సాం మొదలైన భూభాగాలు ముస్లింలవేననీ, అక్కడ ముస్లింల రాజ్యం స్థాపిస్తామనీ, స్థాపించి తీరతామనీ వాదించేవారు. నైజాము సంస్థానంలో ముస్లిం రజాకార్లు హిందువుల జీవితాలను దుర్భరం చేశారు. అక్కడ న్యాయం అనేది మచ్చుకైనా మిగులలేదు. రజాకార్ల అత్యాచారాలు మితిమీరిపోయాయి. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ నాయకులు ముస్లింలను బుజ్జగిస్తూనే ఉన్నారు.

దేశమంతా క్షోభించిపోయింది. మహాత్మాగాంధీ అప్పుడు ఢిల్లీలో మకాం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం జరిగే ప్రార్థన సమావేశాలలో ఆయన శాంతినీ, ప్రేమనూ, బంధుభావాన్నీ ప్రబోధించేవారు. భారత్ పాకి

స్తాన్‌కు 55 కోట్ల రూపాయలు తప్పకుండా ఇవ్వాలని ఆయన పట్టుపట్టారు. అందుకోసం అమరణ నిరాహారదీక్షకు సైతం ఆయన సిద్ధపడ్డారు. ఫలితంగా, గాయపడ్డవారు, వేదన పొందినవారు పలువురు గాంధీజీని విమర్శించసాగారు. "ఈయన ఇలా మాట్లాడడంవల్లనే, ఇలా చేయడంవల్లనే ముస్లింలు నెత్తినెక్కి కూర్చున్నారు. ఈయన చేసే ప్రకటనలవల్ల పాకిస్తాన్ బలపడుతోంది" - అనే విమర్శ నలుగడలా వినిపించింది. కొందరు యువకులు ఆవేశాన్ని అణచుకోలేకపోయారు. వారిలో ఒకడు 1948 జనవరి 30 సాయంత్రం ప్రార్థన సమావేశంలో గాంధీజీని పిస్తోలుతో కాల్చి హత్య చేశాడు.

ఆ సమయంలో గురూజీ తమిళనాడులో పర్యటిస్తున్నారు. జనవరి 30 సాయంత్రం ఆయన మద్రాసులో ఉన్నారు. శ్రీ రామస్వామి అయ్యర్ గృహంలో పురప్రముఖులకు తేనీటి విందు జరిగింది. గురూజీ అందరినీ పరిచయంచేసుకున్నారు. ఆతర్వాత సంఘకార్యం రూపురేఖలను వారికి స్పష్టం చేశారు. ప్రసంగం తర్వాత తేనీరు వచ్చింది. ప్రముఖులంతా టీ త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. గురూజీ ఓ గుక్క టీ త్రాగారో లేదో. ఈలోగా, రేడియోలో విన్న ఆ దారుణవార్తను ఎవరో మోసుకువచ్చారు. వార్త విన్న గురూజీ టీ త్రాగకుండానే కప్పు క్రింద పెట్టేశారు. "దేశానికి పెద్ద దురదృష్టం పట్టుకున్నది" అనేమాట ఆయన నోటివెంట వెలువడింది.

గురూజీ తన పర్యటన కార్యక్రమం రద్దుచేశారు. నాగపూరు తిరిగి వచ్చారు. పదిరోజులపాటు శోకదినాలు పాటించవలసిందిగా సంఘశాఖలు అన్నింటికి ఆదేశాలు వెళ్ళాయి. గురూజీ పత్రికా ప్రతినిధులతో ప్రసంగిస్తూ తన భావనలను ఇలా వ్యక్తంచేశారు: "మహాత్మాగాంధీ ఆధునిక యుగానికి చెందిన అతిశ్రేష్ఠ వ్యక్తి. ఆదరణీయుడైన వ్యక్తి. ఆయన హత్య దయమాలిన పని. పాశవికమైన పని. ఈ దుర్ఘటనకు నేను ఎంతో చింతిస్తున్నాను.

ఈ పాపపు పని చేసిన వ్యక్తి హిందువని తెలుసుకొని ఆలోచనపరులంతా సిగ్గుపడతారు. గాంధీజీ శాంతిమూర్తి. వివిధ వర్గాలమధ్య ఏకత్వాన్ని సాధించే సామర్థ్యం కలిగిన ఒకే ఒక మహాపురుషుడు. ఆయనను హత్య చేసిన వ్యక్తి జాతికి క్షమించరాని అపచారం చేశాడు. అపరాధం చేశాడు."

20. "దైవమే నాకు రక్ష"

గాంధీజీ హత్యతో సంఘానికిగాని, గురూజీకిగాని సంబంధం లేదని స్పష్టంగా కనబడుతున్నది. అయినా, ప్రధాన మంత్రి, ఇతర మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నాయకులు సంఘంమీద బురద జల్లడం ప్రారంభించారు. సంఘంపైన, గురూజీపైన లేనిపోని ఆరోపణలు కురిపించసాగారు. ఆ ఆరోపణలు విని, గ్రామ గ్రామాన ఛోటా నాయకులుకూడా నోటికివచ్చినట్లు ప్రేలారు. సంఘంపైన తిట్టు కవిత్వం సాగించారు. పెరుగుతున్న సంఘశక్తి వారందరికీ కంటకప్రాయంగా ఉండి. అందువల్ల అసూయ, మాత్సర్యం, ద్వేషంవంటి దుర్గుణాలు విలయతాండవం చేశాయి. మహాత్మాగాంధీ పేరుమీద జనం అబద్ధాలు చెప్పారు. అబద్ధాలు వ్రాశారు. పత్రికలలో రెచ్చగొట్టే వ్యాసాలూ, వార్తలూ, వ్యాఖ్యలూ వచ్చాయి. ఆకాశవాణికూడా విషం క్రక్కింది. ఫలితంగా–అనేక స్థలాలలో సంఘ స్వయంసేవకులపై దాడులు జరిగాయి. స్వయంసేవకుల గృహాలను, దుకాణాలను, కర్మాగారాలను లూటీ చేశారు. తగులబెట్టారు. అలాంటి పరిస్థితిలో గురూజీ ప్రశాంతంగా ఉండవలసిందిగా అందరికీ ఆదేశాలు ఇచ్చారు. "వీరంతా మన సోదరులే. ఇతరులు వీరిని పెడదారి పట్టించారు. వీరు చేసే పిచ్చి పనులకు మనం ఆవేశపడకూడదు. నిగ్రహం కోల్పోకూడదు"–అని గురూజీ అందరికీ హితవు చెప్పారు.

1948 ఫిబ్రవరి 1 ఉదయం గుండాలు గురూజీ ఇంటిని చుట్టు ముట్టారు. ఇంటిమీద దాడి చేయడానికి ముందుకు వస్తున్నారు. బండబూతులు తిడుతున్నారు. హింసను రెచ్చగొడుతూ నినాదాలు చేస్తున్నారు. రాళ్ళు రువ్వుతున్నారు.

ఆ వార్త నాగపూరు అంతటా వ్యాపించింది. పలువురు స్వయం సేవకులు గురూజీ గృహంవద్దకు చేరారు. "వేలసంఖ్యలో ఉన్న జనాన్ని చూసి మేము భయపడం. పరమ పూజనీయ గురూజీ ఇంటిపై దాడిచేయడం మజాకా కాదు. మా ప్రాణాలు పోయినాసరే, ఈ గుంపును చెదరగొట్టి తీరు తాం-" అని అంటున్నారు.

దాడిని త్రిప్పికొట్టడానికి స్వయంసేవకులు పథకం వేసుకున్నారు. ముందుకు దూకబోతున్నారు. అంతలో గురూజీ స్వయంగా అక్కడికి వచ్చారు. "వీరంతా మనసోదరులేనని గుర్తుంచుకోండి. నా ఈ శరీరాన్ని రక్షించడంకోసం వీరిలో ఎవరి శరీరంనుంచి ఒక్క రక్తపుబొట్టు చిందినా, నాకు మరణబాధ కలుగుతుంది. మీ హృదయాలలో ఉన్న అభిమానం నాకు తెలుసు. అయినా, నిజమైన స్వయంసేవక్ నా మాట మన్నించాలి. మీరంతా ప్రశాంతంగా మీ ఇళ్ళకు వెళ్ళిపొండి. నా గురించి బాధపడకండి. ఆ పర మేశ్వరుడే నా సంరక్షకుడని తెలుసుకోండి"-అని స్వయంసేవకులకు నచ్చ జెప్పారు.

గట్టిగా, వాడిగా వెలువడ్డాయి ఆ పలుకులు. తేజస్సు ఉట్టిపడుతున్న ఆయన ముఖమండలాన్ని స్వయంసేవకులు కొద్దిక్షణాలపాటు అలా చూస్తూ ఉండిపోయారు ఆతర్వాత గురూజీ ఆదేశాన్ని తలదాల్చారు. బిగించిన పిడి కిలి తెరచారు. తమ మహానాయకునికి ప్రణామం చేశారు. పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

నాటి రాత్రి పోలీసు అధికారులు అక్కడికి వచ్చారు. వారివెంట చాలా పెద్ద పోలీసు బలగం ఉంది. పోలీసులు గురూజీ గృహాన్ని చుట్టు ముట్టారు. అర్ధరాత్రి పోలీసుశాఖ ఉన్నతాధికారి వచ్చాడు. గురూజీని పట్టుకుని తీసుకువెళ్ళాడు. 1948 ఫిబ్రవరి 4న కేంద్రప్రభుత్వం సంఘాన్ని నిషేధించింది. సంఘంపైన, గురూజీపైన హింస, మతతత్వం, కులతత్వం, రహస్య కార్యకలాపాలు, సైనికసంస్థ, ప్రభుత్వ వ్యతిరేక చర్యలవంటి ఆరోపణలు మోపారు. సూర్యునిపై ఉమ్మివేసే ప్రయత్నం సాగింది.

21. నిగ్రహానికి పిలుపు

శంకరుడు హాలాహలాన్ని పానం చేసినట్లు గురూజీ అపనిందలు, ఆరోపణలు అన్నింటినీ మింగివేశారు. "ప్రశాంతంగా ఉండండి. నిగ్రహం చూపండి"—అని ఆయన స్వయంసేవకులను ఆదేశించారు. తమ మిత్రులు శ్రీదత్తోపంత్ దేశపాండేద్వారా ఆయన స్వయంసేవకులను ఉద్దేశించి ఒక లేఖ వ్రాశారు. దాని సారాంశం ఇది :

'సంఘం ఎప్పుడూ చట్టాన్ని పాటిస్తూ వచ్చింది. సంఘం అనుశాసనానికి ఎంతో విలువ ఇస్తుంది. మనం గతంలో ఎన్నడూ చట్టవ్యతిరేక చర్యలు జరపలేదు. నేడూ జరప నవసరంలేదు. అందువల్ల నేను మన సంఘాన్ని రద్దు చేస్తున్నాను. నిషేధం తొలగనంతవరకు సంఘం రద్దయే ఉంటుంది. ప్రభుత్వం మనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి."

దేశమంతటా వేలాది స్వయంసేవకులను ఖైదుచేశారు. వారిపై అన్నిరకాల ఆరోపణలూ మోపారు. గాంధీజీ హత్యకు కుట్ర పన్నడం, దౌర్జన్యకాండ జరపడం, ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించడంవంటి

ఆరోపణలు శ్రీ గురూజీపై మోపారు. అయితే కొద్ది రోజులలోనే అధికారులకు తమ తెలివితక్కువతనం తెలిసివచ్చింది. మహాత్మాజీ హత్యతో సంఘానికికాని, గురూజీకికాని ఎలాంటి సంబంధమూ లేదని 1948 ఫిబ్రవరి చివరివారంలో గృహమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రధానమంత్రి పండిత జవహర్లాల్ నెహ్రూకు స్పష్టంచేశారు. అప్పుడు గురూజీపై మోపిన ఆరోపణలు అన్నింటినీ వారు ఉపసంహరించుకున్నారు. ఆయనను ఖైదులో మాత్రం ఉంచారు.

చాలా సంవత్సరాల తర్వాత గురూజీకి విశ్రాంతి లభించింది. బలవంతం చేస్తే తప్ప ఈ వ్యక్తి విశ్రాంతి తీసుకోరు, అందువల్ల ఈయనకు ఈ విధంగా విశ్రాంతి ఇవ్వాలి-అని పరమేశ్వరుడు భావించి ఉండవచ్చు. అందువల్లనే ఆయనకు కారాగార వాసం లభించి ఉండవచ్చు. ఖైదులో ఆయన రోజూ యోగాసనాలు వేసేవారు. ధ్యానం, జపం, సంధ్యవంటి నిత్యకర్మలకు మరింత హెచ్చు సమయం కేటాయించేవారు. ఇక సంఘ కార్యాన్ని గురించిన ఆలోచన ఖైదులోనూ జరిగేది.

అంతేకాదు. వివిధ నగరాలలో, వివిధ ప్రాంతాలలో ఉన్న వేలాది కార్యకర్తలను రోజూ కలుసుకుంటూ ఉండేవారు. ఏ విధంగా ? మనస్సులోనే. పక్కమీద పడుకున్నప్పుడు మానసిక పర్యటన జరిపేవారు. ఏదో ఒక నగరం వెళ్లేవారు. అక్కడి కార్యకర్తలు ఒక్కొక్కరినీ స్మరించేవారు. ఈ సమయంలో ఎవరు ఎక్కడ ఉండవచ్చు ? ఏమి చేస్తూ ఉండవచ్చు ? ఏ ఏ విషయాలు ఆలోచిస్తూ ఉండవచ్చు ? ఈ విధమైన కల్పనా సామ్రాజ్యంలో ఆయన గంటల తరబడి విహరిస్తూ ఉండేవారు.

ఆయన రోజూ ఉదయం 5 గంటలకు నిద్రలేచేవారు. కాలకృత్యాలు ముగించుకుని టీ త్రాగేవారు. భగవద్గీత పఠించేవారు. స్నానం, సంధ్య,

ఆల్పాహారం అయిన తర్వాత పుస్తకాలు చదివేవారు. మధ్యాహ్నం భోజనం తర్వాత కొద్దిగా విశ్రాంతి తీసుకునేవారు. తన గదినీ, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచేవారు. ఆయనకు పనులు చేయడానికి ఒక ఖైదీని నియమించారు. పరిశుభ్రత అతనికి సరిపడని సంగతి. ఒకసారి గురూజీ స్వయంగా అతని బట్టలు ఉతికారు. అలాగే, అక్కడ పని చేయడానికి వచ్చే ఖైదీల యోగక్షేమాలను ఆయన విచారించేవారు. పలు విధాలుగా వారికి సాయపడేవారు. వారితో కలివిడిగా మాట్లాడేవారు. వారితో హాస్యంగా వినోదంగా కబుర్లు చెప్పేవారు.

సంఘ స్వయంసేవకులను నేరం ఏదీ లేకుండానే ప్రభుత్వం జైళ్లలో కుక్కింది. "హెబియస్ కార్పస్" దరఖాస్తులు దాఖలు చేయడానికి గురూజీ వారందరికీ అనుమతి ఇచ్చారు. హెబియస్ కార్పస్ అంటే "వ్యక్తిని ప్రత్యక్షంగా హాజరు పెట్టండి. అతడు చెప్పవలసింది చెప్పనీయండి" అని అర్థం. అయితే ఆయన తనకోసం ఆ దరఖాస్తు దాఖలు చేయలేదు.

1948 ఆగస్టు 6న ప్రభుత్వం గురూజీని విడుదల చేసింది. అయితే ఆయనపై అనేక నిర్బంధాలు విధించింది: నాగపూరులోనే ఉండాలి. ఉపన్యాసాలు ఇవ్వకూడదు. వ్యాసాలు వ్రాయకూడదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసి ప్రజలలో అసంతృప్తిని వ్యాప్తిచేయకూడదు. శాంతికి భంగం కలిగించకూడదు.

శ్రీ గురూజీ పండిత జవహర్లాల్ నెహ్రూకు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు లేఖలు వ్రాశారు. సంఘంపై అన్యాయంగా విధించిన నిషేధాన్ని తొలగించవలసిందిగా కోరారు. సంఘంపై రుద్దుతున్న ఆరోపణలు ఎంత బూటకమైనవో, ఎంత నిరాధారమైనవో, ఎంత హాస్యాస్పదమైనవో స్పష్టం చేశారు.

1948 అక్టోబర్ 17న ఆయన ఢిల్లీ వెళ్లారు. సర్దార్ పటేల్‌ను కలుసుకున్నారు. సంఘానికి సంబంధించిన విషయాలు అన్నింటినీ పటేల్‌కు వివరించారు కూలంకషంగా. నవంబర్ 2 న ఆయన పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ప్రకటన విడుదల చేశారు. పత్రికా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ సమాధానాలు చెప్పారు. వారి అనుమానాలు తొలగించారు. ఆ గోష్ఠిద్వారా ఆయన సంఘానికి జరిగిన అన్యాయం ఎంత దారుణమైనదో ప్రజల ముందుంచారు. ఢిల్లీ వదలి వెళ్లవలసిందిగా ప్రభుత్వం ఆయనకు ఉత్తర్వు జారీ చేసింది ఆయన ఆ ఉత్తర్వును పాటించలేదు. 1948 నవంబర్ 12 న ప్రభుత్వం ఆయనను తిరిగి ఖైదులో పెట్టింది.

22. మ్రోగింది రణభేరి

ఇకముందు ఏమి జరగనున్నదో గురూజీకి పూర్తిగా అవగాహన అయింది. సర్దార్ పటేల్‌తో జరిపిన చర్చలో గురూజీ ఆయన వైఖరి ఏమిటో చూశారు. నెహ్రూజీ తరచు చేసే ప్రసంగాలలో కూడా న్యాయానికీ, నీతికీ విలువ లేకపోవడం కనిపించింది. సంఘానికి శ్రేయోభిలాషులు వేలాదిగా ఉన్నారు అంతటా ఉన్నారు. వారు గురూజీకి ఎన్నో ముఖ్య విషయాలు చెప్పేవారు. శ్రీ గురూజీ పరిస్థితిని పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. అందువల్ల ఆయన కార్యకర్తలతో సమాలోచనలు జరిపి, తర్వాత తీసుకోవలసిన చర్యలను గురించి మొత్తం ప్రణాళిక తయారుచేశారు

ప్రభుత్వం గురూజీని ఖైదు చేసిన తర్వాత ఏకనాథ్‌జీ రానడే ప్రొఫెసర్ భాయి మహావీర్‌లు అనంతర కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. సరకార్యవాహ శ్రీ భయ్యాజీ దాణీ దేశవ్యాప్తంగా సత్యాగ్రహం

జరపవలసిందిగా స్వయంసేవకులను ఆదేశించారు. శ్రీ గురూజీ ఇచ్చిన సందేశాన్ని స్వయంసేవకులను అందించారు. ఆ సందేశంలో ఇలా ఉంది:

"...నేడు మనదేశంలో అభారతీయమైన సిద్ధాంతాలు, అభిప్రాయాల ప్రభావం పెరుగుతూ ఉండడం విచారకరమైన విషయం. దురదృష్టకరమైన విషయం. దానితోపాటు దేశంలోపల దుష్ట ప్రవృత్తులు పెరుగుతున్నాయి. ఈ రెంటి పంజాలనుంచి మనం మన దేశాన్ని విముక్తి చేయవలసి ఉంది. ఈ దేశంలో ప్రతి వ్యక్తి స్వతంత్రంగా జీవించగలిగే విధంగా, సుఖంగా గౌరవంగా మన గలిగే విధంగా మనం మార్పు తీసుకురావలసి ఉంది. ఇది దైవ కార్యం. దీనిని స్వీకరించినప్పుడే మానవత్వం మనగడ నిలుస్తుంది. దీనిని స్వీకరించినప్పుడే మనకు పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు.

"ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ని బోధత. లేవండి. మేల్కొనండి. ఉద్యమించండి. లక్ష్యాన్ని సాధించి చూపండి. గత పదినెలలుగా మనకు ప్రియతమమైన సంఘకార్యం ఆగిపోయి ఉంది. దానిని మనం ఇప్పుడు తిరిగి ప్రారంభించాలి. పదినెలలపాటు మనం మౌనంగా కూర్చుని ఉన్నాం. ఇప్పుడు మనం ఆ లోటును పూర్తిగా భర్తీ చేయాలి సత్యం మన పక్షాన ఉంది. న్యాయం మన పక్షాన ఉంది. అన్యాయాన్ని సహిస్తూ ఉండడం అంటే అన్యాయాన్ని జరిపేవారికి సహాయం అందించడమే. ఆ పాపం మనకు వద్దు. సత్యానికి ప్రేరణ ఇచ్చేవాడు భగవంతుడే. ఆయన రూపాన్ని మనం మన హృదయాలలో నింపుకుందాం. భారతమాతను ధ్యానం చేద్దాం. మనసులో విశాలమైన ప్రేమభావనను నింపుకుందాం. ప్రారంభించండి. మన సంఘాన్ని తిరిగి ప్రారంభించండి. కదలండి. పురోగమించండి. మన లక్ష్యాన్ని చేరుకునేవరకూ ఎక్కడా ఆగకండి.

"ఇప్పుడు యుద్ధం ప్రారంభమయింది. ధర్మం ఆధర్మంమీద, న్యాయం అన్యాయంమీద, విశాలత్వం సంకుచితత్వంమీద జరుపుతున్న

యుద్ధం ఇది. స్నేహభావన దుష్టత్వంమీద జరుపుతున్న యుద్ధం ఇది. మన విజయం నిశ్చయం. ధర్మం ఏ పక్షాన ఉంటే ఆ పక్షానికి భగవంతుడు సహాయం చేస్తాడు. భగవంతుడు ఎవరికి సహాయకుడుగా ఉంటాడో వారికే విజయం లభిస్తుంది.

“ఇక విజృంభించండి. హృదయాకాశంనుంచి జగదాకాశంవరకు. భారతమాతకు జయజయ ధ్వానాలు చేస్తూ విజృంభించండి. విజయం సాధించండి.”

23. సత్యాగ్రహ సమరం

ఆ సందేశం దేశమంతటా విద్యుచ్ఛక్తిలా ప్రవహించింది. స్వయం సేవకుల హృదయాలలో యుద్ధావేశం అగ్నిజ్వాలలా రగుల్కొన్నది. ప్రతి నగరంలో, ప్రతి గ్రామంలో సమావేశాలు జరుగుతున్నాయి సత్యాగ్రహం ఏయే స్థలాలలో జరగాలి? ఎవరు ఎక్కడ సత్యాగ్రహం చేయాలి? ప్రతి జిల్లాలో ఎంతమంది సత్యాగ్రహంలో పాల్గొంటారు? ఆయా విషయాలపై సమాలోచనలు జరుగుతున్నాయి. జాబితాలు తయారవుతున్నాయి. కరపత్రాలు అచ్చవుతున్నాయి. రహస్య స్థలాలలో సైక్లోస్టైల్ యంత్రాల మీద చిన్నచిన్న వార్తాపత్రికలు ముద్రించి పంచుతున్నారు.

సత్యాగ్రహం ఏ పద్ధతిలో జరగాలో నిర్ణయమైంది నగరంలోకాని, గ్రామంలోకాని పెద్ద మైదానంలో స్వయంసేవకులు సమావేశం అవుతారు. శాఖ జరుపుతారు. ప్రార్థన చేస్తారు. పోలీసులు అరెస్టుచేస్తే, ప్రశాంతంగా వారివెంట వెళ్ళిపోతారు. ఎలాంటి ప్రతిఘటనా ఉండదు. సంఘానికి మచ్చ

వచ్చే పని ఏదీ జరగదు. జైలులోకి వెళ్ళిన తర్వాత శాఖ నడుపుతారు. అక్కడి నియమ నిబంధనలు అక్షరాలా పాటిస్తారు. ఈ విషయాలన్నీ అందరికీ వివరించారు.

1948 డిసెంబర్ 9న దేశంలోని ప్రముఖ నగరాలలో సంఘానికి సంబంధించిన కరపత్రాలు అనేకం పంచారు. సత్యాగ్రహం ఎక్కడ జరుగుతుందో ఎలా జరుగుతుందో ముందుగానే అధికారులకూ, ప్రజలకూ తెలియజేశారు. సాయంత్రం నిర్దిష్ట స్థలంలో శాఖ జరిగింది. వేలాది ప్రేక్షకులు ఆ దృశ్యం చూస్తున్నారు. పోలీస్ వ్యాన్‌లు వచ్చాయి. అనేక స్థలాలలో పోలీసులు లాఠీలు ప్రయోగించారు. అయినా స్వయంసేవకులు అంతా సహించారు. స్వయంసేవకులు శాఖ నడిపారు. ప్రశాంతంగా. ధైర్యంగా. పట్టుదలగా. ప్రార్థన జరుగుతోంది.

నమస్తే సదా వత్సలే మాతృభూమే ।
త్వయా హిందుభూమే సుఖం వర్ధితోహమ్ ।
మహామంగలే పుణ్యభూమే త్వదర్థే ।
పతత్వేష కాయో నమస్తే నమస్తే ॥

ప్రార్థన చివర స్వయంసేవకులు "భారత్‌మాతా కీ జయ్" అంటూ నిర్ఘోషించారు.

అప్పుడు దర్శకులుగా వచ్చిన వేలాది పౌరులు ఆ నినాదం అందుకుని, "భారత్ మాతా కీ జయ్" అంటూ నినాదం చేశారు.

పోలీసులు సత్యాగ్రహులను వ్యాన్‌లలోకి ఎక్కించారు. వ్యాన్‌లు నగరంలోని అనేక వీధులగుండా వెళ్ళి జైలు ద్వారంవద్దకు చేరాయి. స్వయంసేవకులు తోవ పొడవునా "భారత్ మాతా కీ జయ్" అంటూ నినాదాలు చేస్తున్నారు. ఉత్సాహంగా. ఉద్రేకంగా.

ఆ విధంగా 1948 డిసెంబర్ 9న దేశమంతటా సత్యాగ్రహం ప్రారంభమయింది.

వేలాది నగరాలలో. గ్రామాలలో ఇలా సత్యాగ్రహం జరిగింది. జైళ్ళు స్వయంసేవకులతో నిండిపోతున్నాయి. రెండునెలలలో అరవై వేల మంది స్వయంసేవకులు జైళ్ళకు వెళ్ళారు. ఇంత పెద్ద సత్యాగ్రహం, ఇంత క్రమబద్ధమైన సత్యాగ్రహం, ఇంత అనుశాసనబద్ధమైన సత్యాగ్రహం నాటి వరకు ఎవ్వరూ నిర్వహించలేకపోయారు.

పెక్కు కారాగారాలలో క్రూరత్వం, నిర్దాక్షిణ్యం నిండిన అధికారులు ఉన్నారు. వారు స్వయంసేవకులను చిత్రహింసలకు గురిచేశారు. కొన్ని జైళ్ళలో నాసిరకం తిండి పెట్టేవారు. కొన్ని జైళ్ళలో ఖైదీలకు జబ్బు చేస్తే మందులిచ్చే దిక్కు ఉండేది కాదు. కొన్ని జైళ్ళలో త్రాగడానికి మురికినీరు ఇచ్చేవారు. దానికీ కొరతే. అయినా స్వయంసేవకులు అన్నింటినీ సహించి నిలచారు. శాంతంగా. దృఢంగా. స్వయంసేవకుల ధైర్యాన్ని నీరుగార్చడానికి అధికారులు చేయని ప్రయత్నం లేదు. అయినా స్వయంసేవకులు తొణకలేదు. బెణకలేదు. ఏ ఒక్కరూ క్షమాపణ చెప్పలేదు. ప్రభుత్వ అధికారులు జైలు లోపలా బయటా నానా యాతనలూ పెట్టారు. భయపెట్టారు. బెదిరించారు. ఇళ్ళు సోదాచేశారు. ఆస్తులు జప్తుచేశారు. ఉద్యోగాలనుంచి తొలగించారు. బలవంతాన జైళ్ళలో కుక్కారు. వారి నైచ్యానికి అంతులేదు. అయినా స్వయంసేవకుల పట్టుదల సడలలేదు. నిష్ఠ చెదరలేదు. వారికి జైలులో ఎన్నో అసౌకర్యాలు ఉన్నాయి. అయితే ఒక బ్రహ్మాండమైన సౌకర్యం ఉంది. వారు శాఖ నడుపుకొనవచ్చు. ఒకే ఆదర్శం కోసం తపించే తమ స్వయంసేవక బంధువులను కలుసుకోవచ్చు. అక్కడ ఎన్నో కష్టాలు ఉన్నాయి. అయితే ఒక బ్రహ్మాండమైన సుఖమూ ఉంది.

అక్కడ ప్రభుత్వ ఖర్చుతో శిబిరాలు నడుస్తున్నాయి. సంఘ శిక్షావర్గ నడుస్తోంది.

ఆ విధంగా-సంఖ్యలో, వ్యాప్తిలో, అనుశాసనంలో, త్యాగంలో, దృఢత్వంలో, సౌజన్యంలో సంఘ సత్యాగ్రహం సాటిలేనిదిగా నిలిచింది.

సంఘం నిర్దోషి అనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించారు. అధికారంలో ఉన్న వ్యక్తుల అన్యాయం చూసి అసంఖ్యాకులు ఎంతో ఆవేదన పొందారు. సంఘంపై నిషేధాన్ని తొలగించ వలసిందిగా మధ్యవర్తులు పండిత నెహ్రూకు లేఖలు వ్రాశారు. "కేసరి" పత్రిక సంపాదకులు గ. వి. కేత్కర్, విఖ్యాతి పొందిన విద్వాంసులు టి. ఆర్. వెంకట్రామశాస్త్రి, బాబాసాహెబ్ ఆపర్తే వంటి పెద్దలు మధ్యవర్తులుగా పని చేశారు. పటేలును, ఇతర ప్రముఖులను కలుసుకున్నారు. చివరికి సంఘం తన నియమావళిని వ్రాతమూలకంగా ఇచ్చింది. ప్రభుత్వం బేషరతుగా సంఘంపై నిషేధాన్ని తొలగించింది. పుటం పెట్టిన తర్వాత బంగారం వన్నె పెరుగుతుంది. అలాగే, ఈ అగ్నిపరీక్ష నుంచి వెలికి వచ్చిన తర్వాత సంఘం తేజస్సు పెరిగింది.

సంఘం గెలిచింది. సత్యం గెలిచింది. శ్రీ గురూజీ గెలిచారు.

24. సన్మాన పర్వం

1949 జూలై 12న సంఘంపై నిషేధం తొలగించారు. జూలై 13న శ్రీ గురూజీని బేతుల్ జైలునుంచి విడుదల చేశారు. "ఇక మనమంతా సంఘ కార్యాన్ని యథా ప్రకారం కొనసాగించాలి"—అనే గురూజీ ఆదేశం అందగానే గ్రామ గ్రామాన శాఖలు తిరిగి ప్రారంభమైనాయి. సంఘస్థాన్‌లో

భగవా ధ్వజం రెపరెపలాడుతోంది. స్వయంసేవకులు నవోత్సాహంతో సంఘం పనిలో లీనమైనారు.

గురూజీ పర్యటన తిరిగి ప్రారంభమైంది. ఆయన ఎక్కడకు వెళ్లినా స్వయంసేవకులలో ఉత్సాహం ఉరకలు వేసేది. గురూజీని చూడగానే స్వయంసేవకులు ఆనందంలో పొంగిపోయేవారు. ఆ ఉద్వేగంలో అంతా మరచి "శ్రీ గురూజీకీ జయ్", "మాధవరావ్ సదాశివరావ్ గోల్‌వల్‌కర్‌జీకీ జయ్," అంటూ నినాదాలు చేసేవారు.

గురూజీ వారిని వారించేవారు. వాడి అయిన మాటలతో మందలించే వారు. తీయటి మాటలతో నచ్చజెప్పేవారు. "మనమంతా సంఘ స్వయం సేవకులం. మనకు తెలిసిన నినాదం ఒకే ఒకటి– "భారత్‌మాతా కీ జయ్". వ్యక్తులకు జయజయ నినాదాలు ఇవ్వడం నేర్పలేదు. సంఘం మనకు. ఈ నియమాన్ని మరచి ఎవరో మాధవరావ్ గోల్‌వల్‌కర్ అనే వ్యక్తికి జయజయ నినాదాలు ఇవ్వడం అనుశాసనాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. అలాంటి పరిస్థితిలో నేను మీతో కలసి ఉండనని గుర్తించండి" – అంటూ పొరపాటు సరిదిద్దేవారు గురూజీ.

ప్రముఖ నగరాలు అన్నింటినీ ఆయన దర్శించారు. ఆయన రాక సందర్భంగా పెద్ద పెద్ద స్వాగత సభలు జరిగాయి. జన సముద్రం పొంగి పొరలింది. గురూజీ ప్రసంగాలు విని అంతా ప్రభావితులు అయినారు. అంతా చకితులు అయినారు. అసూయ, ద్వేషం, మాత్సర్యం, ఆగ్రహంవంటి భావాల ఛాయలుసైతం ఆయన ప్రసంగాలలో లేవు. రకరకాలుగా వేధించిన వారిని గురించి, నీచాతినీచంగా నిందలు వేసిన వారిని గురించి, అవమానాలు కురిపించిన వారిని గురించి ఆయన పల్లెత్తు మాట అనలేదు. పైగా ఆయన ఇలా బోధించారు : "చూడండి. భోజనం చేసేటప్పుడు ఒకోసారి మనం నాలిక

కరచుకుంటాం. ఎంతో బాధ కలుగుతుంది. అయినా మనకు పళ్లమీద కోపం వస్తుందా ? పళ్లు పీకేసుకుంటామా ? నిషేధం విషయంలో మనం అలాగే ఆలోచించాలి మనకు ఎవరిమీదా కోపం ఉండకూడదు. వారంతా మన సోదరులు. వారు వ్యతిరేకించవచ్చు. తిట్టవచ్చు. అయినా వారంతా మన అన్నదమ్ములే. వారు రేపటి స్వయంసేవకులు..."

స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గురూజీ ఇలా హెచ్చరిక చేశారు:" ఈ జనం, ఈ కోలాహలం, ఈ ఊరేగింపులు, ఈ నినాదాలు, ఈ స్వాగత సత్కారాలు, ఈ పూలదండల గుట్టలు ఈ ఫొటోగ్రాఫ్‌లు-ఇవన్నీ మన పని కావు. వీటివల్ల సాధించేదేమీ లేదు. మనం చక్కటి శాఖలు నడపాలి. ఆ శాఖలలో ప్రతిరోజూ మంచి సంఖ్య రావాలి. ఆ శాఖలలో నియమబద్ధంగా కార్యక్రమాలు జరగాలి. మన దైనందిన కార్యక్రమానికి భిన్నంగా జరుగుతున్న ఈ హడావుడి అంతా ఒక ప్రత్యేక సందర్భానికి సంబంధించింది. తాత్కాలికమైనది. ఇది ఆపద్ధర్మం వంటి ఉపశమనం. ఈ ప్రదర్శనకు ఎక్కువ విలువ ఇవ్వకూడదు. గుండె నిండా శ్రద్ధ నింపుకుని నియమ పూర్వకంగా శాఖలమీద దృష్టి లగ్నం చేయాలి.

కొందరు మనకు అన్యాయం చేసి ఉండవచ్చు. వారిలోని చెడును మనం మరచిపోవాలి. వారిని క్షమించాలి. మన సంఘ కార్యానికి ఆధారం ద్వేషం కాదు-ప్రేమ."

దేశమంతటా ఆయనకు సన్మానాలు జరిగాయి. పెద్దపెద్ద ఊరేగింపులు జరిగాయి. వేలాదిగా స్వాగత ద్వారాలు నిర్మించారు. దీపోత్సవాలు జరిగాయి. పుష్ప వర్షం కురిసింది. లక్షలాది ప్రజలతో బ్రహ్మాండమైన సభలు జరిగాయి. ఢిల్లీలో ఆయనను కనీవినీ ఎరుగని విధంగా సన్మానించారు. ఐదు లక్షల

మంది రామలీలా మైదానంలో జరిగిన ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1500 మంది పుర ప్రముఖులు ఆయనకు సన్మాన పత్రం సమర్పించారు.

దేశం నాలుగు చెరగులా ఆయన జరిపిన ఈ ప్రచారం ఎంతో ప్రభావం కలిగించింది. అందువల్ల-సంఘంపై పడ్డ దుమ్ము తొలగిపోయింది. సందేహం, నిరాశ, భయం-అన్నీ పటాపంచలు అయినాయి. స్వయంసేవకులు దైనిక కార్యక్రమాలను ఎప్పటివలె నిర్వహించసాగారు.

గురూజీపై పూలవర్షం, ప్రశంసల వర్షం కురిసినట్లే - కొందరు నిందలు కురిపించారు. విదేశాల ప్రేరణ పొంది, అసూయ చెందిన వ్యక్తులు రాళ్లు కురిపించే ప్రయత్నమూ చేశారు.

అయినా, గురూజీ ఆ స్తుతులకు పొంగిపోలేదు. ఆ నిందలకు క్రుంగి పోలేదు. తన వైపు విసరిన రాళ్లను సైతం ఆయన పూలుగా పరిగణించి స్వీకరించారు. మొండిగా సంఘాన్ని వ్యతిరేకించే వారికీ, తిట్లూ శాపనార్థాలూ కురిపించే వారికీ ఆయన ప్రేమనే పంచి ఇచ్చారు.

తుల్య నిందా స్తుతిర్ మౌనీ సంతుష్టో యేన కేనచిత్।
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః ॥

- నిందా స్తోత్రములను సమముగా చూచెడు వాడును, మౌనము దాల్చిన వాడును, లభించిన దానితో తృప్తి చెందెడువాడును, నివాసము లేనివాడును, నిశ్చలచిత్తుడును, భక్తిమంతుడును అయిన నరుడు నాకు ఇష్టుడు.

గురూజీ జీవితం భగవద్గీతలోని పై శ్లోకానికి (12-19) దర్పణం.

సంఘ కార్యం కోనకోనకూ విస్తరించింది. ప్రతి ప్రాంతంలో, ప్రతి జిల్లాలో సంఘ శాఖలు పెరిగాయి. నిషేధ సమయంలో జరిగిన

నష్టాన్ని భర్తీ చేయడానికై గురూజీ, సంఘ కార్యకర్తలూ ఎంతగానో శ్రమించవలసి వచ్చింది.

1956 ఫిబ్రవరి 7 న గురూజీకి యాభై సంవత్సరాలు నిండాయి. ఆ సందర్భంగా ఉత్సవాలు జరుపుతామని కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురూజీ అందుకు అనుమతి ఇవ్వలేదు. అయినా కార్యకర్తలు గట్టిగా పట్టుపట్టేసరికి, "పేద నాడి ఫలితం సంఘానిది అయ్యే విధంగా ఆ ఉత్సవం రూపురేఖలు దిద్దాలి" అని గురూజీ అందుకు షరతు పెట్టారు. కార్యకర్తలు ఆ షరతుకు ఆనందంగా అంగీకరించారు. ప్రతి ప్రాంతంలో అందుకు ప్రణాళికలు రూపొందించారు. స్వయంసేవకులు కొత్త గ్రామాలకు వెళ్ళారు. కొత్త వ్యక్తులను కలిశారు. పెద్ద మొత్తంలో నిధి సేకరణ జరిగింది. కొత్త శాఖలు ఏర్పడ్డాయి. గురూజీ వివిధ కేంద్రాలలో జరిగిన సార్వజనిక ఉత్సవాలలో ప్రసంగించారు. సంఘకార్యం ద్వారా జాతికి ఎలా శాశ్వత ప్రయోజనం కలుగుతుందో ప్రజలకు తెలియజెప్పారు. ఇక సంఘకార్యం మరింత వేగంగా పెరుగసాగింది.

25. సారథి, సచివుడు

సంఘకార్యానికి ఓ ప్రత్యేకత ఉంది. కార్యకర్త తాను పని చేయాలి. దానితోపాటుగా సహచరులను నిర్మాణం చేయాలి. సంఘం నేర్పేది ఇదే. ఏ కార్యకర్త కూడా తాను ఒంటరివాడుగా మిగిలిపోయే పరిస్థితి తెచ్చుకోకూడదు సంఘకార్యం వ్యక్తి నిష్ఠంకాదు. ధ్యేయనిష్ఠం. సంఘంలో శ్రద్ధాభక్తులు వ్యక్తిమీద కాక ఆదర్శం మీద లగ్నమై ఉంటాయి. నెహ్రూ తర్వాత ఎవరు?" అనే ప్రశ్నవంటి ప్రశ్న సంఘంలో ఎన్నడూ రాలేదు.

రాదు - అని గురూజీ చలోక్తిగా అనేవారు. "మీ తర్వాత ఎవరు ?" అని పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ఒక పాత్రికేయుడు ఆయనను అడిగాడు. "మీరు ఎందుకు కాకూడదు?" అని అయన సమాధానం చెప్పారు.

కనుకనే - గొప్పకార్యకర్త, సంఘటనా శాస్త్రంలో నిపుణుడు, చక్కని మార్గదర్శకుడు అయిన గురూజీ తనవంటి సహచరులు పలువురిని నిర్మాణం చేశారు. డాక్టర్‌జీ కాలంనాటి యువక కార్యకర్తలు, ప్రౌఢ కార్యకర్తలు పలువురు ఆయన ప్రేమనూ ఆదరాన్నీ నిత్యం పొందుతూ ఉండేవారు. పాత కార్యకర్తలు దృఢంగా నిలచి పనిచేస్తున్నారు. కొత్త కార్యకర్తలు వందలాదిగా నిర్మాణం అవుతున్నారు. గురూజీనుండి ప్రేరణ పొంది, ఉన్నత విద్య అభ్యసించిన నవయువకులు ఎందరో ఇల్లూ వాకిలీ వదలి, సంఘం పని కోసం ఎక్కడకు పంపితే అక్కడకు వెళ్ళారు. ఆయన ప్రేరణ ఫలితంగా కొత్తశాఖలు వేలాదిగా ప్రారంభమైనాయి. వేలాది కార్యకర్తలు కొత్త కొత్త రంగాలలో ముందంజ వేశారు. వివిధ వయస్సులకు, వివిధ వృత్తులకు, వివిధవర్గాలకు చెందిన లక్షలాది స్వయం సేవకులు ప్రతినిత్యం శాఖకు వెళ్ళసాగారు. అయన దేశమంతటా పర్యటించేవారు. అందరికీ ప్రేరణ ఇస్తుండేవారు. "రైలు పెట్టె నా యిల్లు" అనేవారు ఆయన.

సూర్యోదయం కాగానే దాని ప్రభావం ఆకాశంలో, ప్రకృతిలో, ప్రజా జీవనంలో సహజంగా కనిపిస్తుంది. ఆకాశం అంతటా ఎరుపురంగు అలముకుంటుంది. పిల్లగాలులు మెల్లమెల్లగా వీస్తూ హాయి నిస్తాయి. పువ్వులు విచ్చుకుంటాయి. ఆ పరిమళాలు దూర దూరాలకు గుబాళిస్తాయి. పక్షులు మధురంగా మంజులంగా కలకలారావాలు చేస్తాయి. ఇంటింటా ప్రజలు నిద్ర మేలుకుంటారు. కొత్త ఉత్తేజంతో తమ తమ పనులు ప్రారంభిస్తారు. సూర్యోదయం కాగానే ఇవన్నీ సహజంగా జరిగిపోతాయి. సరిగా

ఆ విధంగానే సంఘం పెరగగానే ప్రతి జీవన రంగంలో దాని ప్రభావ కనపడింది.

రాజకీయాలు అనే మాట వినపడగానే అంతా పడమటి దిక్కుకు చూడడం నాటివరకు పరిపాటి అయిపోయింది. నాయకులలో దాదాపు అందరూ రాజకీయాలకు యూరప్ దేశాలనుంచి ప్రేరణ పొందేవారు. కొందరు ఆంగ్లేయులనూ, అమెరికన్లనూ ఆదేపనిగా పొగడేవారు. మనం గణతంత్రాన్ని వారినుండే నేర్చుకోవాలని పదేపదే చెప్పేవారు. కొందరు జర్మన్ నియంతృత్వాన్ని మెచ్చుకుంటే, కొందరు రష్యన్ నియంతృత్వాన్ని మెచ్చుకునేవారు. పలువురు రష్యాకు తమ సర్వస్వాన్ని అర్పించుకున్నారు. ఐర్లెండ్, ఇటలీవంటి దేశాలనుంచి స్ఫూర్తి పొందేవారు. మరికొందరు స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ, యోగి శ్రీ అరవింద, సోదరి నివేదిత, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, లోక మాన్య తిలక్ వంటి మహామనీషుల ప్రబోధాల తర్వాతకూడా పెదపెద్ద నాయకులు పరానుకరణ ప్రవీణులు అయినారు. కానీ, సంఘకార్యం ఫలితంగా ఎందరో యువకులలో ఆత్మవిశ్వాసం మేలుకొన్నది. రాజకీయాలలో కూడా భారతీయ ఆదర్శాలను స్థాపించడం సాధ్యమేననీ, మానవ కళ్యాణానికి అలా చేయడం అత్యవసరమనీ వారికి నమ్మకం కుదిరింది.

భారతీయ జీవన సిద్ధాంతాలు ఆధారంగా రాజకీయరంగంలో పని చేయడానికి డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ ముందుకు వచ్చారు. అయన గురూజీని కలుసుకున్నారు. ఇద్దరూ సమాలోచనలు జరిపారు. పండిత దీన దయాళ్ జీ ఉపాధ్యాయ అనుభవం పొందిన సంఘ కార్యకర్త. సంఘ ప్రచారకులు. గురూజీ ఆదేశం పొంది, దీనదయాళ్ జీ డాక్టర్ ముఖర్జీతో పాటు రాజకీయ రంగంలో పనిచేయసాగారు.

ఆవిధంగానే, శ్రీ దత్తాజీ డిడోళ్కర్ విద్యార్థి రంగంలో పనిచేయసాగారు. శ్రీ దాదాసాహెబ్ ఆప్టే, శ్రీ రాజాభావూ డెగ్వేకర్‌లు విశ్వహిందూ పరిషత్ కార్యభారాన్ని స్వీకరించారు. కార్మికరంగంలో విదేశీ ప్రభావాన్ని తొలగించడానికై శ్రీ దత్తోపంత్ ఠేంగడీ నడుంకట్టారు. శ్రీ ఏకనాథ్‌జీ రానడేకు కన్యాకుమారి సమీపాన శ్రీ పాదశిలపై ధ్యానంలో కూర్చొని ఉన్న స్వామి వివేకానందుని రూపం పదేపదే కనిపించసాగింది. వనవాసి సోదరుల వికాసానికై పని ప్రారంభించాలనే ప్రేరణ శ్రీ బాబాసాహెబ్ దేశపాండేకు లభించింది.

శ్రీగురూజీ యోజన ఫలితంగా గోహత్యా నిషేధానికై దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమం సఫలమైంది. కుష్ఠురోగులకోసం సేవాకేంద్రాలు ప్రారంభమైనాయి చదువుకున్న యువకులు త్యాగభావంతో, సేవాభావంతో ఆ సంస్థలలో పనిచేయసాగారు. కరవు కాటకాలలో, వరదల సమయాలలో బాధితులకు సహాయ కార్యక్రమాలు అమలుజరుగుతూ వచ్చాయి. ఈ కార్యక్రమాలు, పథకాలు అన్నింటికీ పరమపూజనీయ శ్రీగురూజీ ఒకోసారి ప్రత్యక్షంగా, ఒకోసారి పరోక్షంగా సలహాలు ఇచ్చేవారు.

శ్రీ దత్తోపంత్ ఠేంగడీజీ కార్మికరంగంలో పనిచేయాలని నిర్ణయమైంది. ఆయన 1950 మార్చినెలలో ఐ. ఎన్. టి. యు. సి (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) లో చేరాడు. ఆయన గురూజీని కలుసుకున్నారు గురూజీ ఆయనకు ఆశీస్సులు ఇస్తూ, ముఖ్య సూచనలు కొన్ని చేశారు. వాటి సారాంశం ఇది :

(1) మీరు ఏ సంస్థలో పనిచేయడానికి వెళుతున్నారో ఆ సంస్థ క్రమశిక్షణను అక్షరాలా పాటించాలి. క్రమశిక్షణకూ, వివక్షణా జ్ఞానానికీ పూర్తి వైరుధ్యం ఏర్పడే పక్షంలో-ఆ సంస్థకు రాజీనామా ఇవ్వాలి. అంతే కాని, క్రమశిక్షణను ఉల్లంఘించకూడదు

2) మహాత్మాగాంధీ, కార్ల్ మార్క్స్‌ల ఆర్థిక సిద్ధాంతాలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలి.

3) కమ్యూనిస్టుల కార్యపద్ధతిని అర్థం చేసుకోవాలి. వారి కార్మిక సంఘాలను లోతుకుపోయి పరిశీలించాలి.

(4) పర్యటనలు జరిపేటప్పుడు కార్మికుల ఇళ్లలోనే బసచేయాలి.

(5) మీ తల్లి మిమ్మల్ని ఎంత గాఢంగా ప్రేమిస్తుందో అంత గాఢంగా మీరు కార్మికులను ప్రేమించాలి.

(6) కార్మిక రంగంలో చేసే పని నుంచి రాజకీయ రంగంలోకానీ, మరో రంగంలోకాని అనుచిత ప్రయోజనం పొందాలనే ఆలోచన సైతం మనసులోకి రానీయకూడదు.

(7) సమాజంలో వైమనస్యం తొలగే విధంగా, వర్గతత్వం నశించే విధంగా, జాతి ప్రయోజనాలను కాపాడాలనే భావన మేలుకొనే విధంగా ప్రయత్నం సాగించాలి.

ప్రతి పనినీ, ప్రతి సంఘటననూ, ప్రతి వ్యక్తినీ విశాలమైన దృష్టితో మౌలికమైన దృష్టితో, మానవ కళ్యాణ దృష్టితో చూడడం గురూజీ ప్రత్యేకత. ఆ దృష్టిని స్వయంసేవకులకూ, కార్యకర్తలకూ, హిందూ సమాజానికి అలవరచడానికి ఆయన విశ్వప్రయత్నం చేశారు.

1965 లో పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చింది. ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రత్యేక ఆహ్వానం పంపి గురూజీని ఢిల్లీ పిలిపించారు ప్రధాని అడిగినదే తడవుగా గురూజీ నిస్సంకోచంగా ఇలా హామీ ఇచ్చారు: "సంఘ స్వయంసేవకులు పిన్నలూ పెద్దలూ అందరూ దేశ ప్రయోజనాన్ని

దృష్టిలో ఉంచుకొని మీరు ఏ పని అప్పగిస్తే దాన్ని నిరపేక్ష భావంతో, శ్రద్ధతో నిర్వహిస్తారు."

విశ్వ హిందూ పరిషత్ అనే లేత మొక్కను గురూజీ తన చేతులతో పెంచారు. ఎంతో మెలకువతో దానిని కాపాడుతూ వచ్చారు. అందుకోసం ఆయన ఎందరో సాధువులను, పంత్‌లను, మఠాధిపతులను కలుసుకున్నారు. ఆయన రకరకాల వ్యక్తులను కలియవలసి వచ్చింది. కొందరు కాషాయ బట్టలు కట్టుకుంటారు కాని, మనసులో అహంకారం పెంచుకుంటారు. సన్యాసులమని చెప్పుకుంటూ ఉంటారు. అయినా పదవులకోసం, పేరు ప్రఖ్యాతులకోసం, ఆస్తులకోసం తగాదాలు పడుతూ ఉంటారు. ఎందరెందరికో గురూజీ నచ్చజెప్పారు. త్రోవ చూపారు. విధి నిర్వహణకు ప్రేరణ ఇచ్చారు.

గురూజీ వారికి ఇలా హితవు చెప్పారు: "మీరు మిమ్మల్ని పరిమితం చేసుకోకండి. గిరి గీసుకుని కూర్చోకండి. ఏదో ఒక మతానికో, సంస్థకో మిమ్మల్ని మీరు కట్టివేసుకోకండి. సమాజ పురుషుణ్ణి, విరాట్ పురుషుణ్ణి పూజించండి. దళితులు, ఉపేక్షితులు, పీడితులు, ఆర్తులు అయిన వారిని ఆదుకోవడానికి ముందుకు ఉరకండి. దీనులు, హీనులు కన్నీరు తుడవండి. అంటరాని తనాన్ని అంత మొందించండి. మన ధర్మంలో అంటరాని తనానికి తావు లేనే లేదు."

విశ్వ హిందూ పరిషత్ పని శరవేగంతో పెరగాలనీ, ప్రపంచం అంతటా విస్తరించాలనీ ఆయన కోరిక. అందువల్ల ప్రారంభ దశలో పరిషత్ సమావేశాలు అన్నింటిలో ఆయన పాల్గొన్నారు. 1966 లో ప్రయాగలో కుంభ మేళా సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఒక బ్రహ్మాండమైన మహాసభ తలపెట్టారు. అనేక సంప్రదాయాల పెద్దలు, మండలేశ్వరులు, మహామండలేశ్వరులు, శంకరాచార్యులు, పీఠాధిపతులు

మహాసభలో పాల్గొన్నారు. అంతా పూర్తి సహకారం అందించారు. మనసు విప్పి ధార్మిక చర్చలు జరిపారు. వేయి సంవత్సరాల పూర్వం హర్షవర్ధన చక్రవర్తి అన్ని సంప్రదాయాల పెద్దలతో భారీ యెత్తున మహాసభ జరిపారు. ఆ మహాసభ తర్వాత శ్రీ గురూజీ ప్రేరణతో విశ్వ హిందూ పరిషత్ ఈ మహాసభ నిర్వహించింది. మహాసభకోసం గురూజీ శారీరికంగా, మానసికంగా ఎంతో శ్రమించవలసి వచ్చింది. ఆయన పలువురిని చేతులు జోడించి ప్రార్థించారు. పలువురిపై వాక్ బాణాలు ప్రయోగించారు కూడా. మహాసభ వ్యవస్థ అంతనూ ఎంతో మెలకువగా పర్యవేక్షించారు. ఆ మహాసభను జయప్రదం చేయడానికి ఆయన అన్ని పనులూ చేశారు. ఒక్క పనిమాత్రం చేయలేదు. ఆయన కుర్చీలో కూర్చొనలేదు. "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అనే గీతా సందేశాన్ని ఆయన తన ఆచరణ ద్వారా ప్రపంచానికి అందించారు.

26. అద్భుతం ఆ స్మరణశక్తి

ఒకసారి ఎవరితో అయినా పరిచయం అయితే, ఆ వ్యక్తిని ఎన్నడూ మరచిపోరు గురూజీ. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్నా, ఆయన ఆ వ్యక్తిని పేరుపెట్టి పిలచేవారు. ఇలాంటి తమ స్వంత అనుభవాన్ని వేలాది వ్యక్తులు వర్ణించి ఉన్నారు.

ఒక కార్యకర్త ఇంటిలో గురూజీ రెండు రోజులు బసచేశారు. ఇంటిలోని వ్యక్తులను కుశల ప్రశ్నలు వేయడం, పిల్లలతో పరిచయం చేసుకోవడం ఆయన సహజంగా చేసే పనులే. ఆ ఇంటిలోనూ అదే జరిగింది. మూడు

సంవత్సరాల తర్వాత గురూజీ ఆ త్రోవన రైలులో వెళుతున్నారు. అక్కడి కార్యకర్తలు పలువురు ఆయనను కలుసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లారు ఆ కార్యకర్తను చూసీ చూడగానే, "మరి శాంతూను తీసుకురాలేదేమిటి ?" అని అడిగారు.

ఆ కార్యకర్త అలా చూస్తూ ఉండిపోయాడు బొమ్మలా. ఆయన ఆలోచిస్తున్నాడు.... మూడు సంవత్సరాలు గడిచాయి. ఆ తర్వాత గురూజీ ఎన్ని ఊళ్లకు వెళ్లి ఉంటారో. ఎన్ని ఇళ్లలో బసచేసి ఉంటారో. ఎన్నో వేల మందిని కలుసుకొని ఉంటారు. ఎన్నో వేలమంది స్వయంసేవకులను పరిచయం చేసుకొని ఉంటారు. మా పిల్లవాడు పెద్ద కార్యకర్త కాడుకదా. వాడికి అప్పుడు అసలు మాటలైనా వచ్చో రావో, అయినా గురూజీకి వాడి పేరు ఎలా గుర్తుంది......ఈ ఆలోచనలతో ఆ కార్యకర్త తలమునకలైనాడు.

ఇలాంటి ఉదాహరణలు వేలకువేలు చూపవచ్చు.

ఒక ఊరిలో సమావేశం జరిగింది. అంతా పరిచయం చేసుకున్నారు. ఒక యువ స్వయంసేవక్ లేచి నిలబడ్డాడు. పరిచయం చేశాడు. అతడి లాల్చీకి గుండీలు లేవు. గురూజీ అది గమనించారు. "ఏమిటి సంగతి ? లాల్చీకి గుండీలు ఎందుకు పెట్టుకోలేదు?" అని అడిగారు. స్వయంగా సంపాదించి, బంగారు గుండీలు తయారుచేయించుకున్నప్పుడే లాల్చీకి గుండీలు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాను-అని ఆ స్వయంసేవక్ సమాధానం చెప్పాడు.

ఐదు సంవత్సరాల తర్వాత మరో ఊళ్లో జరిగిన సమావేశంలో ఆ స్వయంసేవక్ పాల్గొన్నాడు. పరిచయం చేస్తూ అతను తన పేరు చెప్పి చెప్పగానే– "బంగారపు గుండీలు తయారు చేయించుకున్నట్లు కనబడు **తోందే!**" అన్నారు గురూజీ

"మళయాళ మనోరమ" పత్రిక సంపాదకుడు కె. పి. కె పిశార్టి 1948 ఫిబ్రవరిలో ఢిల్లీ వెళ్లారు. గురూజీ అప్పుడు సివనీ జైలులో ఉన్నారు. పిశార్టిజీకి గురూజీతో అంతకుముందు పరిచయం లేదు. ఆయన సంఘ స్వయంసేవకుహా కారు. ఒక ప్రాంతీయుడుగా గురూజీని కలుసుకోవాలని ఆయన అనుకున్నారు. అందుకోసం సివనీ వెళ్లారు. కానీ జైలు అధికారులు ఆయనకు అనుమతి ఇవ్వలేదు. "నేను కలుసుకోడానికి వచ్చినట్లు ఆయనతో చెప్పండి"-అని పిశార్టిజీ జైలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం పిశార్టి అనే వ్యక్తి ఆయనను కలుసుకోడానికి వచ్చినట్లు జైలు ప్రధాన అధికారి గురూజీకి తెలియజేశారు.

1965లో గురూజీ పాల్‌ఘాట్ వెళ్ళారు పిశార్టిగారు గురూజీని కలుసుకోడానికి అక్కడికి వెళ్ళారు. ఆయన తనపేరు చెప్పగానే గురూజీ, "సివనీ వచ్చి, నన్ను కలుసుకోడానికి విఫల ప్రయత్నం చేసిన పిశార్టిగారు మీరు కాదుకదా" అని అడిగారు.

గురూజీ స్మరణశక్తిని చూసి పిశార్టిగారు ఆశ్చర్య చకితులు అయినారు.

ఒకసారి ఒక స్వయంసేవక్ అడగనే అడిగాడు-"గురూజీ, ఇందరు స్వయంసేవకుల పేర్లు మీకు ఎలా గుర్తుంటాయి" అని.

గురూజీ ఇలా సమాధానం చెప్పారు : "నీది కిరాణా వ్యాపారం కదా. మీ కొట్లో వందలాదిగా సరకులు ఉంటాయి ఒకో సరకుకు ఒకో ధర. ఆధరలన్నీ నీకు ఎలా గుర్తుంటాయి? నీవు వాటిని బట్టీ పట్టవు మాటి మాటికి పుస్తకం చూడవు ఎందుకు గుర్తుంటుందంటే-కొట్టు నీకు జీవనాధారం. నీ సర్వస్వం. నీ దృష్టి అంతా దానిమీదే నిలచి ఉంటుంది. నా విషయమూ అంతే. సంఘం, సంఘ స్వయంసేవకులూ నా సర్వస్వం. వారిని నేను ఎలా మరువగలను?"

27. బహుముఖ పాండితీ ప్రతిభ

గురూజీ బుద్ధివైభవం సర్వతోముఖమైనది. అనేక శాస్త్రాలలో, కళలలో ఆయనకు అపారమైన జ్ఞానం ఉన్నది. కుశాగ్రమైన బుద్ధితో ఆయన అన్ని విషయాలనూ తరచి చూసేవారు. వాటి మర్మాన్ని గ్రహించేవారు.

ఆయన విశ్వవిద్యాలయంలోనే జీవశాస్త్రాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేశారు విజ్ఞానశాస్త్రంలోని ఇతర శాఖలలోకూడా ఆయనకు విశేషమైన పాండిత్యం ఉంది. ఉపనిషత్తులు, భగవద్గీత వంటి గ్రంథాలను ఆయన రోజూ చదువుతూ ఉండేవారు. ఎంత పెద్ద గ్రంథాన్ని అయినా అలా పేజీలు తిరగవేసేవారు. ఒకటి రెండు గంటలలో దాని సారాన్ని గ్రహించేవారు.

ఒకసారి బొంబాయిలో ఒక ప్రఖ్యాత ఆర్థికశాస్త్రవేత్త గురూజీని కలుసుకున్నారు. ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన నిగూఢ విషయాలపై ఆయనతో రెండుగంటలపాటు చర్చ జరిపారు. ఆతర్వాత ఆయన తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు: "సంఘంతో నాకు ప్రత్యేకంగా పరిచయం లేదు. అభిప్రాయ భేదం ఉన్నా ఉండవచ్చు. అయితే ఒకటిమాత్రం ఖచ్చితంగా చెప్పగలను గురూజీ ఆర్థికశాస్త్రాన్ని మథించారు"

గురూజీకి వైద్యశాస్త్రంలోనూ మంచి ప్రవేశం ఉంది. గృహవైద్యం చిట్కాలు ఆయనకు తెలుసు "నిద్ర నన్ను వేధిస్తోంది" అని ఒకరు ఆయనతో చెప్పారు. గురూజీ ఆ వ్యక్తికి హోమియోపతీ మందు సూచించారు. రోజూ దీర్ఘశ్వాస జరపమని సలహా ఇచ్చారు.

ఒకసారి బెంగుళూరు శిక్షావర్గలో ఆర్కెస్ట్రా కార్యక్రమం ఏర్పాటు చేశారు గురూజీ అప్పుడు అక్కడ ఉన్నారు. కార్యక్రమం తర్వాత ఆ వాద్యాలు వాయించినవారు అందరినీ గురూజీకి పరిచయం చేశారు. అప్పుడు ఆయన ఆయా వాద్యాలలోని ప్రత్యేకతలను వివరించారు. "మేము ఈ వాద్యాలను సంవత్సరాల తరబడి సాధన చేశాము. అయినా మేము ఈ రోజున ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాము"-అని ఆ వ్యాఖ్య విన్న ఆర్కెస్ట్రాలోని ప్రసిద్ధ విద్వాంసులు చెప్పారు.

నిర్మాణంలో ఉన్న భవనాన్ని చూసి గురూజీ ఇచ్చే సలహాలు విని అనుభవాన్ని కాచి వడబోసిన ఇంజనీర్లు సైతం ఆశ్చర్యచకితులు అయ్యే వారు. ఆ సలహాలు అంత శాస్త్రీయంగా ఉండేవి

28 సమయ పాలన

ఒకసారి ఢిల్లీలో ఒక పెద్ద సంస్థ మహాసభలు భారీయెత్తున జరిగాయి. ఆ సంస్థకు పుష్కలంగా ధనం ఉంది. సమృద్ధిగా వనరులు ఉన్నాయి. కానీ, అనుశాసనం అన్నది లేదు. ఏ కార్యక్రమమూ వేళకు జరగలేదు. గంటల తరబడి ఆలస్యంగా రావడం నాయకులకు అదో గొప్ప.

మూడురోజుల తర్వాత ఆ స్థలంలోనే సంఘ ఉత్సవం జరిగింది. వేలాది స్వయంసేవకులు వేలాది పౌరులు ఉత్సవంలో పాల్గొన్నారు. గురూజీకి ఆ రోజంతా ఊపిరి సలపని కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సుదీర్ఘమైన పర్యటన తర్వాత ఆయన ఢిల్లీ వచ్చారు అయినా, ఆయన సరిగా నిర్ణీత సమయానికి ఉత్సవస్థలానికి వచ్చారు. ఒక్క సెకను ఆలస్యంకాలేదు. ఒక్క

సెకను ముందుగా రాలేదు. ఏ పని అయినా నిర్ణీత సమయంలో చేయాలని అయన నొక్కి చెప్పేవారు.

ఒకసారి ఆయన పూనా వెళ్ళారు. ఆయన ఆ సాయంత్రం ఒక శాఖకు వెళ్ళాలని నిర్ణయమైంది. 5-45 కు ఆయన బసచేసిన గృహం వద్దకు కారు వస్తుందని ఆయనతో చెప్పారు 5-50 వరకు ఆయన కారు కోసం ఎదురుచూశారు. కారు రాకపోయేసరికి, సైకిల్ ఎక్కి శాఖకు వెళ్ళారు. గురూజీ సైకిల్‌మీద రావడంచూసి అక్కడి సంఘ అధికారులు విస్తుపోయారు. గురూజీ తాపీగా ఇలా అన్నారు : కారు ఒక యంత్రంకదా అది చెడిపోవచ్చు. దాన్ని వాడుకోవడం మంచిదే. కానీ, దానిమీద ఆధార పడి ఆలస్యం చేయడం మంచిది కాదు. నేను ఏ వాహనంమీద వచ్చాను అన్నది ముఖ్యం కాదు. నిర్ణీత సమయానికి రావడం ముఖ్యం.''

ఒకసారి పంజాబులో ఆయన పర్యటన జరుగుతోంది. అక్కడ చాలా రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులకు వరదలు వచ్చాయి. కాలువలన్నీ పొంగిపొరలుతున్నాయి గురూజీ జలంధర్‌నుంచి లూధియానా వెళ్ళాలి. అయన కారులో చహేడూవరకు వచ్చారు. ఆపైన వంతెన కూలి పోయింది. రైల్వేలైనుకు ప్రమాదం ఏర్పడింది. కనుక రైళ్ళ రాకపోకలు ఆగిపోయాయి. రైలు పట్టాలక్రింద ఉండే స్లీపర్లు వరదలలో కొట్టుకు పోయాయి. రైలు పట్టాలుమాత్రం వ్రేలాడుతున్నాయి. గురూజీ వెంటఉన్న కార్యకర్తలు ఏమి చేయాలా అని ఆలోచనలో పడ్డారు. ఈలోగా గురూజీ ఆ రైలు పట్టాలమీద నడుస్తూ వెళ్ళిపోతున్నారు. వ్రేలాడుతున్న రైలు పట్టాల మీద తన శరీరాన్ని 'బేలెన్స్' చేస్తూ వంతెన దాటుతున్నారు. క్రింద వరదనీరు పరవళ్ళు త్రొక్కుతోంది. అయినా అయన ఎక్కడా త్రొటు పడలేదు. ఎక్కడా ఆగలేదు. అలా తరగని వేగంతో ఆయన నడుస్తూనే ఉన్నారు. దైవ కృపవల్ల అందరూ క్షేమంగా అవలి ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ

ఒక కారు దొరికింది. కానీ, ఫగ్వాహాలో కారు దిగిపోవలసివచ్చింది. ఎందు కంటే రోడ్డు అంతా జలమయం అయిపోయింది. రాకపోకలు స్తంభించి పోయాయి రైల్వే స్టేషన్‌లో ఆ సమయం లో ప్రయాణికుల రైలు ఏదీ లేదు ఒక గూడ్సు బండిమాత్రం ఉంది. వారిని తీసుకువెళ్ళడానికి డ్రైవర్ ఒప్పుకున్నాడు. గురూజీ బొగ్గు వ్యాగన్‌మీద వెళ్ళి కూర్చున్నారు. అలా ఇరవై మైళ్ళు ప్రయాణంచేశారు. రైలు దిగేసరికి అందరి ముఖాలూ, బట్టలూ బొగ్గు మసి పట్టి నల్లగా తయారైనాయి. కూలిన వంతెనకు ఆవలి వైపునే సామాను వదిలివేశారు. గురూజీ నివాస స్థలానికి వెళ్ళారు. కాళ్ళు, మొగం కడుక్కొని, మరొకరి పంచ లాల్చీ వేసుకొని ఖచ్చితంగా వేళకు సంఘస్థాన్‌కు చేరారు.

29. భగవంతునిదే భారం

గురూజీ దేశమంతటా నిత్యం పర్యటిస్తూ ఉంటారు. వివిధ ప్రాంతా లలో, వివిధ గ్రామాలలో సంఘానికి బద్ధ విరోధులైన వ్యక్తులను ఎదుర్కొన వలసి వచ్చేది. ఒకోసారి ఆయనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగేవి. ఆయనపై రాళ్ళు రువ్వడమూ జరిగేది.

అయినా, గురూజీ ఎన్నడూ అడుగు వెనుకకు వేయలేదు. ఎన్నడూ మృత్యువును లెక్కచేయలేదు. "ముగ్గురు నలుగురు అంగరక్షకులు మీకు తప్పకుండా ఉండవలసిందే" అని పలువురు ఆయనకు సలహా ఇచ్చారు. ఆయన నవ్వుతూ ఇలా జవాబు చెప్పేవారు:" నాకు ఒకే ఒక అంగరక్షకుడు ఉన్నాడు. ఎన్నివేలమందిని అయినా తరిమికొట్టగల సామర్థ్యం అతనికి ఉంది. పరమేశ్వరుణ్ణి మించిన బలం ఎవరికి ఉంటుంది? అతడే నా రక్షకుడు. జాకో రాఖే సాఇయాఁ మార్ సకై నహిఁ కోయ్.

ఒకసారి ఒక విదేశీ ప్రముఖుడు గురూజీని కలుసుకోవడానికి వచ్చారు. ఆ రోజు సాయంత్రం సంఘ ఉత్సవం జరుగుతున్నది. ఉత్సవాన్ని చూడటానికి ఆయన వెళ్లారు. అక్కడి వ్యవస్థ చూసి ఆయన ఎంతో ఆందోళన చెందారు. ధ్వజం సమీపాన, సభావేదిక సమీపాన కొద్దిమంది స్వయంసేవకులు లాఠీలు పుచ్చుకొని నిలబడ్డారు. "ఆయన ఇంత పెద్ద నాయకులు కదా. ఆయన రక్షణకోసం ఏర్పాటు ఏదీ లేదేమి? ఎవరైనా తుపాకి గుండు వదిలితే ఏమవుతుంది?"-అని ఆయన పదే పదే ప్రశ్నించసాగారు.

ఉత్సవం చూసి, గురూజీ ప్రసంగం విని ఆయన ఎంతగానో ప్రభావితులు అయినారు. ఆయన ఇక ఉండబట్ట లేకపోయారు. గురూజీ బస చేసిన గృహానికి వెళ్లారు. గురూజీని కలుసుకుని, "మీరు మీ రక్షణకోసం ఎలాంటి ఏర్పాటు చేశారు? ప్రపంచంలో హత్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కనుక మీరు మీ రక్షణకు తగు ఏర్పాటు చేసుకోవాలి" అని సూచించారు.

గురూజీ ఎప్పటివలెనే గలగలా నవ్వారు "నేను అంత గొప్ప వ్యక్తిని కాను" అని సమాధానం చెప్పారు.

"గొప్ప వ్యక్తిని కానని మీరు అనుకోవచ్చు కానీ, ప్రజలు అలా అనుకోవడం లేదు. వ్యతిరేకులూ అలా అనుకోవడం లేదు. మీ వ్యతిరేకులు హత్యాకారులూ కావచ్చు"- అని ఆ ప్రముఖుడు వివరించారు.

"చూడండి. అంతా ఆ పరమేశ్వరుని సంకల్పంవల్లనే జరుగుతుందని నమ్మండి. ఇతడు జీవించింది చాలు, ఇతనివల్ల జరిపించ దలచిన పని జరిగింది- అని పరమేశ్వరుడు అనుకుంటే, ఆయన ఆ వ్యక్తిని తన వద్దకు పిలిపిస్తాడు. చూడండి. నిన్ననే కెన్నెడీ హత్య జరిగింది. ఆయన రక్షణకు భారీ ఏర్పాట్లు జరిగాయి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయి. అయినా ఆయన హత్య జరిగింది. సాధనాలకన్న, మనిషి చేసే ఏర్పాట్ల కన్న పరమేశ్వరుని

సంకల్పం గొప్పదని దాని అర్థం"- అని గురూజీ ఆ విదేశీ ప్రముఖునికి తెలియజెప్పారు.

30. నలభై వేల లేఖలు

సంఘ జీవితంలో, సంఘటనలో ఎన్నో అంతర్భాగాలు ఉన్నాయి. వ్యక్తిగత సంబంధాలను, స్నేహ సంబంధాలను పెంపొందించడం ఒక ప్రముఖ భాగం. గురూజీ ఆ సంబంధాలను ఎంతో శ్రద్ధగా పోషించేవారు. ఆయన కేవలం సరసంఘ చాలక్ కారు. వేలాది వ్యక్తులకు ఆయన మిత్రుడు ఆప్తుడు. పెద్ద దిక్కు. తండ్రి. సంరక్షకుడు. మార్గదర్శకుడు.

ఆయన తలుపులు అందరికీ తెరచే ఉంటాయి. పసివాడు మొదలు వృద్ధుని వరకు అందరూ ఆయనను కలుసుకునేవారు. మనసు విప్పి తమ కష్టాలు ఆయనకు వినిపించేవారు. ఆయన ప్రశాంతంగా ఆ గాథలన్నీ వినేవారు. చిక్కుముడులు విప్పేవారు.

ఇంత విస్తృత స్థాయిలో వ్యక్తిగత సంబంధాలను నిలిపి ఉంచే ఇంత పెద్ద నాయకుడు ప్రపంచం అంతటిలో మరొకరు లేరేమో. విద్యార్థులు ఆయనను తమ చదువు సంగతి అడుగుతారు. పెద్దలూ, వృద్ధులూ తమ కొడుకులూ కూతుళ్ల పెళ్ళిళ్ల విషయంలో ఆయనను సలహా అడుగుతారు. వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఆయనను కలుసుకొని ఆయన అభిప్రాయం తెలుసుకుంటారు. గాయకులు, వాద్య నిపుణులు, నాటక రచయితలు, నటులు ఆయన ఎదుట తమ తమ కళలు ప్రదర్శించి అభిప్రాయం అడుగుతారు. కొందరు యోగ సాధనలో ఆయన సహాయం కోరతారు. కొందరు వైద్యం కోసం వస్తారు. అందరినీ ఆయన ఎంతో ఆత్మీయతతో కలుసుకుంటారు.

ఆయన గుర్తుంచుకుని అందరికీ ఉత్తరాలు వ్రాసేవారు. వివాహ సమయాలలో శుభాకాంక్షలు పంపేవారు. ఎవరైనా చనిపోతే, వారి కుటుంబంలోని వ్యక్తులను కలుసుకొని ఓదార్చేవారు. సంఘ కార్యకర్తలకు ఉత్తరాలు వ్రాసి, వారిని ప్రోత్సహించేవారు. వారికి వెలుగు చూపేవారు. ఆయన రోజూ 9-10 ఉత్తరాలు తప్పక వ్రాసేవారు. ఉత్తరాలు స్వయంగా వ్రాసేవారు. ఎంతో వేగంగా వ్రాసేవారు. ఈ విధంగా, 33 సంవత్సరాలలో ఆయన నలభై వేల ఉత్తరాలు తప్పక వ్రాసి ఉంటారు. ఇన్ని ఉత్తరాలు వ్రాసినవారు ప్రపంచంలో అరుదుగానే ఉంటారు.

31. నీలి నీడ

1969 ఆగస్టు నెలలో జరిగిన సంఘటన. ఒక సన్యాసి గురూజీని కలుసుకోవడానికి వచ్చారు. ఆయన గురూజీకి చిరకాల మిత్రుడు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఇద్దరూ కలుసుకున్నారు. చూసీ చూడగానే ఇద్దరికీ అపారమైన ఆనందం కలిగింది. ఇద్దరూ గాఢంగా కౌగలించుకున్నారు. సుఖం కట్టలు త్రెంచుకునే క్షణాలలోనే దుఃఖ బీజాలు పడతాయంటారు పెద్దలు. అప్పుడు అదే జరిగి ఉండాలి. గురూజీ బనియన్ జేబులో పెన్ను ఉంది. ఆ ఆలింగనంలో పెన్ను గుండెకు గుచ్చుకుంది. కొద్దిగా నొప్పి పెట్టింది. ఆయన మిత్రునితో కబుర్లు చెప్పారు. సన్యాసి వెళ్లిపోయారు. అయినా నొప్పి నిలచిపోయింది. అక్కడ ఒక చిన్న బొడిపె కట్టినట్లు అనిపించింది. డాక్టర్లను పిలచారు. వైద్యులూ వచ్చారు. రకరకాల మందులు వాడారు. అయినా నొప్పి అలాగే ఉంది. అయితే, పర్యటన, సమావేశాలు, ఉపన్యాసాలు, బౌద్ధిక్ వర్గలవంటి కార్యక్రమాలు యథా ప్రకారం జరుగుతూనే ఉన్నాయి.

ప్రతి సంవత్సరం జరుగుతున్నట్లే, సంఘ శిక్షావర్గల సందర్భంగా గురూజీ పర్యటన ప్రారంభమైంది. అందుకోసం ఆయన పూనా వెళ్ళినప్పుడు డాక్టర్ నామ్ జోషీజీఆయనను పరీక్ష చేశారు. "ఈ నొప్పిని అశ్రద్ధ చేయకూడదు. మీరు బొంబాయి వెళ్లి ఆధునిక సాధనాలతో అన్ని రకాల పరీక్షలూ చేయించుకోవాలి."-అని సలహా ఇచ్చారు. బొంబాయిలో డాక్టర్ శ్రీఖండే, డాక్టర్ ఫడ్కే- ఆయన శరీరాన్ని పూర్తిగా పరీక్ష చేశారు. అది కేన్సరు వ్యాధి అని వారికి అనుమానం కలిగింది. కేన్సరు నిపుణుడు డాక్టర్ ప్రఫుల్లజీని పిలిపించారు. దురదృష్టవశాత్తు వారి అనుమానం నిజమైంది. తక్షణమే శస్త్ర చికిత్స జరిపించాలి. ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు"- అని డాక్టర్ ప్రఫుల్లజీ సలహా ఇచ్చారు. ప్రముఖ కార్యకర్తల గుండెలలో రాయి పడింది. సమాలోచనలు జరిగాయి. కానీ, గురూజీ తన నిర్ణయాన్ని ఇలా స్పష్టంగా ప్రకటించారు: "ఇప్పుడు కాదు. సంఘ శిక్షావర్గల పర్యటన కార్యక్రమం పూర్తయిన తర్వాత శస్త్ర చికిత్స జరుగుతుంది."

కేన్సరు పేరు వినగానే పలువురు గాబరా పడతారు. కానీ, గురూజీ ప్రశాంతంగా ఉన్నారు. తలమీద కత్తి వ్రేలాడుతోంది. అయినా ఆయన యధా ప్రకారం శిక్షావర్గ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. బౌద్ధికవర్గ, సమావేశాలు, హాస్య వినోదాలు అన్నీ ఎప్పటివలె జరిగిపోతున్నాయి.

పర్యటన పూర్తయింది. గురూజీ బొంబాయి వెళ్ళారు. ఆయన ఛాతీ మీద శస్త్రచికిత్స జరిగింది. కాన్సరు వ్యాపించిన భాగాలు అన్నింటినీ తొలగించారు. శస్త్రచికిత్స మూడు గంటలపాటు జరిగింది గురూజీ 26 రోజుల పాటు ఆస్పత్రిలో ఉండవలసి వచ్చింది. మనోబలం కారణంగా, ఆనందమయ స్వభావం కారణంగా ఆయన చాలా త్వరగా ఆరోగ్యం కోలుకున్నారు. క్రమక్రమంగా ఆయన పర్యటనకూడా ప్రారంభమైంది పలుమారులు జ్వరం వస్తూఉండేది. పలుమారులు స్పృహ తప్పిపోయేది. అయినా ఆయన

ద్వారా సంఘ కార్యం నిరాటంకంగా సాగుతూవచ్చింది. ఆ రోజుల్లో కొందరు ప్రముఖ కార్యకర్తలు తనువులు చాలించారు. మరెన్నో దెబ్బలు తగిలాయి అయినా ఆయన తపో యజ్ఞం సాగుతూనే ఉంది నిరాఘాటంగా.

"గురూజీ, ఇకమీదట మీరు మరింతగా విశ్రాంతి తీసుకోవాలి"-అని ఆయనను కలుసుకోవడానికి వచ్చే వ్యక్తులు సలహా ఇచ్చేవారు. ఆయన తక్షణం ఇలా సమాధానం చెప్పేవారు. "ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటే ఎలా? ఇప్పుడయితే కొద్ది సమయంలో హెచ్చుపని చెయ్యవలసి ఉంది. పరీక్ష పేపరు వ్రాస్తున్న విద్యార్థి చివరి అరగంటలో తన వ్రాత వేగం పెంచు తాడు. నేనుకూడా అలాగే చేయాలి."

ఒకోసారి ఆయన మరో జవాబు చెప్పేవారు: "విశ్రాంతి అంటూ తీసుకోవలసివస్తే కొద్దిగా ఎందుకు తీసుకోవాలి? శాశ్వత విశ్రాంతి ఎందుకు తీసుకోకూడదు?"

సంఘ చక్రం సాగిపోతోంది. పర్యటన, ఉత్తరాలు వ్రాయడం, వ్యక్తి గత సంపర్కం, బౌద్ధిక్ వర్గ, సమావేశాలు- అన్నీ యథాప్రకారం సాగి పోతున్నాయి.

ఎవరైనా ఔషధాలను గురించీ, పథ్య పానాలను గురించీ ప్రస్తావిస్తే- "శరీరం కొంత ఉపయోగపడినంతవరకే దాన్ని గురించి పట్టించుకోవాలి. పనికిరానప్పుడు దానికి చాకిరీ చేయడం అంటే శక్తినీ, సమయాన్నీ వృథా చేయడమే. ఈ శరీరం చివరికి నశించిపోయేదేకదా" అని జవాబిచ్చేవారు.

ఎవరైనా ఎంతో ఆందోళనతో తన ఆరోగ్యం గురించి మాట్లాడుతూ ఉంటే ఆయన, "నాకు ఎలాంటి బాధా లేదు. చూడండి, నేను లావవు తున్నాను. ముందు భుజం లావయింది. క్రమక్రమంగా శరీరమంతా లావుగా

బలంగా తయారవుతుంది''-అనేవారు. వెంటనే, తనను కలుసుకోవడానికి వచ్చినవారి ఆరోగ్యం గురించి కనుక్కొనేవారు.

కాన్సరువ్యాధి ఎంత భయంకరమైనదో ఎవరైనా వర్ణించటం ప్రారంభిస్తే, "ఆ కాన్సరు సంగతి వదిలెయ్యండి. అది వచ్చింది నన్ను తినేయడానికి. నేనే దానిని తినేశాను. దాని సంగతి ఎత్తకండి. మన సంఘం పని సంగతి చెప్పండి''-అనేవారు శ్రీ గురూజీ.

32. విజయ సందేశం

బొంబాయి సమీపాన ఠాణేలో అతిముఖ్యమైన సంఘ సమావేశం ఒకటి జరిగింది. 1972 అక్టోబరు 29 నుంచి నవంబరు 2 వరకు ఐదు రోజులపాటు జరిగింది. దేశంలోని ప్రముఖ కార్యకర్తలంతా సమావేశంలో పాల్గొన్నారు. సుమారు 450 మంది. శ్రీ గురూజీ తన ప్రముఖ సహచరులను సమావేశపరచారు. వారందరినీ ఒకసారి మనసారా చూసుకోవాలని అనిపించిందేమో ఆయనకు. సంఘానికి సంబంధించిన అనేక మౌలిక అంశాలపై అక్కడ కూలంకషంగా చర్చ జరిగింది. కార్యకర్తలు ఎన్నెన్నో ప్రశ్నలు అడిగారు. గురూజీ ఆ ప్రశ్నలు అన్నింటికీ సమగ్రంగా సమాధానాలు చెప్పారు.

రాష్ట్రీయ స్వయంసేవక సంఘ అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశం నాగపూరులోని కేంద్ర కార్యాలయంలో 1973 మార్చి 23 న జరిగింది. 25వ తేదీ ఉదయం శ్రీ గురూజీ సమారోప ప్రసంగం చేశారు. సుమారు 40 నిమిషాలపాటు ఆయన ప్రసంగించారు. అతి కష్టంమీద మాట్లాడారు. మధ్యలో ఆయాసం వచ్చేది. మధ్యలో దగ్గుతెరలు వచ్చేవి. అయినా తన అంతరంగంలోని ఆవేదనను కార్యకర్తలతో పంచుకోవడంలో

ఆయనకు ఆనందం కలుగుతోంది. గురూజీ అలా ఆగి ఆగి మాట్లాడు తున్నారు. అంతా ఏకాగ్రమైన మనసుతో వింటున్నారు. పలువురు కన్నీరు కార్చుతున్నారు. ఆ ప్రసంగం ఆయన తుది ప్రసంగంగానే పరిణమించింది ప్రసంగ సారాంశం ఇలా ఉంది:

"ఈ రోజుల్లో అన్ని సంస్థలలోనూ చీలికలు వస్తున్నాయి. జనం తగాదాలు పడుతున్నారు. ఒకరిపై మరొకరికి నమ్మకం ఉండడం లేదు ఇది విచారించదగ్గ విషయం.

"తగాదాలను తొలగించడానికీ, చీలిక మనస్తత్వాన్ని అంతమొందించ డానికీ మనం నడుం కట్టాం. సంఘటన మన ధ్యేయం. తగాదా పడడం, తగాదాలు కల్పించడం కాదు మన ధ్యేయం. ఈ విషయాన్ని మనం మన హృదయంలో స్థిరంగా నిలుపుకోవాలి. మన సోదరులు అందరికీ తెలియ జెప్పాలి. వారిహృదయాలలోముద్రించాలి. మనదేశంలో రకరకాల మనుషులు ఉన్నారు వారందరినీ మనం సంఘటితం చేయాలి ఒకరితో మరొకరు సర్దు కుంటూ ఏవిధంగా ముందుకుపోవాలో నేర్చుకోవాలి. ఇతరులకు నేర్పాలి. మన ధ్యేయం విషయంలో ఎలాంటి భ్రమలూ మన మనసులలో చోరనివ్వ కూడదు. మన సహచరుల విషయంలో ఎలాంటి అపోహాలూ మన మనసు లలో చోరనివ్వకూడదు.

మన స్వయంసేవకులు విద్య, రాజకీయాలు, సామాజిక కార్యాలు, ఆర్థికరంగం, ధర్మం మున్నగు వివిధక్షేత్రాలలో పని చేస్తున్నారు వారు ఆయా రంగాలలోని నియమ నిబంధనలను అక్షరాలా పాటించాలి సంఘం లోకి వచ్చి నేర్చుకున్న మంచి విషయాలను మనం ఇతర రంగాలలో, అన్ని రంగాలలో నాటాలి. వాటిని కాపాడాలి. పెంపొందించాలి. బయట ఉండే కలుషిత వాతావరణం ప్రభావం మనమీద పడకుండా మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

మనం ధ్యేయ ఆరాధకులం కావాలి. మన నిష్ఠ ఏకాగ్రం కావాలి. మన శీలం స్వచ్ఛంగా ఉండాలి. రాష్ట్రాన్ని శీలవంతం చేయడమే మన పని. శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి అనుభవం ఒకటి వినిపిస్తాను. విరాళాలు కోరుతూ చేసే విజ్ఞప్తుల క్రింద ఆయన ఎన్నడూ సంతకం పెట్టేవారు కారు. ఎందుకంటే, ఆ వ్యవహారంలో ఆయన చేదు అనుభవాలు అనేకం చవి చూశారు. అయినా, ఈ పని సంఘ స్వయంసేవకులు చేస్తారని నేను ఆయనకు ఉత్తరం వ్రాసేసరికి-ఆయన వెంటనే సంతకం పెట్టారు. "నాకు వీరి మీద నమ్మకం ఉంది. వీరు విరాళాలు ఏ పనికోసం సేకరిస్తారో ఆ పనికే ఖర్చు చేస్తారు"-అని ఆయన అప్పుడు అన్నారు. మనం మన ఆచరణ ద్వారా ఇలాంటి నమ్మకాన్ని అందరిలో కలిగించాలి. మన ఆచరణ అంతా దోషరహితంగా, మచ్చలేనిదిగా ఉండాలి.

మన శాఖలు సక్రమంగా నడవాలి. అక్కడ కార్యక్రమాలు క్రమ పద్ధతిలో జరగాలి. మనం మన ఆచార పద్ధతిని పాటించాలి. స్వయంసేవకుల స్వభావంలో మాధుర్యం నిండాలి. వారిలోని సుగుణాల రక్షణ, పోషణ జరుగుతూ ఉండాలి. శాఖలో ఇదంతా జరుగుతున్నదీ లేనిదీ మనం శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండాలి మనకు లభించిన విజయం వెనుక ఉన్న రహస్యం ఇదే. ఇది ఆసరాగానే మనకు అంతటా విజయం లభిస్తుంది.

ప్రతి విషయాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని నేడు ప్రజలు భావిస్తున్నారు. అదే సర్వరోగనివారిణి అని భావిస్తున్నారు. అయితే అదంతా వట్టి భ్రమ. మనల్ని తిరిగి దాస్య శృంఖాలాలలో బంధించే మార్గం అది.

"నేడు మన బాధ్యత మరింతగా పెరిగింది. రాష్ట్రంయొక్క ఆత్మను మనం మేలుకొలపాలి. మనం ప్రజలలో సౌశీల్యాన్ని నిర్మాణం చేయాలి.

అందరినీ సంఘటితం చేయాలి. ఇదే మన ధ్యేయం... అయితే ఈ పని తేలిక కాదు. నేడు దేశంలో విచ్ఛిన్నకర శక్తులు తమ కార్యకలాపాలను విస్తరింప జేస్తున్నాయి వాటి ప్రయత్నాలను మొదలంటా కూల్చివేయడానికై మనం మన శక్తిని బాగా పెంచుకోవాలి. మనం మన సంఘటనను సర్వవ్యాపిగా చేయవలసి ఉన్నది. అందుకోసం మనం మన కార్యక్షేత్రాలలో ప్రాణాలను పణంగా ఒడ్డి కృషి చేయవలసి ఉన్నది.

"ఇక ముగిస్తాను. ఈ సభలో మరోమారు మాట్లాడే అవకాశం భగవంతుడు ఇస్తాడో ఇవ్వడో తెలియదు."

33. మహాభి నిష్క్రమణం

1973లో వేసవికాలం ప్రారంభమైంది. ప్రతి ప్రాంతంలో సంఘ శిక్షావర్గలు నడుస్తున్నాయి. అయితే, ఆ వర్గలకు వెళ్ళడం శ్రీ గురూజీకి సాధ్యపడలేదు. తృతీయ వర్ష శిక్షణ నాగపూరులోనే జరుగుతుంది. ఆ శిక్షణ కోసం అన్ని ప్రాంతాలనుంచీ స్వయంసేవకులు నాగపూరు వస్తారు. ఆ స్వయంసేవకులను కలుసుకోవాలనే కోరిక గురూజీకి తీవ్రంగా ఉంది. కానీ, ఆయన శరీరం అందుకు అనువుగా లేదు. అందువల్ల సంఘ అధికారులు మధ్యేమార్గం అనుసరించారు. వివిధ ప్రాంతాల స్వయంసేవకులు వంతుల వారీగా ఆయనను కలుసుకుంటారు. అంతా ఆయన గదిలో వరుసలలో కూర్చుంటారు. ఒక్కొక్క స్వయంసేవకు పరిచయం చేసుకుంటాడు. గురూజీ మూడు నాలుగు నిముషాలు మాట్లాడతారు. స్వయంసేవకులు తిరిగి వెళతారు. అదీ ఏర్పాటు సమావేశం అరగంటలో పూర్తయ్యేది.

మే 26వరకు అలా సమావేశాలు జరిగాయి. కానీ, ఆతర్వాత గురూజీ ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఆయనకు ఊపిరి పీల్చడం కష్ట

మవుతున్నది. డాక్టర్లూ, వైద్యులూ మందులు ఇస్తూనే ఉన్నారు. కానీ ఆశించిన ఫలితం లభించడం లేదు.

1973 జూన్ 5 ఉదయం గురూజీ తన ఆంతరంగిక కార్యదర్శి డాక్టర్ ఆబాజీ థత్తేతో ఇలా అన్నారు : "ఆబా, ఈరోజున గంట కొడు తోందని అనిపిస్తోంది. పిలుపు వస్తుంది. ఇందులో విచారించ వలసిందేమీ లేదు. కానీ సంఘ శిక్షావర్గలు జరుగుతున్నాయి. మన కార్యకర్తలు అందరూ పర్యటనలో ఉన్నారు. వారి కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా ఉండాలని నా కోరిక."

గురూజీ కొన్ని కొన్ని విషయాలలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపు తారు. ఆయన గురుదేవులు అఖండానందజీ ఆయనకు ఒక కమండలువు ఇచ్చారు. అది ఆయనకు ప్రియమైన వస్తువు దానిని ఎప్పుడూ తన ఎడమ వైపున ఉంచేవారు ఆయన. ప్రయాణానికి బయలుదేరేటప్పుడు మాత్రం కుడివైపున ఉంచేవారు. ఆరోజు ఉదయం ఆయన కమండలువును కుడి వైపున ఉంచారు. పెద్ద ప్రయాణానికి ఆయన సిద్ధమైనారు.

డాక్టర్లు ఎందరో వచ్చారు. పరీక్షలు జరిపారు." శరీరం బాగా బల హీనం అయిపోయింది. ఏమాత్రం కదలకూడదు" అని సలహా ఇచ్చారు. అది సాధ్యమయ్యే పని కాదు. గురూజీ పడకకుర్చీలో కూర్చున్నారు. నామ స్మరణ చేస్తున్నారు. దైవచింతనలో లీనమైనారు. ఆయన నేత్రాలు అర్ధ నిమీలితమై ఉన్నాయి ఆయన దృష్టి నాసికాగ్రంపై లగ్నమై ఉంది.

డాక్టర్లు ఏవో కృత్రిమ ఉపాయాలు సూచించారు. గురూజీ ఎంతో సౌమ్యంగా అవేవీ వద్దన్నారు. ఆయన మధ్యాహ్నం నామమాత్రంగా భోజ నం చేశారు. సాయంత్రం కొద్దిగా టీ త్రాగారు ఆయన మాటిమాటికీ కాళ్ళు కడుక్కుంటున్నారు చేతులు కడుక్కుంటున్నారు. పుక్కిలిస్తున్నారు సాయంత్రం 7-10 అయింది. అప్పుడు ప్రార్థన జరుగుతుంది నాటివరకు ఆయన ఎప్పుడూ ప్రార్థన మానలేదు. ఆయన లేవబోయారు. "ఈరోజున మీరు కూర్చునే ప్రార్థన చేయాలి"-అని డాక్టర్ ఆబా అన్నారు. ఆ

ప్రకారం పడకకుర్చీలో కూర్చుని గురూజీ ప్రార్థన చెప్పారు. ఉచ్చారణ చాలా స్పష్టంగా ఉంది.

రాత్రి 9-5కు ఆయన ఒక దీర్ఘశ్వాస పీల్చారు. ఇహలోకయాత్ర చాలించారు. 33 సంవత్సరాలుగా అగ్నికుండం మండుతోంది. భగభగ మండుతోంది. అది నేడు చల్లబడింది. మహా జీవనయజ్ఞం ముగిసింది. 67 సంవత్సరాలపాటు విచ్చుకుంటూన్న వికసిస్తూన్న సుందర సుగంధ జీవన పుష్పం భరతమాత చరణాలకు అర్పితం అయింది. "మహామంగలే పుణ్య భూమే త్వదర్థే పతత్వేష కాయో నమస్తే నమస్తే" అనే స్వయంసేవకుని ఆకాంక్ష సఫలమైంది.

34. స్మారకం వద్దు

ఆ దుర్వార్త వాయు వేగంతో దూర దూరాలకు చేరింది "మన పరమపూజనీయ శ్రీ గురూజీ పోయారు" అనే వార్త ప్రాంత ప్రాంతానికి, గ్రామ గ్రామానికీ అందింది. "మన ద్వితీయ సర సంఘచాలక్ ఇక లేరు"- అంటూ ఇంటింటా ఆర్తనాదాలు వెలికివచ్చాయి. "మన మూలాధారం పోయింది", "స్వార్థం, పక్షపాతం ఎరుగని దేశ నాయకుడు కనుమరుగైనారు". "అయ్యో! ఆయన అందరికీ మార్గదర్శకులే"- అంటూ వేదనా స్వరాలు వెలువడ్డాయి.

అంతిమ దర్శనంకోసం నాగపూరు స్వయంసేవకులు సంఘ కార్యాలయానికి వస్తున్నారు. ఇతర స్థలాలనుంచీ, ఇతర ప్రాంతాలనుంచీ రైళ్లనిండా ప్రజలు వస్తున్నారు. కార్లలో వచ్చేవారు కొందరు. విమానాలలో వచ్చేవారు కొందరు. అన్ని పార్టీలవారూ, అన్ని వయస్సులవారూ వస్తున్నారు. 5వ తేదీ అర్ధరాత్రి నుంచి 6వ తేదీ సాయంత్రం వరకు దర్శనార్థుల వరుసలు అలా పెరుగుతూనే ఉన్నాయి. పువ్వులకూ, పూల మాలలకూ ఎప్పుడూ దూరంగా ఉండే ఆయన శరీరంపై పూలమాలలూ, పువ్వులూ గుట్టలు గుట్టలుగా ఉన్నాయి ఆయన ఎప్పుడూ ఎవరినీ తన కాళ్లు తాకనిచ్చేవారు కారు. ఇప్పుడు పెద్ద పెద్ద వ్యక్తులు ఆయన కాళ్లు పుచ్చుకుని కన్నీరు కార్చుతున్నారు.

6వ తేదే సాయంత్రం అపూర్వమైన ఆ అంతిమయాత్రకు సన్నాహాలు జరిగాయి. మహా యాత్ర ప్రారంభం కావడానికి ముందు శ్రీ గురూజీ ఇచ్చిన అతికించి ఉన్న కవర్లు చించారు. ఆ కవర్లలో ఉన్న లేఖలను మైక్ ముందు చదివారు. మొదటి ఉత్తరాన్ని మహారాష్ట్ర ప్రాంత సంఘచాలక్ స్వర్గీయ శ్రీ బాబారావ్ భిడేజీ చదివారు

"... ఇతర ప్రాంత సంఘచాలక్‌లతో నేను ఈ విషయం చర్చించాను. మన ప్రముఖ కార్యకర్తలతో సమాలోచన జరిపాను ఆ సంప్రదింపుల సారాంశంగా రూపొందిన నిర్ణయాన్ని నేను ప్రకటిస్తున్నాను..... నా తదనంతరం సరసంఘచాలక్ బాధ్యతను శ్రీ యుత మధుకర దత్తాత్రేయ (బాలాసాహబ్) దేవరస్ నిర్వహిస్తారు. మన కార్యం ధ్యేయ నిష్ఠం. వ్యక్తి నిష్ఠం కాదు అందువల్ల స్వయంసేవకులు అందరూ పరమపూజనీయ సరసంఘచాలక్ జీ నాయకత్వంలో సంఘకార్యం నిర్వహించాలి. అందుకోసమే మనో వాక్ కాయములతో క్రియాశీలురం కావాలి."

మిగిలిన ఉత్తరాలు రెంటినీ పరమపూజనీయ శ్రీ బాలాసాహబ్ దేవరస్‌జీ చదివి వినిపించారు. రెండవ ఉత్తరంలో ఇలా ఉంది.

"... మన కార్యంలో రాష్ట్ర పూజ ఉంది. ధ్యేయ పూజ ఉంది. వ్యక్తి పూజ లేదు..... నాకు ఎలాంటి స్మారకమూ నిర్మించవద్దు .. వ్యక్తి యొక్క గొప్పతనాన్ని పెంచవద్దు. నేను బ్రహ్మకపాలంలో ఆత్మశ్రాద్ధం చేసుకున్నాను. అందువల్ల మతపరంగాకూడా కర్మలు జరపడం అనవసరం."

మూడవ ఉత్తరం ఎద లోతులను తాకే ఉత్తరం. ఆ లేఖ ఇలా ఉంది:

".... పరమపూజనీయ శ్రీ డాక్టర్‌జీ 1940 జూన్ 21న ఇహలోక లీల చాలించారు. ఆ తర్వాత ఈ మహా కార్యం యొక్క భారం నా తల మీద పడింది. అప్పుడు నాకు అసలు సంఘకార్యంలో అనుభవమే లేదు. అయితే, మన పాత కార్యకర్తలు నన్ను ఆదుకున్నారు.... 33 సంవత్సరాల పాటు నేను ఈ కార్యాన్ని చేస్తూ వచ్చాను. సుదీర్ఘమైన ఈ కాలంలో నా

స్వభావంలోని విచిత్ర లక్షణంవల్ల కాని, ఇతర దోషాలవల్ల కాని నేన పలువురు కార్యకర్తలకు కష్టం కలిగించి ఉండవచ్చు. నన్ను క్షమించ వలసిందిగా వారందరినీ నేను చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. నా హృదయంలోని భావనలను నేను సంత్ తుకారామ్‌జీ మాటలలో వ్యక్త చేస్తున్నాను.

అంతిమ హై యహ ప్రార్థనా। సంత్‌జన సునేఁ సభీ॥
విస్మరణ నహో మేరా। ఆపకో ప్రభో కభీ ॥
అధిక ఔర్ క్యా కహూఁ। విదిత సభీ శ్రీ చరణోఁ మేఁ॥
తుకా కహే చరణ గహూఁ। రఖేఁ కృపాకీ ఛాఁహమే ॥

—నా కడసారి ప్రార్థన ఇది. సాధువులు, సంత్‌లు అంతా వినండి నన్ను ఎప్పుడూ మరువకండి. ఇంకా చెప్పేది ఏముంది ? అంతా మీక తెలిసిందే. మీ కృప అనే గొడుగు నీడను కోరుతూ మీ పాదాలు అంట తుకారామ్ చెపుతున్న మాట ఇది.

ఆ లేఖలు చదువుతున్నప్పుడు పరమపూజనీయ శ్రీ బాలాసాహ స్వరం గద్గదం అయింది. వాటిని వింటున్న ... వేలాది స్వయంసేవకు కళ్లనుండి కన్నీటి ధారలు ప్రవహించాయి.

మహాయాత్ర ప్రారంభమైంది. నిర్ణీత సమయానికి రేషిమ్ బా సంఘస్థాన్ చేరింది. ఆద్య సరసంఘచాలక్ పరమ పూజనీయ డాక్టర హెడగెవార్‌జీ విగ్రహం ఎదుట శ్రీ గురూజీ భౌతిక దేహానికి అగ్ని సంస్కారం జరిగింది. శ్రీ గురూజీ జీవనమూ అగ్నిమయమే. ఆ జీవన ఒక యజ్ఞం. ఆ జీవన యజ్ఞ జ్వాలలు పైకి ఎగశాయి. ఆకాశాన్ని అంట తున్నాయి దశదిశలా వ్యాపించాయి. ఎందరెందరో అందులోనుండి తేజ కణాలను పొంది తమ అంతఃకరణాలను వెలిగించుకున్నారు. ఎందరెందర ఆ అగ్ని శిఖలనుంచి కొత్త వెలుగులు పొందారు. ఎందరెందరో ఆ వెలుగు వెల్లువలో కొత్త కొత్త బాటలు దర్శించారు.